సోమవారం
26•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 62
• పేజీలు: 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD










యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగరావు, కలెక్టర్ అనితారామచంద్రన్

## యాదాద్రికి పోటెత్తిన భక్తజనం

**యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పంచ నారసింహుడు కొలువుదీరిన యాదాద్రి ఆదివారం భక్తజనులతో పులకించింది. కొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకొనేందుకు గంటల కొద్దీ క్యూలో నిల్చున్నారు. శ్రీసత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీవారి ఖజానాకు రూ.30,40,791 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

**యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనుల పరిశీలన**

సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగరావు ఆదివారం యాదాద్రి పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ప్రధానాలయాన్ని సందర్శించి పనులు జరుగుతున్న తీరును శిల్పులు, వైటీడీఏ అధికారులతో మాట్లాడి తెలుసుకొన్నారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకొన్నారు. ఆయన వెంట కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలయ ఈవో గీత ఉన్నారు.



యాదాద్రి కొండపైన స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తజనం



### భద్రాద్రిలో ఘనంగా ఉట్ల పండుగ

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహించిన ఉట్టి కొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న భక్తజనం.

– భద్రాచలం, నమస్తే తెలంగాణ



## నక్సలిజంపై నేడు ఢిల్లీలో సమావేశం

- హాజరుకానున్న హోంమంత్రి, సీఎస్, డీజీపీ
- ఏపీ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నక్సలిజంపై కేంద్ర హోంశాఖ ఢిల్లీలో సోమవారం నిర్వహించే సమావేశానికి తెలంగాణ నుంచి హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారు. ఈ సమావేశంలో ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావంపై చర్చ జరుగనున్నదని సమాచారం. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొన్న తర్వాత ఏపీ సీఎం జగన్.. కేంద్రంలోని పలువురు ప్రముఖులను కలుసుకొనే అవకాశమున్నది. మంగళవారం మధ్యాహ్నానికి ఆయన తిరిగి విజయవాడ చేరుకుంటారని అధికారవర్గాలు తెలిపాయి.

## తలాక్ చెప్పిన భర్తపై రాజస్థాన్‌లో కేసు

- బాధితురాలు హైదరాబాదీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ముమ్మారు తలాక్ చెప్పిన ఓ భర్తపై రాజస్థాన్ చురు జిల్లాలో కేసు నమోదయింది. హైదరాబాద్‌కు చెందిన జైనాబ్‌కు (40) రాజస్థాన్‌కు చెందిన ఆయూబ్‌తో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఇటీవల ఆయూబ్ ఆమెకు మూడుసార్లు తలాక్ చెప్పాడు. దీనిపై ఆమె సుజాన్‌ఘర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులోని అంశాలపై విచారణ చేపట్టిన పోలీసులు ఆమె భర్త ఆయూబ్‌తోపాటు అతని సోదరుడు ఇమ్రాన్, ఆయూబ్ మొదటి భార్య రజియాపై కేసు నమోదు చేసినట్టు పోలీస్‌స్టేషన్ అధికారి పృథ్వీరాజ్ తెలిపారు.

# రుణలక్ష్యం 6,584 కోట్లు

### 26 బ్యాంకుల నుంచి 3,44,353 మహిళా సంఘాలకు రుణాలు

- కొత్త సంఘాలకు రూ.120 కోట్లు
- వ్యవసాయం, వ్యాపారానికి ప్రాధాన్యం
- వచ్చేనెల నుంచి మొదలుకానున్న రుణాల మంజూరు
- గతేడాది రూ.6,166 కోట్ల రుణాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వారికి వ్యవసాయం, వ్యాపారంగాల్లో మరింత ప్రోత్సాహమిచ్చేందుకు ఈసారి భారీగా రుణసాయం చేయనున్నారు. రాష్ట్రంలోని మహిళాసంఘాలకు ఈ ఏడాది రూ. 6,584.13 కోట్ల రుణాలిచ్చేందుకు ప్రణాళిక సిద్ధంచేశారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో నాలుగు విడుతల్లో 26 బ్యాంకుల నుంచి 3,44,353 మహిళా సంఘాలకు ఈ రుణాలను అందజేయనున్నారు. మహిళా సంఘాలకు రుణసాయం, దానితో వ్యాపారంచేసే అంశాలపై గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సర్వేమొదలైంది. గతంలో ఎరువుల అమ్మకం, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, స్థానిక అవసరాలకు అనుగుణంగా చేసిన వ్యాపారాలు, లాభాలపై ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఫార్మాట్‌లో గ్రామాల్లో మహిళా సంఘాల నుంచి వివరాలను సేకరిస్తున్న సర్వే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూర్ నుంచి మొదలైంది. ఈ నెలాఖరులోగా పూర్తి నివేదికను సిద్ధంచేసి, వచ్చేనెల నుంచి రుణ మంజూరు చేపట్టాలని భావిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి మహిళాసంఘాల రుణాల మంజూరు అంశాన్ని వేగవంతం చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

**మహిళా రుణాలతో వ్యవసాయ పనులు**

మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో వ్యవసాయ పనులకు వెచ్చించడం మరో రికార్డుగా నిలిచింది. వ్యవసాయరంగానికి కూడా మహిళా సంఘాలు రుణాలు తీసుకున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో మహిళాసంఘాల సభ్యులు ఏ ఏ పనులు చేస్తున్నారనే అంశంపై సెర్ప్ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి మహిళలు సంఘాల నుంచి తీసుకున్న రుణాలతో వ్యవసాయ పనులు చేయడం మొదలుపెట్టారు. తొలి ఏడాది మహిళా సంఘాల్లో సభ్యులు వ్యవసాయ పనుల కోసం రూ. 1561.86 కోట్లను వినియోగించారు. మొత్తం విడుదల చేసిన రుణాల్లో 30.1 శాతం వ్యవసాయ పనులు కోసం వెచ్చించారు. అదే విధంగా గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 807.49 కోట్లను వ్యవసాయానికి వినియోగించారు. మొత్తం రుణాల్లో 28.7 శాతం వ్యవసాయ పనులకు వెచ్చించి ఆర్థిక ప్రగతి సాధించారు.

**చెల్లింపుల్లో ముందే**

గతేడాది వార్షిక ప్రణాళిక ప్రకారం 3,01,596 మహిళా సంఘాలకు రూ. 6,048.27 కోట్ల వార్షిక రుణ లక్ష్యం ఉండగా.. లక్ష్యానికి మించి రుణాలిచ్చారు. రుణ పరిమితి పెరుగడం, వాయిదాల చెల్లింపులు సక్రమంగా ఉండటంతో బ్యాంకులు పోటీపడీ రుణాలిచ్చాయి. గతేడాది 1,51,598 సంఘాలకు రూ.6,166 కోట్ల రుణాలిచ్చారు. రుణ లక్ష్యంలో 102 శాతాన్ని చేరుకుని రికార్డు సాధించాయి. గతేడాది రీజినల్ రూరల్ బ్యాంకులు అత్యధికంగా రుణాలిచ్చాయి. తీసుకున్న రుణాలు సకాలంలో క్రమంతప్పక చెల్లించడంలో మహిళా సంఘాలు ముందున్నాయి. దాదాపు దేశంలో రుణవాయిదాల చెల్లింపులో మన రాష్ట్రం ప్రథమంగా కొనసాగుతున్నది. 98.7 శాతం రుణాల తిరిగి చెల్లింపులు చేస్తున్నది.



### నాలుగు విడుతల్లో రుణాలు

బ్యాంకుల నుంచి ఎలాంటి గ్యారంటీ లేకుండా రుణాలు తీసుకోవడం, వాటితో లాభదాయకమైన వ్యాపారం చేయడంలో తెలంగాణ మహిళలు దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించిన విషయం తెలిసిందే. మహిళాసంఘాలకు ఈ ఏడాది బ్యాంకులు మొత్తం రూ.6,584.13 కోట్ల రుణ లక్ష్యం విధించుకున్నాయి. నాలుగువిడుతల్లో ఈ రుణాలు ఇవ్వనున్నారు. ఈసారి కొత్తగా ఏర్పాటైన 12,025 మహిళా సంఘాలకు కూడా రుణాలివ్వాలని సెర్ప్, బ్యాంకర్లు నిర్ణయించారు. ఒక్కో సంఘానికి రూ.50వేల చొప్పున రూ.120.25 కోట్లు ఇవ్వనున్నారు. అదేవిధంగా ఇప్పటికే సక్రమ చెల్లింపులు చేసిన 3,32,328 సంఘాలకు రూ. 6,468.88 కోట్ల రుణాలుగా ఇవ్వనున్నారు. రుణాలివ్వడంలో కమర్షియల్ బ్యాంకుల కంటే గ్రామీణ బ్యాంకులే ముందుంటున్నాయి. తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి 50,601 మహిళా సంఘాలకు రూ. 936.53 కోట్లు, ఏపీజీవీబీ నుంచి 88,754 సంఘాలకు రూ. 1912.32 కోట్లను ఈ ఏడాది రుణంగా ఇవ్వనున్నాయి. రాష్ట్రంలోని 16 కమర్షియల్ బ్యాంకుల పరిధిలో మొత్తం 2,01,296 స్వశక్తి సంఘాలకు రూ. 3650.22 కోట్లు ఇవ్వనున్నారు. అత్యధికంగా ఎస్బీఐ రూ.1,782.05 కోట్లు, ఆ తర్వాత ఆంధ్రాబ్యాంక్ రూ. 874.85 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈసారి డీసీసీబీ బ్యాంకులు కూడా రుణలక్ష్యాన్ని విధించుకున్నాయి. 8 జిల్లాల్లోని డీసీసీబీ బ్యాంకులు ఈ ఏడాది 3617 మహిళా సంఘాలకు రూ. 83.05 కోట్లు రుణాలివ్వనున్నాయి. అత్యధికంగా కరీంనగర్ డీసీసీబీ 1389 సంఘాలకు రూ. 33.55 కోట్లు, మిగిలిన ప్రాంతాల్లో స్థానిక బ్యాంకులు రూ. 2.02 కోట్ల రుణాలుగా ఇవ్వనున్నారు.



సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో రైతు సమగ్ర సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

## జోరుగా రైతు సమగ్ర సర్వే

- 13 జిల్లాల్లో 50% పైగా పూర్తి
- భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ జిల్లాల్లో 93 శాతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా రైతుల పూర్తి వివరాలతోపాటు సాగు విస్తీర్ణం, నీటి వసతులు తదితర సమాచార సేకరణ (బిగ్ డాటా) కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. ప్రధానంగా ఈ ఏడాది వానకాలం రైతులవారీగా పంటల సాగు విస్తీర్ణం వివరాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు 13 జిల్లాల్లో 50 శాతం మేర పూర్తయ్యాయి. దీని ఆధారంగా రానున్నరోజుల్లో పంట ఉత్పత్తులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది. దీనిపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుత వానకాలం నుంచే రైతులవారీగా సాగు చేసిన పంటల విస్తీర్ణం ఆధారంగా మద్దతు ధరకు ఉత్పత్తులను కొనుగోలు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నారు. దీనికి రైతుల సమాచారంతోపాటు సాగైన పంటల వివరాలను జతచేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు వివిధ పనులతో తీరిక లేకుండా ఉండటంతో సర్వే పనులు వెంటనే పూర్తిచేయలేకపోతున్నట్టు చెప్తున్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరుకు ముగించాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

**ఆన్‌లైన్లో 25లక్షల రైతుల వివరాలు నమోదు**

రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో రైతు సమగ్ర సర్వే కొనసాగుతున్నది. 10,880 గ్రామాల్లో 56,80,694 మంది రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను సేకరించి ఏఈవోలు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉన్నది. ఇందులో ఇప్పటివరకు 25,79,590 మంది రైతుల వివరాలు అప్‌డేట్ చేశారు. మరో 31 లక్షల మంది రైతుల వివరాలు సేకరించాల్సి ఉన్నది. భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 93 శాతం, మంచిర్యాలలో 85, నిర్మల్‌లో 71, వికారాబాద్‌లో 69, మహబూబాబాద్‌లో 67, నారాయణపేట 66, కరీంనగర్ 65, ఖమ్మం, జగిత్యాల జిల్లాల్లో 59 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 51 శాతం రైతులవారీగా పంటల సాగు విస్తీర్ణం వివరాలు నమోదయ్యాయి. ఈ విధానం ద్వారా దళారీ వ్యవస్థను అరికట్టి పంట సాగు చేసే రైతుకు మద్దతు ధర అందించాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష. అందులో భాగంగానే ఈ సర్వే చేస్తున్నట్టు సమాచారం. ఈ వివరాల ఆధారంగా ఏ జిల్లాలో ఏ మండలం, ఏ గ్రామంలోని రైతు ఏ సర్వేనంబర్లో ఎంత భూమి సాగుచేస్తున్నది ఒక్క క్లిక్ ద్వారా తెలిసిపోనున్నది. ఈ వివరాల ఆధారంగానే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు పంట కాలనీల ఏర్పాటు ఉండాలనేది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తున్నది.



తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు రచించిన 'బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కే కేశవరావు

## బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్

- పుస్తకావిష్కరణలో ఎంపీ కే కేశవరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీపీ మండల్ బీసీల ఆశాజ్యోతి అని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు అన్నారు. సామాజిక న్యాయం దిశగా దేశం పురోభివృద్ధి సాధించేందుకు బీపీ మండల్ ప్రతిపాదనలు బాటలు వేశాయని చెప్పారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు రాసిన 'బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కేశవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ సేవలు చిరస్మరణీయమని, ఆయన తన రాజకీయ జీవితంలో సోషలిస్టు భావాల ఆలోచనాపరుడిగా, సమసమాజాన్ని కాంక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎంబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

## సెలవుల్లోనూ విషజ్వరాలకు చికిత్స

- పలు దవాఖానల్లో ఆదివారం కూడా ఓపీ సేవలు
- ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్న వైద్యారోగ్యశాఖ




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో విషజ్వరాలకు గురైనవారికి తక్షణం వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ దవాఖానల్లో సెలవురోజుల్లో కూడా వైద్యులు చికిత్స చేస్తున్నారు. ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులను అడ్డుకొనేందుకు వైద్యారోగ్యశాఖ ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నది. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు విస్తరిస్తుండటంతో రాష్ట్రంలోని అన్ని దవాఖానల్లో, బోధనాహాస్పిటళ్లలో ఆదివారం, ఇతర సెలవుదినాల్లోనూ వైద్యులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోధన దవాఖానలతోపాటు హైదరాబాద్‌లోని ఫీవర్ హాస్పిటల్, ఈఎన్టీ, నీలోఫర్, ఇతర దవాఖానల్లో ఓపీ, డయాగ్నోసిస్ సేవలు అందించేందుకు వైద్యులు ముందుకొచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నది. అన్ని శాఖలు సమన్వయంతో దోమల నిర్మూలన, రక్షిత తాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 1,697 గ్రామాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ, డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణ, నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వ్యాధికారకాలను నియంత్రించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఐటీడీఏ, గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, పారా మెడికల్ సిబ్బంది వద్ద తగిన మందులు అందుబాటులో ఉంచారు. మలేరియా వ్యాధి ప్రభావం ప్రధానంగా ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాల్లో ఉంటుందని గుర్తించారు. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్ అర్బన్, మేడ్చల్ జిల్లాల పరిధిలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

## ఉపగ్రహ చిత్రాలతో పంటల అంచనా

- బీమా పరిహారం ఆలస్యమైతే కంపెనీలకు జరిమానా
- అన్ని రాష్ట్రాల వ్యవసాయశాఖలకు కేంద్రం ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంటల స్థితిగతులను అంచనా వేసేందుకు ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించుకోవాలని కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాల వ్యవసాయశాఖలను ఆదేశించింది. జిల్లాస్థాయిలో పంటల పరిస్థితిని, వాటి విస్తీర్ణాన్ని, దిగుబడిని పరిశీలించి వ్యవసాయ ఉత్పాదకతను అంచనా వేసేందుకు ఉపగ్రహ చిత్రాలను ఉపయోగిస్తారు. వీటితోపాటు కరువును అంచనా వేసేందుకు కూడా ఉపగ్రహ డాటాను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద రైతులు పంట నష్టపరిహారాన్ని పొందడంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పరిశీలనపైనే ఆధారపడుతుండటం, నష్టానికి సంబంధించిన అంచనాలు సకాలంలో పూర్తి కాకపోవడంతో పరిహారం అందజేయడం మరింత జాప్యమవుతున్నది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కేంద్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. పీఎంఎఫ్‌బీవై కింద ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పంటకోత ప్రయోగాలకు ప్రత్యామ్నాయంగా సాంకేతికతను ఉపయోగించి పైలట్ అధ్యయనాలు నిర్వహించే బాధ్యతలను 8 ఏజెన్సీలకు అప్పగించింది. దిగుబడి అంచనా కోసం బీమా యూనిట్‌స్థాయికి అనుగుణంగా పంటకోత ప్రయోగాల సంఖ్యను తగ్గించేందుకు శాటిలైట్ డాటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మోడలింగ్ టూల్స్ టెక్నాలజీలను ఉపయోగించాలనేది సర్కారు ఉద్దేశం. రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారి క్లెయిమ్స్‌ను సకాలంలో చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్‌బీవై పథకానికి అనేక సవరణలు చేసింది. నిర్దేశిత గడువు తేదీ ముగిసిన తర్వాత 10 రోజుల్లోగా క్లెయిమ్స్‌ను సెటిల్ చేయకపోతే బీమా కంపెనీలు జరిమానా కింద ఏడాదికి 12 శాతం వడ్డీని రైతులకు చెల్లించాలని స్పష్టంచేసింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో క్లెయిముల పరిష్కారం సందర్భంగా బీమా కంపెనీలు జరిమానా చెల్లింపునకు నిరాకరిస్తున్నట్టు కేంద్రం దృష్టికి రావడంతో ఆ ప్రక్రియపై దృష్టిసారించాలని రాష్ట్రాలను ఆదేశించింది. క్లెయిమ్స్ సెటిల్మెంట్‌లో ఆలస్యంచేస్తే బీమా కంపెనీలతోపాటు రాష్ట్రాలకు కూడా జరిమానా విధిస్తామని, బీమా కంపెనీలకు రాష్ట్రాలు వాటా సబ్సిడీ సొమ్మును చెల్లించడంలో మూడు నెలలకు మించి జాప్యం జరిగితే ఆయా రాష్ట్రాలు 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రైతులకు సక్రమంగా బీమా సేవలను అందజేయడంలో విఫలమైన కంపెనీలను రద్దుచేయాలని కూడా కేంద్రం ఆదేశించింది.

## బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి



ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన బీపీ మండల్ జయంతి సమావేశంలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపు
- ప్రెస్‌క్లబ్‌లో బీపీ మండల్ జయంతి సభ

**బషీర్‌బాగ్:** రిజర్వేషన్లను రద్దుచేసేందుకు ఆరెస్సెస్, బీజేపీ చేస్తున్న కుట్రలను తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా ఏకమై తిప్పికొట్టాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకోగానే తెలంగాణలో బీజం వేశామనడం వాపును చూసి బలుపు అనుకోవడమేనని ఎద్దేవా చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జనశక్తి, మాదిగ జేఏసీ, గిరిజన శక్తి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 'జాతీయవాదం ముసుగులో రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని రద్దుచేసే కుట్ర' అంశంపై జరిగిన సమావేశంలో అల్లం నారాయణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ, అమిత్‌షా రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే కుట్ర చేస్తున్నారని, వారి కబంధహస్తాల్లో దేశం బందీగా మారిందని మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దుతో ఏదో చేశామన్న భ్రమలో బీజేపీ ప్రభుత్వం తేలియాడుతున్నదని విమర్శించారు. దక్షిణాదిపై వివక్ష చూపుతూ, దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. బహుజన రాజ్య సాధనకు ముందుకుసాగాలని కోరారు. సీఎం పీఆర్వో రమేశ్ హజారి మాట్లాడుతూ రిజర్వేషన్లకు, రాజ్యాంగానికి బీజేపీ మొదటి నుంచి వ్యతిరేకమేనని, మతతత్వవాదాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీసీ జనశక్తి అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, గిరిజన జేఏసీ నాయకుడు రాజేశ్‌నాయక్, తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డె ఎల్లన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యపై సర్కారు దృష్టి

- కొనసాగుతున్న హాజరు మాసోత్సవం
- సెప్టెంబర్‌లో నాణ్యతపై కార్యక్రమాలు
- పదోతరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు
- అధికారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో చేపట్టిన హాజరు మాసోత్సవంతో మంచి ఫలితం కనిపిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, ప్రాధాన్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు కూడా ముందుకు వస్తున్నారని, ఇది శుభపరిణామంగా భావిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు వస్తే సహజంగానే విద్యాభ్యాసం బాగుంటుందని, ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో హాజరు పెరిగిందని అన్నారు.

**సమగ్ర ప్రణాళికతో నాణ్యత మాసోత్సవాలు**

పాఠశాల విద్యలో నాణ్యతకు విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆదేశాలతో ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్‌లో 'నాణ్యత మాసోత్సవం' నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ కార్యదర్శి తెలిపారు. అధికారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ఏయే కార్యక్రమాలు నిర్వహించాలనే అంశాలతో సమగ్ర ప్రణాళికలను, మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం విద్యార్థులే స్వయంగా తాము ఎంతవరకు చదువుకున్నామో, ఎంత నేర్చుకున్నామో తెలుసుకోవడానికి స్వీయ పరీక్ష నిర్వహించుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోనున్నారు.



**పదో తరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు**

అన్ని రకాల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వారి భవిష్యత్తు ఏమిటి? అని తెలుసుకునేందుకు ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థతో కలిసి సైకోమెట్రిక్ పరీక్షలను నిర్వహించబోతున్నారు. తొలుత రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే ఆలోచన చేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు.

## వ్యవసాయం, పశుసంవర్ధకంపై ఎల్లుండి నుంచి అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయం, పశుసంవర్ధకరంగాల్లో సమగ్రాభివృద్ధి, ప్రస్తుత సవాళ్ల పరిష్కారం లక్ష్యంగా ఈ నెల 28 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. హైదరాబాద్ లైఫ్ సైన్స్ సొసైటీ, పసురా గ్రీన్ విజనరీస్ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జువ్వాడి దేవీప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ వర్సిటీలో సదస్సు జరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, సెంట్రల్ వర్సటీ వీసీ ప్రొఫెసర్ పీ అప్పారావు, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, హర్యానా వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేపీ సింగ్, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

సోమవారం
26•8•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE


PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







# సింధు స్వర్ణ సంబురం




## ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ కైవసం

- ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా తెలుగమ్మాయి రికార్డు
- ఫైనల్లో ఒకుహరపై అలవోక విజయం



స్వర్ణ పతకంతో సింధు

వివరాలు ఆటలో

**అద్భుతం** ఆవిష్కృతమైంది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సువర్ణ అధ్యాయం నమోదైంది. ఎన్నాళ్లుగానో వేచిచూస్తున్న క్షణం రానేవచ్చింది. శతకోటి భారతావని మది ఉప్పొంగేలా తెలుగుతేజం పూసర్ల వెంకటసింధు కొత్త చరిత్రకు నాంది పలికింది. ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పసిడికాంతిని తళుకులీనించింది. గత రెండేండ్లు రజతానికే పరిమితమైన ఈ బ్యాడ్మింటన్ క్వీన్.. స్వర్ణ పతకాన్ని సగర్వంగా ముద్దాడింది. ఫైనల్ ఫోబియాకు చెక్‌పెడుతూ, సిల్వర్ స్టార్ అనే ముద్రను చెరిపేసింది. కోర్టులో చిరుతలా కదలాడుతూ విధ్వంసపూరిత స్మాష్‌లు.. డ్రాప్‌షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరిచేసిన హైదరాబాదీ షట్లర్.. స్విట్జర్లాండ్‌లో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. కచ్చితంగా ఈసారి పతకం రంగు మారుస్తానని శపథం పూని.. పట్టుదలతో చేతల్లో చూపింది. ఆదివారం బాసెల్‌లోని సెయింట్ జాకబ్స్‌హాలె ఇండోర్ స్టేడియంలో కిక్కిరిసిన అభిమానుల మధ్య జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మాజీ చాంపియన్ నజోమి ఒకుహరపై సింధు 21-7, 21-7 తేడాతో అలవోక విజయం సాధించింది. 38 నిమిషాల్లోనే ముగిసిన ఏకపక్ష పోరులో ఆదినుంచి ఆధిపత్యం ప్రదర్శిస్తూ సరిగ్గా రెండేండ్ల క్రితం తనకెదురైన పరాజయానికి ఒకుహరపై దీటైన ప్రతీకారం తీర్చుకుంది. తద్వారా ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పసిడి గెలిచిన తొలి భారత షట్లర్‌గా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నది. వచ్చే ఏడాది జరిగే ప్రతిష్ఠాత్మక టోక్యో (2020) ఒలింపిక్స్‌లో ప్రపంచ చాంపియన్‌గా సింధు పోటీకి దిగబోతున్నది. వరల్డ్ బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన సింధుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# రాజలరాజేశ్వర

## రికార్డుస్థాయిలో 11 టీఎంసీలకు నీటిమట్టం!

- 17 కిలోమీటర్ల మేర విస్తరించిన బ్యాక్‌వాటర్
- నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో నిరంతరంగా నడుస్తున్న మోటర్లు
- గాయత్రి పంప్‌హౌస్‌కు కొనసాగుతున్న నీటి విడుదల



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడలో నీటితో కళకళలాడుతున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కలల ప్రతిరూపంగా సాకారమైన కాళేశ్వరం ప్రాజెక్టులో జలప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల లింక్-2లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ రికార్డు సృష్టించింది. జలాశయంలో నీటిమట్టం చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆదివారం పది టీఎంసీల మార్కు దాటింది. దిగువన నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటర్లు నిరంతరం కాళేశ్వర జలాలను ఎత్తిపోస్తుండటంతో ఆదివారం రాత్రి పదిగంటల వరకు నీటి నిల్వ 10.623 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ 17వ కిలోమీటర్ వరకు అంటే.. సిరిసిల్ల మండలం శాంతినగర్ సమీపంలోని రామప్ప ఆలయం దాటి, మానేరు వెంబడి కరకట్ట ప్రారంభం దాకా విస్తరించింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 25.873 టీఎంసీలు కాగా సోమవారం తెల్లవారుజాము వరకు జలాశయంలో నీటిమట్టం 11 టీఎంసీల మార్కును దాటనున్నట్లు అధికారులు తెలిపారు.

**నిరంతరం ఎత్తిపోతలు..**

ఆరో ప్యాకేజీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఆదివారం 1, 2, 3 మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్లోకి నీటిని ఎత్తిపోతలు కొనసాగాయి. నంది రిజర్వాయర్ నుంచి ఆరు గేట్ల ద్వారా ఎనిమిదో ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ 1, 4, 5 మోటర్లు ఎత్తిపోస్తున్న నీళ్లు డెలివరీ సిస్టర్న్ నుంచి ఎగిసిపడి గ్రావిటీ కెనాల్ గుండా వరదకాల్వలో కలిసి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి

మిగతా 4వ పేజీలో

## కృష్ణా బేసిన్‌లో మళ్లీ ఇన్‌ఫ్లోలు

- కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపురకు వరద
- జూరాలకు 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- శ్రీశైలం నుంచి సాగర్‌కు 38 వేల క్యూసెక్కులు

4



ఆదివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్రకార్యాలయంలో అరుణ్‌జైట్లీ మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో భార్య సంగీత, కుమార్తె సోనాలి, కుమారుడు రోహన్

# జైట్లీకి కన్నీటి వీడ్కోలు

- ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు పూర్తి
- అధికారిక లాంఛనాల మధ్య దహన సంస్కారాలు
- అంతిమయాత్రకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు
- తీవ్ర భావోద్వేగానికి గురైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

5

# ఫిట్‌లెస్ యాప్స్

- ఫిట్‌నెస్ డాటాల్లో గందరగోళం
- మొబైల్ యాప్‌లలో శాస్త్రీయతకు దూరంగా సూచనలు
- ఎన్ఐఎన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి
- హెల్త్ ఇన్ఫర్మేటిక్స్ జర్నల్‌లో కథనం ప్రచురితం
- యాప్స్‌ను ఏకపక్షంగా నమ్మొద్దంటున్న న్యూట్రిషనిస్టులు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

స్మార్ట్‌ఫోన్ ఉండగా చింత ఎందుకు దండుగ.. సన్నబడటం, లేదా బరువు పెరుగటం మనచేతుల్లోనే ఉందిగా అనుకుంటున్నారా.. ఫిట్‌నెస్‌గా ఉండటం సులువే అనుకుంటున్నారా.. అయితే మోసపోతున్నట్లే! ఏరోజు ఎన్ని మెట్లు ఎక్కాలి, ఎంత దూరం నడువాలి, ఎన్నిక్యాలరీలు ఖర్చుచేయాలి.. ఇలా అంచనావేసి చెప్తున్న మొబైల్స్ యాప్స్‌తో ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొంటున్నారు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్తలు. ఫిట్‌గా ఉండేందుకు అశాస్త్రీయతతో చేస్తున్న ఈ సూచనలను ఏకపక్షంగా పాటించడం సరికాదని

మిగతా 4వ పేజీలో

## మంగళ్‌పల్లి లాజిస్టిక్ పార్క్ రెడీ

- రూ.20 కోట్లతో ఆధునిక హంగులతో నిర్మాణం
- 1.20 లక్షల చదరపు అడుగుల భారీ గోదాము సిద్ధం
- జనవరినాటికి పూర్తిస్థాయిలో సేవలు
- బాటసింగారం లాజిస్టిక్ పార్కు పనులు 70 శాతం పూర్తి

4

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**


| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 313.00 | రంగారెడ్డి | 313.00 |
| మెదక్ | 313.00 | కరీంనగర్ | 313.00 |
| వరంగల్ | 313.00 | చిల్లర ధర | 3.75 |

# నిన్న పట్టాదారు.. నేడు అనుభవదారు

- రికార్డులు తారుమారుచేసిన రెవెన్యూ అధికారులు
- రైతు భూమి సహకార సంఘానికి అక్రమంగా పట్టా
- తప్పుడు పేపర్‌పై నకిలీ సాదాబైనామా
- ధర్మగంటను ఆశ్రయించిన మెదక్ జిల్లాకు చెందిన భద్రప్ప కుటుంబం



భద్రప్ప పేరుపై ఉన్న భూ రికార్డులను చూపిస్తున్న వీరప్ప, సుగుణ

7

**ధర్మగంట**

**బతుకుదెరువు** కోసం వలస వెళితే.. సొంతూరులో ఉన్న పట్టాభూమిలో సహకారసంఘం భవనం వెలిసింది. ఇదేమని రెవెన్యూ అధికారులను అడిగితే.. నిన్నటివరకు పట్టాదారు కాలమ్‌లోఉన్న రైతుపేరును అనుభవదారు కాలమ్‌లోకి మార్చేశారు. పట్టాదారుడు 1972లోనే ఆ భూమిని అమ్మివేశారంటూ ఆ సమయంలో అందుబాటులోనే లేని ఏ4 సైజ్ పేపర్‌తో నకిలీపత్రాలు సృష్టించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న స్థలాన్ని సర్వేచేయాలంటూ ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలనూ తాసిల్దార్ పట్టించుకోవడం లేదని పేర్కొంటూ.. మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగసాయిపేటకు చెందిన బాధితులు ప్రసాద్, నవీన్, వివేక్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.






epaper.ntnews.com



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద సండే సందడి నెలకొన్నది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు తరలి వచ్చారు. జలపాతం, చిల్డ్రన్స్‌పార్క్, వాచ్‌టవర్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేశారు. వరద నీటిలో కేరింతలు కొట్టారు.
-వాజేడు(ములుగు)

## మూడ్రోజులు ఓ మోస్తరు వానలు

- ఎల్లుండి మరో అల్పపీడనం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాబోయే మూడ్రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర ఛత్తీస్‌గఢ్ దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో ఇప్పటికే అల్పపీడనం కొనసాగుతున్నదని, దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నదని చెప్పారు. ఉత్తర బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో బుధవారం (ఈ నెల 28న) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

### గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హైదరాబాద్‌లో అత్యధికంగా సెంటీమీటర్ వర్షం పడగా, చేవెళ్లలో 5.6 మి.మీ., మహేశ్వరంలో 3 మి.మీ., షాద్‌నగర్‌లో 1.2 మి.మీ వాన కురిసిందని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.4 డిగ్రీలు, గాలిలో తేమ 53 శాతంగా నమోదైందని చెప్పారు.





సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పొన్నాల శివారులో పినాకిల్ క్లబ్ వద్ద కొనసాగుతున్న టీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ పనులు

# చురుకుగా టీఆర్ఎస్ కార్యాలయాల నిర్మాణం

- దసరానాడు ప్రారంభించే దిశగా కార్యాచరణ
- తుదిదశకు చేరిన పార్టీ కమిటీల ఎన్నికలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయాల భవనాల నిర్మాణం చురుకుగా కొనసాగుతున్నది. దసరా పండుగనాడు పార్టీ కార్యాలయాల్లోకి అడుగుపెట్టాలని.. అందుకు అనుగుణంగా నిర్మాణం పనులు పూర్తిచేయాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయాల నిర్మాణం పనులను వేగవంతం చేశారు. 30 జిల్లాల్లో కార్యాలయాల నిర్మాణం జోరుగా కొనసాగుతున్నది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం మినహా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే పార్టీకి కార్యాలయం ఉంది. హైదరాబాద్, వరంగల్ జిల్లాల్లో స్థలం కేటాయించాల్సి ఉన్నది. పార్టీ కార్యాలయాల భవనాల నిర్మాణానికి రాష్ట్ర పార్టీ నిధుల నుంచి ఒక్కో జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారు. అన్ని జిల్లాల పార్టీ కార్యాలయాలు ఒకే విధంగా ఉండేలా భవనాల డిజైన్ తయారుచేసి ఇచ్చారు. ఇటీవలే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భవనాల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. దాదాపుగా అన్ని జిల్లాల్లో భవనాల పనుల్లో పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. సిద్దిపేట, మేడ్చల్ జిల్లాల్లో స్లాబ్ దశకు చేరుకొన్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ఎకరం చొప్పున భూమిని ప్రభుత్వం కేటాయించింది. పార్టీ సమావేశాలు నిర్వహించుకునేలా సమావేశమందిరం నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన తరువాత పార్టీ నాయకులకు శిక్షణ కార్యక్రమాలు ఇచ్చేందుకు యోచిస్తున్నారు. నిర్మాణం పనులను పర్యవేక్షించడానికి పాత జిల్లాల ప్రాతిపదికన నలుగురు ఇంచార్జీలను నియమించారు.

### క్రియాశీల కార్యకర్తలకు కార్డులు

తక్కువ సమయంలో సమగ్ర వివరాలతో సభ్యత్వం నమోదుచేసిన పార్టీగా టీఆర్ఎస్ రికార్డుల్లోకెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వాలు 60 లక్షలు దాటాయి. సభ్యత్వ పుస్తకాలను వెంటనే కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల ఇంచార్జిలను ఆదేశించారు. డాటా ఎంట్రీ పూర్తికాని సభ్యత్వాలను హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో కంప్యూటరీకరణ చేసేలా ఏర్పాట్లుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు పనులు పూర్తి కావడంతో తర్వాతి కార్యక్రమంగా బూత్, గ్రామ, మండల, వార్డు కమిటీలకు ఎన్నికలు జరిపేందుకు చర్యలు ప్రారంభించారు. అత్యధిక నియోజకవర్గాల్లో కమిటీలు కూడా చివరి దశకు చేరుకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామస్థాయి నుంచి అనుబంధ కమిటీలను ఎన్నుకొంటున్నారు. కమిటీల్లో సామాజిక న్యాయం జరిగేలా బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు 51 శాతం ఉండేలా చూడాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. కమిటీలవారిగా అందుతున్న వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరిస్తున్నారు. ప్రతి క్రియాశీల కార్యకర్తకు గుర్తింపుకార్డు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు తుది అనుమతి అనంతరం 20 లక్షల మంది క్రియాశీల కార్యకర్తలకు గుర్తింపుకార్డులు అందజేయనున్నారు. గ్రామ, మండల కమిటీల నియామకం పూర్తికాగానే ఆయా కమిటీల సభ్యులతో కలిపి నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించాలన్న కేటీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటినుంచే చర్యలు తీసుకొంటున్నారు.

# మంగళ్‌పల్లి లాజిస్టిక్ పార్క్ రెడీ

- రూ.20 కోట్లతో ఆధునిక హంగులతో నిర్మాణం
- 1.20 లక్షల చదరపు అడుగుల భారీ గోదాము సిద్ధం
- డ్రైవర్ల కోసం సకల వసతులు
- ఫేజ్-1 కింద ఇప్పటికే లాజిస్టిక్ సేవలు ప్రారంభం
- బాటసింగారం లాజిస్టిక్ పార్కు పనులు 70 శాతం పూర్తి



మంగల్‌పల్లి రెవెన్యూ బొంగుళూర్‌లోని లాజిస్టిక్ హబ్‌లో పూర్తయిన వేర్‌హౌస్ నిర్మాణం



లాజిస్టిక్ పార్కులోని వేర్‌హౌస్‌లో సరుకుల నిల్వ

**ఆదిబట్ల:** గ్రేటర్ హైదరాబాద్‌కు మణిహారమైన ఔటర్ రింగ్‌రోడ్డు కేంద్రంగా నిర్మితమవుతున్న లాజిస్టిక్ పార్కుల్లో ఒకటి అందుబాటులోకి వచ్చింది. వస్తువుల ఎగుమతి, దిగుమతులకు అనుకూలంగా ఉన్న ఔటర్ చుట్టూ లాజిస్టిక్ పార్కులను ఏర్పాటుచేయడం ద్వారా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను నివారించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా నాగార్జునసాగర్, విజయవాడ హైవేల్లో రెండు లాజిస్టిక్ పార్కుల నిర్మాణ పనులను హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) మొదలుపెట్టింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో బాటసింగారంలో రూ.35 కోట్లతో 40 ఎకరాల్లో చేపట్టిన లాజిస్టిక్ పార్కు పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం అక్కడ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, గోదాం నిర్మాణపనులు జరుగుతుండగా.. మంగళ్‌పల్లిలో రూ.20 కోట్లతో 22 ఎకరాల్లో నిర్మించిన లాజిస్టిక్ పార్కు సకల సదుపాయాలతో అందుబాటులోకి వచ్చింది. ఫేజ్-1 కింద ఇటీవల అక్కడ సరుకు రవాణా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. లక్ష టన్నుల సరుకులను నిల్వచేసేలా 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన భారీ గోదాము వారం క్రితమే అందుబాటులోకి వచ్చింది. ఎండాకాలంలో వేడిమిని తట్టుకుని చల్లదనాన్ని ఇచ్చేలా ఈ గోదాములో ఇన్సులేషన్‌ను ఏర్పాటుచేశారు.

### డ్రైవర్ల కోసం విశ్రాంతి గదులు

మంగళ్‌పల్లి లాజిస్టిక్ పార్కులో 250 ట్రక్కుల పార్కింగ్‌కు వీలుకల్పించాల్సి ఉండగా ఇప్పటికే 200 ట్రక్కులను నిలిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకేసారి వందమంది డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు నాలుగు విశాలమైన గదులను నిర్మించడంతోపాటు బెడ్‌లు, టాయిలెట్లు, బాత్‌రూంలు, సామన్లను భద్రపర్చుకునేందుకు లాకర్లు ఏర్పాటుచేశారు. అంతేకాకుండా అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్, ఆటోమొబైల్ సెంటర్, వాహన పరీక్షా కేంద్రం, రెస్టారెంట్, హోటల్, దాబాలు, దవాఖాన లాంటి సకల సౌకర్యాలను కల్పించారు. ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జితో పాటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయ సేవలను కూడా అందుబాటులో ఉంచారు. ఇక్కడ పెట్రోల్ బంకు ఏర్పాటుకు అనుమతులు లభించడంతో త్వరలో దానిని ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

### 5 వేలమందికి ఉపాధి



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రెండు లాజిస్టిక్ పార్కుల సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత 5 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ లాజిస్టిక్ పార్కులతో నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. మంగళ్‌పల్లి లాజిస్టిక్ పార్కు పనులు పూర్తయ్యాయి. రాష్ట్రంలోనే మోడల్ లాజిస్టిక్ పార్కుగా తీర్చిదిద్దిన దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు కృషిచేస్తున్నాం.
- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే

### జనవరినాటికి పూర్తిస్థాయిలో సేవలు



అన్‌కాన్ లాజిస్టిక్ హబ్ నిర్మాణ పనులన్నీ పూర్తి చేశాం. ఆధునిక వసతులతో భారీ గోదాము అందుబాటులోకి వచ్చింది. డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు వసతులు సమకూర్చడంతో పాటు రెస్టారెంట్, దవాఖాన, ట్రాన్స్‌పోర్టు, షాపింగ్ కాంప్లెక్స్ తదితర భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రస్తుతం ఈ హబ్‌లో ఫేజ్-1 ద్వారా లాజిస్టిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2020 జనవరి నాటికి పూర్తిస్థాయిలో సేవలందించాలని కృతనిశ్చయంతో ఉన్నాం.
- రాజశేఖర్, అన్‌కాన్ లాజిస్టిక్ హబ్ ఎండీ

# రా 'జల'రాజేశ్వర

జలాభిషేకం



గాయత్రి పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలను పరిశీలిస్తున్న ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు



ఆదివారం నిండుకుండలా మారి కళకళ లాడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

మూడోపేజీ తరువాయి...

చేరుతున్నాయి. జలాశయానికి పెద్ద ఎత్తున సందర్శకులు తరలివస్తున్నారు.

### తాలిపేరు నాలుగు గేట్లు ఎత్తివేత

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తాలిపేరు ప్రాజెక్టులోకి ఆదివారం భారీగా వరదనీరు చేరడంతో ప్రాజెక్టు అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 12,560 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదలచేశారు. భద్రాచలం వద్ద నీటి ప్రవాహం మధ్యాహ్నం 31.7 అడుగులుగా ఉన్నది.

### కృష్ణా బేసిన్‌లో మళ్లీ ఇన్‌ఫ్లోలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు మళ్లీ ఇన్‌ఫ్లోలు ప్రారంభమయ్యాయి. ఆదివారం కర్ణాటకలో ఆల్మట్టి ప్రాజెక్టుకు 24 వేల క్యూసెక్కుల వరద రాగా, అంతేమొత్తంలో దిగువకు విడుదలచేస్తున్నారు. నా రాయణపుర రిజర్వాయర్‌కు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 7,783 క్యూసెక్కులను దిగువకు విడుదలచేస్తున్నారు. దీంతో జూరాల కు 9 వేల క్యూసెక్కుల వరద రాగా, 6,977 క్యూసెక్కులను దిగువకు వదిలిపెడుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 11 వేల క్యూసెక్కు ల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల, తుంగభద్ర నుంచి వస్తున్న నీటితో శ్రీశైలం జలాశయానికి 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.

**వివిధ ప్రాజెక్టుల్లో ఆదివారంనాటి నీటిమట్టాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.72 | 129.72 | 128.19 | 10,000 | 10,000 |
| నారాయణ్‌పూర్ | 1615.00 | 1614.44 | 37.64 | 37.19 | 10,000 | 7,200 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 0 | 4,350 |
| జూరాల | 1045.00 | 1044.92 | 9.66 | 9.60 | 9,000 | 6,997 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 11,637 | 11,985 |
| శ్రీశైలం | 885.00 | 882.50 | 215.81 | 202.04 | 17,576 | 28,673 |
| నాగార్జునసాగర్ | 590.00 | 589.20 | 312.05 | 309.66 | 20,625 | 20,615 |
| పులిచింతల | 175.00 | 173.72 | 45.77 | 43.79 | 1,000 | 1,000 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.54 | 17.18 | 0.15 | 41 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1063.30 | 90.31 | 17.74 | 2,012 | 400 |
| లోయర్‌మానేర్ | 920.00 | 881.90 | 24.07 | 3.53 | 0 | 204 |
| శ్రీరాజరాజేశ్వర | 1043.31 | 1015.19 | 25.873 | 10.623 | 9,097 | 83 |
| కడెం | 700.00 | 697.50 | 7.60 | 6.96 | 839 | 413 |
| ఎల్లంపల్లి | 485.56 | 477.59 | 20.18 | 13.91 | 0 | 0 |

## 2.2 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

కారు వదిలి పరారైన నిందితుడు



ఆదివారం కొత్తపల్లి శివారులో పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

**వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ:** అక్రమంగా కారులో తరలిస్తున్న 2.2 క్వింటాళ్ల గంజాయిని వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి సమీపంలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు వర్ధన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీచేస్తున్న సమయంలో కొత్తపల్లి నుంచి వస్తున్న ఓ కారు వెనక్కి తిరిగి వేగంగా వెళుతున్నది. అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించడంతో నిందితుడు కొత్తపల్లి శివారులో కారును వదిలి పంట పొలాల నుంచి పరుగులు తీశాడు. నిందిడుతుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. కారు డోర్లు తీసి పరిశీలించగా 110 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఒక్కో ప్యాకెట్ 2 కిలోల బరువుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి కారులో గంజాయిని తరలిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో వర్ధన్నపేట, రాయపర్తి ఎస్సైలు సంపత్, లక్ష్మణ్‌రావు తనిఖీలు చేయగా గంజాయి ఉదంతం వెలుగులోకి వచ్చింది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.05 గంటలకు

సూర్యాస్తమయం: 6.31 గంటలకు


వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, దశమి ఉదయం 7.04 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆరుద్ర, అమృతఘడియలు: సాయంత్రం 5.23 నుంచి 6.59 వరకు, రాహుకాలం: ఉదయం 7.38 నుంచి 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.53 నుంచి మధ్యాహ్నం 12.43 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.12 నుంచి సాయంత్రం 4.02 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.02 నుంచి 1.38 వరకు.

## కన్వీనర్‌కోటా తుదివిడుత ఎంబీబీఎస్ సీట్ల భర్తీ

నేటి సాయంత్రం వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ వైద్య విద్యకోర్సులో తుదివిడుత కౌన్సెలింగ్‌కు కాళోజీ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆదివారం నోటిఫికేషన్ జారీచేసింది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాసీట్ల భర్తీకి ఇప్పటికే మూడు విడతల్లో వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకా మిగిలిపోయిన సీట్ల భర్తీకి తుదివిడుత వెబ్‌కౌన్సెలింగ్‌ను ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. సోమవారం సాయంత్రం వరకు అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు www.knruhs.telangana.gov.in ను సంప్రదించాలని కేఎన్ ఆర్‌యూహెచ్‌ఎస్ వెల్లడించింది.

### లోకం పోకడ



# ఫిట్‌లెస్ యాప్స్

మూడోపేజీ తరువాయి...

హెచ్చరిస్తున్నారు. ఫిట్‌నెస్ కోసం మొబైల్ యాప్స్‌ను అనుసరించడం, ఆహారం కూడా అందులో సూచించిన విధంగానే తీసుకోవటం ఇటీవలి కాలంలో సర్వసాధారణమయింది. అయితే ఈ ఫిట్‌నెస్ యాప్స్‌ను ఎంతవరకు ప్రామాణికంగా తీసుకోవచ్చు? అవి అందించే సూచనలు ఎంతవరకు శాస్త్రీయంగా ఉన్నాయి? అనే విషయాలపై ఎన్‌ఐఎన్ అధ్యయనం చేసింది. ఎక్కువగా వినియోగంలో ఉన్న 20 ఫిట్‌నెస్ యాప్స్‌పై అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు వీటిల్లో ఏవీ శాస్త్రీయతను దాదాపు అనుసరించడంలేదని గుర్తించారు.

### ఒక్కో యాప్ ఒక్కో రకమైన సూచన

నాణ్యమైన సమాచారం, సాంకేతికత, ఇతర శాస్త్రీయ అంశాలు ప్రామాణికంగా జరిగిన ఈ అధ్యయనంలో 13 యాప్స్ దారుణంగా ఉన్నట్టు గుర్తించారు. ఒక్కోయాప్ ఒక్కోరకమైన సూచనలు చేస్తూ గందరగోళానికి గురిచేస్తున్నట్టు తేలింది. ఒకేవ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమాచారం ఆయా యాప్స్‌లో ఎంటర్‌చేసి చూడగా.. ఒక్కొక్కటి ఒక్కోరకమైన సూచనలుచేసింది. ఉదాహరణకు 163 సెంటీమీటర్ల పొడవు, 66 కిలోల బరువు గల 22 ఏండ్ల మహిళ వారానికి 500 గ్రాముల బరువు తగ్గాలని అనుకుంటే, ఆయా యాప్స్ క్యాలరీస్ ఖర్చుచేసే విషయంలో, తీసుకునే ఆహారం విషయంలో 20 రకాల సూచనలు చేసినట్టు గుర్తించారు. ఎన్‌ఐఎన్ అధ్యయనం ఇటీవల హెల్త్ ఇన్ఫర్మేటిక్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. కూరగాయలు, పండ్లు, సంతృప్త కొవ్వుపదార్థాలు ఉండే ఆహారం తీసుకోవడాన్ని కేవలం 40 శాతం యాప్స్ సూచిస్తుండగా, ప్రతిరోజూ శారీరక శ్రమను కొన్ని యాప్స్ మాత్రమే సూచిస్తున్నాయి.

### నమ్మితే నష్టమే..

బరువు తగ్గాలనో లేక బరువు పెరుగాలనో స్మార్ట్ డివైజ్‌లను నమ్ముకునే వారిసంఖ్య పెరుగుతున్నది. స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్, షూ చిప్ ఇలా.. పలు రకాలుగా అందుబాటులో ఉన్నాయి. బరువు, వయస్సు ఆధారంగా యాప్స్ ఇచ్చే సూచనలు పూర్తిగా నమ్మితే నష్టపోయే ప్రమాదం ఉన్నది. వ్యాయామంపై సూచనలు చేయాలంటే ముందుగా శరీర సౌష్ఠవం, ఆరోగ్య సమస్యలు, వాతావరణ పరిస్థితులు.. ఇలా అన్నిఅంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు యాప్స్ సూచించినట్టు నడక లేదా రన్నింగ్ ప్రారంభించడం, లేదా ఆహార నియమాలు పాటించడం వల్ల ఇతర ఇబ్బందులు ఎదురవుతాయి. పలురకాల డైట్లతో ఆహార నియమాల్లో వస్తున్న మార్పులు దీర్ఘకాలంలో సమస్యలు చూపే అవకాశం ఉంటుంది. రాత్రికిరాత్రి బరువు తగ్గాలనే కోరికతో యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకొని అనుసరిస్తున్నారు. తక్కువ సమయంలో సన్నబడాలనే లక్ష్యంతో ఎక్కువ క్యాలరీస్‌ను ఖర్చు చేయాలని అనుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల సమస్యలు తప్పవని న్యూట్రిషన్ నిపుణులు చెప్తున్నారు. ఫిట్‌నెస్ యాప్స్ అనేవి రెండువైపులా పదును ఉన్న కత్తి లాంటివని, అవి కొంతవరకు దారి చూపిస్తున్నప్పటికీ మొత్తం వాటినే గుడ్డిగా నమ్మితే నష్టపోయే ప్రమాదం లేకపోలేదని పేర్కొంటున్నారు.

### అన్నిఅంశాలను పరిగణనలోకి తీసుకోవాలి

భారతీయుల కోసం యాప్ అభివృద్ధి చేసే సమయంలో కొన్ని ముఖ్యమైన అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. భారతీయ ఆహారప్రమాణాలు, సాంస్కృతిక అంశాలు మరచిపోవద్దు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొనే 'న్యూట్రిఫై ఇండియా నౌ' యాప్‌కు శ్రీకారం చుట్టాం. భారత ఆహారం, వంటకాలు, పోషకాహార సమాచారంతో కూడిన ప్రత్యేక డాటాబేస్ ఆధారంగా అభివృద్ధి చేశాం. ఇందులో ప్రామాణికమైన సమాచారం ఉంటుంది.
- డాక్టర్ ఆర్ హేమలత, ఎన్‌ఐఎన్ డైరెక్టర్



ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారం బిస్కెట్లు

## ఎయిర్‌పోర్టు బాత్‌రూంలో భారీగా బంగారం పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు ఆదివారం భారీగా బంగారం పట్టుకున్నారు. ఎయిర్ ఇంటెలిజెన్స్, కస్టమ్స్ అధికారులు.. షార్జా నుంచి 6ఈ1406 విమానంలో హైదరాబాద్ వస్తున్న షేక్ అబ్దుల్ సాజిద్ అనే ప్రయాణికుడు అక్రమంగా బంగారం తరలిస్తున్నాడనే సమాచారంతో తనిఖీలు ముమ్మరం చేశారు. విషయం తెలిసిన సాజిద్ బంగారాన్ని విమానాశ్రయంలోని బాత్‌రూంలో పడేశాడు. అనంతరం తనిఖీలో అతని వద్ద బంగారం లభించకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో బాత్‌రూంలో పడేసిన విషయాన్ని అధికారులకు చెప్పాడు. రూ.1,11,60,160 విలువచేసే 2,992 గ్రాముల బరువున్న 26 బంగారం బిస్కెట్ల ప్యాకెట్‌ను బాత్‌రూం నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ సాజిద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


## అరుణ్‌జైట్లీ జ్ఞాపకాలు పదిలం

### కుటుంబసభ్యులకు సంతాప లేఖ రాసిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** పార్లమెంట్‌లో ఇకపై అరుణ్ జైట్లీ గళం వినిపించ కపోయినా.. ఆయన జ్ఞాపకాలు మాత్రం పదిలంగా ఉంటాయని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. జైట్లీ మరణం నేపథ్యంలో రాహుల్ గాంధీ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటిస్తూ జైట్లీ భార్య సంగీతకు ఆదివారం ఓ లేఖ రాశారు. జైట్లీ తన నాలుగుదశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో దేశ రాజకీయ రంగంపై చెరుగని ముద్రవేశారని కొనియాడారు. 'ఇకపై పార్లమెంట్‌లో జైట్లీ గళం వినిపించకపోవచ్చు. కానీ ఆయన ఎప్పుడూ మా మధ్య ఉన్నట్టుగానే భావిస్తాం' అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. వారికి ఈ కష్ట కాలంలో ఆత్మస్థైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.

## భారత సంతతి పాక్ నేత కుట్టి మృతి



**కరాచీ, ఆగస్టు 25:** భారత సంతతికి చెందిన ప్రముఖ పాకిస్థానీ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త బీ ఎం కుట్టి మరణించారు. 89 ఏండ్ల ఈయన దీర్ఘకాల అనారోగ్యం కారణంగా కరాచీలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. కుట్టీ పూర్తి పేరు బియ్యోతిల్ మొహియుద్దీన్ కుట్టీ. మలయాళీ ముస్లిం కుటుంబానికి చెందిన ఈయన 1930లో కేరళలోని తిరూర్ పట్టణంలో జన్మించారు. 1949లో 19 ఏండ్ల వయసులో కేరళ నుంచి పాకిస్థాన్‌కి వలస వెళ్లారు. ఈయన భార్య బిర్జిస్ సిద్దిఖీ 2010లో మరణించారు. వీరికి నలుగురు సంతానం. పౌర హక్కుల కోసం కుట్టీ అలుపెరుగని పోరాటం చేశారు. ఈయన మృతికి కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సంతాపం తెలిపారు.

## మీడియా మేనేజ్‌మెంట్‌కే పరిమితం: ప్రియాంక

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశ ఆర్థిక మందగమనంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆదివారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సమస్యకు పరిష్కారం కనుగొనే బదులు ప్రభుత్వం కేవలం మీడియా మేనేజ్‌మెంట్‌కే పరిమితమైందని విమర్శించారు. పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అర్థవంతమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానుయేల్ మాక్రాన్ అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ బయానీ నగరంలో వేలమంది ఆదివారం నిరసన చేపట్టారు. మాక్రాన్ చిత్రపటాలను తలకిందులుగా ప్రదర్శిస్తూ మాక్రాన్‌ను దించేయండి అంటూ నినదించారు. పుడమిని కాపాడాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు జీ7 సదస్సు జరుగుతుండటం.. మరోవైపు సదస్సు సమీపంలోనే నిరసన చేపట్టడంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. 68 మందిని అరెస్టు చేశారు. ఆందోళనల నేపథ్యంలో సదస్సుకు ఫ్రాన్స్ ప్రభుత్వం గట్టి బందోబస్తును ఏర్పాటు చేసింది.







ఆదివారం న్యూఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో జైట్లీ అంత్యక్రియలకు హాజరైన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, సీఎంలు నితీశ్‌కుమార్, ఫడ్నవీస్, యెడియూరప్ప తదితరులు..(పక్కన) వెంకయ్య భావోద్వేగం

# జైట్లీకి కన్నీటి వీడ్కోలు

- ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు పూర్తి
- అధికారిక లాంఛనాల మధ్య దహన సంస్కారాలు
- అంతిమయాత్రకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు
- తీవ్ర భావోద్వేగానికి గురైన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు



జైట్లీ చితికి నిప్పంటిస్తున్న ఆయన కుమారుడు రోహన్ జైట్లీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్ జైట్లీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆదివారం ఢిల్లీలోని యమునానది ఒడ్డున ఉన్న నిగమ్ బోధ్ ఘాట్‌లో అధికారిక లాంఛనాల మధ్య దహనసంస్కారాలు నిర్వహించారు. ఆయన చితికి కుమారుడు రోహన్ నిప్పంటించారు. కుటుంబసభ్యులతోపాటు బంధువులు, పలు పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు వందల మంది అంతిమయాత్రలో పాల్గొన్నారు. తమ ప్రియతమ నేతకు తుది వీడ్కోలు పలికారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, జ్యోతిరాదిత్య సింధియా, కపిల్ సిబల్, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, పలు రాష్ట్రాల సీఎంలు కేజ్రీవాల్, దేవేంద్ర ఫడ్నవీస్, విజయ్ రూపానీ, యెడియూరప్ప, నితీశ్‌కుమార్, త్రివేంద్ర సింగ్ రావత్‌తోపాటు పలువురు ఎంపీలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఓవైపు వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా తమ ప్రియతమ నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ఎదురుచూశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటనలో ఉండటం, అంత్యక్రియల కోసం పర్యటనను రద్దు చేసుకోవద్దని జైట్లీ కుటుంబ సభ్యులు సూచించడంతో ఆయన హాజరుకాలేకపోయారు. ఈ సందర్భంగా చిరకాల మిత్రుడి పార్థివ దేహాన్ని చూసి ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని నిమిషాలపాటు జైట్లీ చేతిని పట్టుకొని అక్కడే నిలబడ్డారు. అంతకు ముందు ఉదయం 11 గంటలకు జైట్లీ మృతదేహాన్ని ఆయన నివాసం నుంచి దీన్‌దయాల్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. వేల మంది బీజేపీ కార్యకర్తలు, సామాన్య పౌరులు, పలు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. రెండున్నర గంటల అనంతరం అక్కడి నుంచి నిగమ్ బోధ్ ఘాట్‌కు తరలించారు.



ఢిల్లీ వీధుల్లో జైట్లీ అంతిమయాత్ర

# ఉగ్రవాదాన్ని ఉసిగొల్పొద్దు

### అంతర్జాతీయ సమాజానికి భారత్, బహ్రెయిన్ పిలుపు

- ఉగ్రచర్యలకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని సూచన
- బహ్రెయిన్ రాజు, ప్రధానితో మోదీ భేటీ
- ప్రాచీన శ్రీనాథుడి ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టు ప్రారంభం

**మనామా, ఆగస్టు 25:**

ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఉసిగొల్పడాన్ని తిరస్కరించాలని అంతర్జాతీయ సమాజానికి భారత్, బహ్రెయిన్ పిలుపునిచ్చాయి. భద్రత, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో సహకారాన్ని పెంపొందించుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. రెండు రోజుల బహ్రెయిన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఆ దేశ రాజు హమిద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, ప్రధాని, యువరాజు ఖలీఫా బిన్ సల్మాన్ అల్ ఖలీఫాతో సమావేశమయ్యారు. భేటీ అనంతరం సంయుక్త ప్రకటన వెలువడింది. ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని వినియోగించడాన్ని తిరస్కరించాలని, ఉగ్ర శిబిరాలను అంతం చేయాలని, ఉగ్రవాదులకు చేరే నిధులకు అడ్డుకట్ట వేయాలని, ఉగ్రచర్యలకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని అన్ని దేశాలకూ పిలుపునిచ్చారు. పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశిస్తూ ఈ ప్రకటన చేశారు. సైబర్ సెక్యూరిటీ, భద్రత, కౌంటర్ టెర్రరిజం, నిఘా, సమాచార రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాలూ నిర్ణయించాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం నిర్దిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాయి. ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ అంతర్జాతీయ చట్టాలకు లోబడి ప్రాంతీయ అనుసంధాన ప్రాజెక్టులు చేపట్టాలని పరోక్షంగా చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ని (బీఆర్ఐ) ప్రస్తావించాయి. సముద్ర భద్రత, మానవ వనరుల శిక్షణ, ఎనర్జీ, వాణిజ్యం, ఉన్నత విద్య, రక్షణ రంగాల్లో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. కాగా, అంతర్జాతీయ సౌర కూటమిలో బహ్రెయిన్ చేరడాన్ని భారత్ స్వాగతించింది. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మెరుగైన ప్రాతినిధ్యం కల్పించేందుకు ఐక్యరాజ్యసమితిలో ప్రత్యేకించి భద్రతా మండలిలో తక్షణం సంస్కరణలు చేపట్టాలని ఇరు దేశాలు కోరాయి. సాంస్కృతిక, అంతరిక్ష సాంకేతికత, సౌరశక్తి రంగాల్లో రెండు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అలాగే రూపే కార్డు ద్వారా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం భారత్‌కు చెందిన ఎన్‌పీసీఎల్, బహ్రెయిన్‌కు చెందిన బెనెఫిట్ మధ్య మరో ఎంవోయూ కుదిరింది. కాగా, బహ్రెయిన్‌లో పర్యటించిన భారత తొలి ప్రధాని మోదీనే కావడం విశేషం. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి చేసిన కృషికిగానూ ప్రధాని మోదీకి బహ్రెయిన్ రాజు హమీద్ ఆ దేశ అత్యున్నత పురస్కారం 'ద కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ రినైసాన్స్'తో సత్కరించారు.



ప్రధాని మోదీకి 'ద కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ రినైసాన్స్' పురస్కారాన్ని అందిస్తున్న బహ్రెయిన్ రాజు

**జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్‌కు చేరుకున్న మోదీ..**

బహ్రెయిన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ.. జీ7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. జీ-7 కూటమిలో భారత్‌కు సభ్యత్వం లేకపోయినప్పటికీ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని ఈ సదస్సుకు హాజరవుతున్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై ప్రసంగించడంతోపాటు వివిధ దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ-7 కూటమిలో బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా సభ్యులుగా ఉన్నాయి. జీ7 సదస్సు సందర్భంగా బ్రిటన్ నూతన ప్రధాని బోరిస్ జాన్సన్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్‌తో ప్రధాని నరేంద్రమోదీ భేటీ అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోనూ ఆయన సమావేశం కానున్నారు. కశ్మీర్‌తోపాటు పలు అంశాలపై చర్చిస్తారు.

### శ్రీనాథుడి ప్రాచీన ఆలయం పునరుద్ధరణ

బహ్రెయిన్‌లోని 200 ఏండ్లనాటి శ్రీనాథుడి (శ్రీకృష్ణుడు) ఆలయాన్ని 4.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.30 కోట్లు) వ్యయంతో పునరుద్ధరించే ప్రాజెక్టును ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. మనామాలోని ఈ ఆలయంలో ఆయన ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రూపేకార్డు ద్వారా ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. ఆలయానికి వచ్చిన ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. భారత్, బహ్రెయిన్ మధ్య బలమైన సంబంధాలకు ఈ ఆలయం ప్రతీక అని పేర్కొన్నారు. దాదాపు 3,50,000 మంది భారతీయులు బహ్రెయిన్‌లో నివసిస్తున్నారు.



శ్రీనాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ

## ప్రధానిని పొగడాల్సిన అవసరం లేదు

- థరూర్‌ను తప్పుబట్టిన కేరళ కాంగ్రెస్ నేతలు




**అలప్పుజ/ తిరువనంతపురం:** ప్రధాని నరేంద్ర మోదీ చేసే మంచి పనులకు ఆయన్ను ప్రశంసించాలన్న తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు సొంత పార్టీలోనే విమర్శలు వచ్చాయి. మోదీ ప్రభుత్వ తప్పిదాలను విస్మరించొద్దని అసెంబ్లీలో విపక్ష నేత రమేశ్ చెన్నితల అన్నారు. ఆదివారం అలప్పుజలోని హరిపాడ్‌లో చెన్నితల మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ చేసిన ఒక్కపనిని కూడా కీర్తించాల్సిన అవసరమేమీ లేదన్నారు. థరూర్ వైఖరి ప్రజలకు ఆమోదయోగ్యం కాబోదన్నారు. కేరళ పీసీసీ అధ్యక్షుడు రామచంద్రన్ మాట్లాడుతూ థరూర్ ప్రకటన దురదృష్టకరమని, దీనిపై ఆయనతో మాట్లాడుతానన్నారు. శశిథరూర్ ఆదివారం ఒక మలయాళ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై తాను జైరాం రమేశ్, సింఘ్వీ చేసిన వ్యాఖ్యలు సమర్థనీయమేనన్నారు.

# 'బ్రాండ్' జైట్లీ

### ఖరీదైన వస్తువులంటేనే ఇష్టం.. మిగతా రాజకీయ నాయకులకు భిన్నం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అరుణ్ జైట్లీ అనగానే.. నూలు కుర్తా, పైజామా, దానిపై ఓ జాకెట్. చలికాలంలో అయితే కండువా అదనం. ఇదీ మనకు స్ఫురణకు వచ్చే ఆయన ఆహార్యం. ఎంత ఎత్తుకు ఎదిగినా, ఏ హోదాలో ఉన్నా.. ఆయన ఎప్పుడూ వస్త్రధారణలో దర్పాన్ని ప్రదర్శించలేదు. సామాన్యుడిలాగే కనిపించారు. అయితే ధరించే దుస్తులు, వాడే వస్తువుల విషయంలో జైట్లీలో మరో కోణం కూడా ఉన్నది. పెన్నులు, వాచీలు వంటివి కొనుగోలు చేసేటప్పుడు 'బ్రాండ్'కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇక విదేశీ పర్యటనలు, దావత్‌లు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆయన అంతర్జాతీయ బ్రాండ్, ఖరీదైన దుస్తులనే ధరించేవారు. ఆయన సన్నిహితులను ఎవరిని అడిగినా ఇదే విషయాన్ని చెప్తారు. పెన్నులు, వాచీలు మాత్రమే కాదు షాలువాలు, షర్ట్‌లతోపాటు బూట్లను కొనేటప్పుడూ ఖరీదైన బ్రాండ్‌ను ఎంచుకునేవారు. అత్యంత ఖరీదైన పటేక్ ఫిలిప్ వాచీలు, మౌంట్ బ్లాంక్ పెన్నులు మాత్రమే వినియోగించేవారు. అందులోనూ 'హై ఎండ్'కే ప్రాధాన్యం ఇచ్చేవారు. పటేక్‌ఫిలిప్ బ్రాండ్‌లో ప్రముఖ మోడల్స్ వాచీల ధర రూ.4 లక్షల నుంచి ప్రారంభమై రూ.1.20 కోట్ల వరకు ఉంటుంది. ఇక మౌంట్ బ్లాంక్ పెన్నుల ధర రూ.2 లక్షల వరకు ఉంటుంది. ఇక రూ.వేలు ఖరీదు చేసే 'జామ్‌వార్' షాలువాలను మాత్రమే జైట్లీ ధరించేవారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత్రి కుంకుమ్ చధా రాసిన 'అరుణ్ జైట్లీ: ద మైడ్ పైపర్' అనే పుస్తకంలోనూ జైట్లీ విలాసవంతమైన వస్తువుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'పెన్నులు, వాచీల విషయంలో సాధారణ భారతీయుల ఆలోచనలకు ఎంతో భిన్నంగా జైట్లీ ఆలోచనలు ఉంటాయి. మౌంట్ బ్లాంక్ పెన్నుల్లో కొత్త మోడల్ ఏది వచ్చినా వెంటనే కొనుగోలుచేసే వ్యక్తుల్లో జైట్లీ ఒకరు' అని ఆమె పేర్కొన్నారు. జైట్లీ తన వస్తువుల విషయంలోనేకాదు.. తన కుటుంబ సభ్యుల కోసం కూడా బ్రాండెడ్ వస్తువులనే ఎంచుకునేవారట. తన కొడుకు రోహన్ కోసం మొదటిసారి కొనుగోలు చేసిన బూట్ల కోసం ఇటలీకి చెందిన లగ్జరీ బ్రాండ్ సాల్వటోర్ ఫెర్రాగమోను ఎంచుకున్నారని రచయిత్రి పేర్కొన్నారు. అయినా ఎవరూ, ఎన్నడూ ఆయన విలాసాలను విమర్శించలేదు. ఎందుకంటే జైట్లీ ఎంత విలాసంగా బతికేవారో అదేస్థాయిలో తనచుట్టూ ఉన్నవారిని ఆదరించేవారు. ఉదాహరణకు క్లయింట్లు న్యాయవాదికి ఫీజు(మున్షియానా) చెల్లించేటప్పుడు ఆయన సిబ్బంది, జూనియర్ల ఫీజును కలిపి మొత్తం లాయర్‌కే ఇచ్చేవారు. అందులో నుంచి సిబ్బందికి వాటా ఇవ్వడం న్యాయవాది ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. కానీ.. జైట్లీ ఈ విధానాన్ని వ్యతిరేకించారు. తన ఫీజును, సిబ్బంది ఫీజును విభజించేవారు. సిబ్బంది డబ్బును నేరుగా వారికే ఇచ్చేలా ఏర్పాటుచేశారు. ఈ విధానాన్ని మిగతా న్యాయవాదులు వ్యతిరేకించారని, అయినా జైట్లీ తన పద్ధతిని మార్చుకోలేదని ఆయన భార్య సంగీత చెప్పేవారు. రాజకీయ నాయకుడిగా మారిన తర్వాత సైతం జైట్లీ భిన్నంగానే ఉండేవారు. కొన్ని ఉచిత వసతులను వ్యతిరేకించేవారు.



## అమానుష పాలన రుచి చూశాం

### కశ్మీర్ పర్యటనను అడ్డుకోవడంపై రాహుల్ ధ్వజం

**న్యూఢిల్లీ:** విపక్ష నేతలు, మీడియా శనివారం శ్రీనగర్‌లో పర్యటించేందుకు ప్రయత్నించిన సందర్భంలో అక్కడి అమానుష పాలన, జమ్ముకశ్మీర్ ప్రజలపై సాగుతున్న బలప్రయోగం ఏమిటో తెలిసొచ్చిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు శనివారం శ్రీనగర్‌కు చేరుకున్న విపక్ష నేతల బృందాన్ని అధికారులు విమానాశ్రయంలోనే అడ్డుకుని, తిరిగి వెనక్కి పంపిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరించి 20 రోజులు అవుతున్నదని రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు. శనివారం నాటి పరిణామాలకు సంబంధించిన వీడియోను కూడా పోస్ట్ చేశారు. అధికారులు విపక్ష నేతలను అడ్డుకోవడం, రాహుల్ మీడియాతో మాట్లాడుతుండడం ఆ వీడియోలో ఉన్నది. మీడియా సిబ్బందిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని అందులో రాహుల్ ఆరోపించారు. కశ్మీర్‌లో పరిస్థితులు సాధారణంగా లేవని స్పష్టమైపోయిందని పేర్కొన్నారు.

## సచివాలయంపై కశ్మీర్ జెండా తొలిగింపు



**న్యూఢిల్లీ/శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన నేపథ్యంలో ఆదివారం శ్రీనగర్‌లోని పౌర సచివాలయ భవనం నుంచి రాష్ట్ర జెండాను అధికారులు తొలిగించారు. దాని స్థానంలో త్రివర్ణ పతాకం ఎగురువేశారు. ఇకపై జాతీయ జెండా ఒక్కటే అక్కడ ఎగురనుంది. ఇతర ప్రభుత్వ భవనాల్లోనూ ఇకపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంతకుముందు వరకు జమ్ముకశ్మీర్‌కు జాతీయ జెండాతోపాటు ప్రత్యేకంగా రాష్ట్ర జెండా ఉండేది. ఎరుపు రంగు జెండాలోని మూడు చారలు.. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను (కశ్మీర్ లోయ, జమ్ము, లడఖ్) ప్రతిబింబించేవి. జెండాలోని నాగలి రాష్ట్రంలోని రైతాంగానికి చిహ్నం. రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపుగా ఈ జెండాను రూపొందించారు. అయితే ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంతో కశ్మీర్ ప్రత్యేకంగా రాష్ట్ర జెండాను కలిగి ఉండే హక్కును కోల్పోయింది.

**పది రోజుల్లో ప్రాణనష్టం కూడా లేదు: గవర్నర్**

కశ్మీర్‌లోయలో ల్యాండ్‌లైన్, మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ సమర్థించారు. ప్రజల ప్రాణాలు రక్షించేందుకు ఈ నిర్ణయం దోహదపడిందని చెప్పారు. గత పది రోజుల్లో హింసాత్మక ఘటనల్లో జమ్ముకశ్మీర్‌లో ఒక్క మరణం కూడా చోటుచేసుకోలేదని తెలిపారు. 'జమ్ముకశ్మీర్‌లో గతంలో సంభవించిన సంక్షోభ పరిస్థితుల్లో మొదటి వారంలోనే కనీసం 50 మందిదాకా చనిపోయేవారు. ఈ ప్రాణనష్టం జరుగకూడదన్నదే మా ఉద్దేశం' అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మందులు, ఆహార పదార్థాల కొరతపై వస్తున్న వార్తలను ఆయన కొట్టివేశారు. 'కశ్మీర్‌లో నిత్యావసరాలకు, మందులకు ఎలాంటి కొరత లేదు. వాస్తవానికి, ఈద్ సమయంలో మాంసం, కూరగాయలు, గుడ్లను ప్రజల ఇంటి వద్దకే డెలివరీ చేశాం' అని చెప్పారు. శ్రీనగర్‌లోని 1,666 మెడికల్ షాపుల్లో 1,165 దుకాణాలు ఆదివారం కూడా తెరిచే ఉన్నాయి.

# సట్లెజ్ నదిలోకి నీరు వదిలిన పాక్

- ముంపుబారిన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా
- సహాయ చర్యలు చేపట్టిన పంజాబ్ సర్కార్

**చండీగఢ్:** సట్లెజ్ నదిపై నిర్మించిన రిజర్వాయర్ల నుంచి పాకిస్థాన్ నీటిని విడుదల చేయడంతో సరిహద్దుల్లోని పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పూర్ జిల్లాలోని టెండీవాలా సహా పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను ముందుజాగ్రత్త చర్యగా సురక్షిత ప్రదేశాలకు తరలించి సహాయ చర్యలు చేపట్టాలని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇండో-పాక్ సరిహద్దుల్లోని గ్రామాల్లో సహాయ చర్యలు చేపట్టేందుకు సైన్యం, ఇతర శాఖలతో కలిసి సంయుక్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర జల వనరులశాఖను పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ కోరారు. ఫిరోజ్‌పూర్, జలంధర్, కపుర్తలా, రూప్‌నగర్ జిల్లాల్లో వరదల పరిస్థితిపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. వరదలతో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని ఫిరోజ్‌పూర్ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు.



నిసాన్‌పూర్ గ్రామంలోకి చేరిన బ్యాక్‌వాటర్

**సరోవర్ బ్యాక్‌వాటర్‌లో మునిగిన గ్రామం**

**ఇండోర్:** కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పోటెత్తిన వరదల వల్ల గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ డ్యామ్ నిండిపోయింది. ఫలితంగా దిగువకు నీటిని విడుదల చేయడంతో ఉరి భాఖినీ నదిలోకి వరద పోటెత్తింది. దీంతో మధ్యప్రదేశ్‌లోని ధర్ జిల్లాలోని నిసార్‌పూర్ గ్రామం ముంపునకు గురైంది. ఆదివారం నీటి నిల్వలు 133 మీటర్ల స్థాయికి చేరాయి. ఇది ప్రమాద స్థాయి కంటే 6.5 మీటర్లెక్కువ. దీంతో గ్రామంలోని ఇండ్లన్నీ ముంపునకు గురయ్యాయి. నిసార్‌పూర్ పరిసర గ్రామాల్లో సగం జనాభాను సురక్షిత ప్రాంతాలకు తరలించామని నర్మదా వ్యాలీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి ఒకరు తెలిపారు.

### మరోసారి ఒడిశాకు వరద ముప్పు

**భువనేశ్వర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఒడిశాను మరోసారి భారీ వర్షాలు ముంచెత్తనున్నాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ నెల 28 నాటికి తీరం దాటవచ్చునని వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో మూడు రోజులుగా ఒడిశాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల్లో ఇది నాలుగోది. ఈ అల్ప పీడనం వాయవ్య ఒడిశా మీదుగా ఉత్తర ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా తీరం దాటుతుందని వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో వచ్చే 4 రోజుల్లో 11 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

## మున్నాభాయ్ పొలిటికల్ రీఎంట్రీ!

### ఆర్‌ఎస్పీలో చేరనున్న బాలీవుడ్ నటుడు



**ముంబై, ఆగస్టు 25:** బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ మళ్లీ రాజకీయాల్లోకి రానున్నారు. సెప్టెంబర్ 25న ఆయన రాష్ట్రీయ సమాజ్ పక్ష్ (ఆర్‌ఎస్పీ) లో చేరనున్నారని ఆ పార్టీ వ్యవస్థాపకులు మహాదేవ్ జంకర్ ఆదివారం ప్రకటించారు. పార్టీని విస్తరించే క్రమంలో సినీ రంగంలోని ప్రముఖులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కాగా పదేండ్ల క్రితం సంజయ్ దత్ క్రియాశీల రాజకీయాలకు గుడ్ బై చెప్పడం తెలిసిందే.

## ఉత్తర కొరియా మరో ఆయుధ పరీక్ష

### విజయవంతంగా సూపర్ లార్జ్ మల్టిపుల్ రాకెట్ లాంచర్ ప్రయోగం

**సియోల్:** క్షిపణి పరీక్షనో, మారణాయుధ పరీక్షలో చేస్తూ నిత్యం వార్తల్లో నిలిచే ఉత్తర కొరియా.. మరో హాట్ టాపిక్‌తో వార్తల్లోకెక్కింది. శనివారం సూపర్ లార్జ్ మల్టిపుల్ రాకెట్ లాంచర్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ స్వీయ పర్యవేక్షణలో మల్టిపుల్ రాకెట్ లాంచర్ ప్రయోగం, కిమ్ ఫొటోల ను, క్షిపణుల వద్ద నిలబడి ఉన్న ఫొటోలను ఉత్తర కొరియా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసింది. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ 'ఉత్తర కొరియాకివి విలువైన సంపద' అని అన్నారు. 'నిరంతర బెదిరింపులు, శత్రు శక్తుల ఒత్తిడి దాడులను నిరాశపరిచేందుకు కొరియా తరహా వ్యూహాత్మక ఆయుధాల అభివృద్ధిని కొనసాగిస్తాం' అని అన్నారు. అమెరికా, దక్షిణ కొరియా చేపట్టిన సాధారణ సైనిక కసరత్తులకు ప్రతిస్పందనగా క్షిపణి, రాకెట్‌లను పరీక్షించినట్లు ఉత్తర కొరియా తెలిపింది. కాగా, ఉత్తర కొరియా చర్య తనకు సంతోషంగా లేదని ట్రంప్ అన్నారు. అయినా కిమ్ నిబంధనలను ఉల్లంఘించలేదన్నారు.




తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ మైనార్టీల గురుకుల విద్యాలయాల సంస్థ

NIT No.E/10809/TMREIS/2019 ఇ- టెండరు నోటీసు తేది: 00-08-2019

TMR జూనియర్ కాలేజీలకు ల్యాబొరేటరీ ఎక్విప్మెంట్, మెటీరియల్స్ మరియు కెమికల్స్ సరఫరా చేయుటకు '' ప్రభుత్వ ఏజెన్సీలు/ ప్రభుత్వ రంగ సంస్థ ఏజెన్సీల'' నుండి రెండు భాగాలలో (సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్) తెలంగాణ రాష్ట్రంలో 10 TMR జూనియర్ కాలేజీలు నడుపుచున్న TMREI జూనియర్ కాలేజీలు ఇ-టెండర్లు కోరుచున్నది. ఈ విషయానికి సంబంధించి 26-08-2019 నుండి 13-09-2019 వరకు https://tender.telangana.gov.in వెబ్‌సైటుపై ఇ-టెండరు లభించును. ఇ-టెండరు ప్రచురణ 26-08-2019, ప్రీ బిడ్ సమావేశం మరియు టెండరుదార్లచే సాంపిల్సు దాఖలు తేది: 29-08-2019, మ. 03.00 గం., టెండర్ల దాఖలుకు చివరి తేది: 13-09-2019, సా. 06.00గం. సాంకేతిక బిడ్లు తెరుచు తేది: 16-09-2019 మ. 3.00గం. ఆర్థిక బిడ్లు తెరుచు తేది: 18-09-2019 మ.3.00గం.

సం/- సెక్రటరీ, TMREIS

DIPR RO. No. 325-pp/CL/Advt/1/2019-20, Dt: 25/08/2019



తెలంగాణ ప్రభుత్వం
మైనారిటీల సంక్షేమ శాఖ

ప్రకటన

No.960/A1/CMW/OSSM/2019 తేది: 20-08-2019

1) G.O.Ms.No.24 MW(Estt.I) Dept. dated: 19-05-2015. 2) G.O.Rt.No.126 MW(Estt.I) Dept. dated: 17-07-2015. 3)G.O.Ms.No.29 MW(Estt.I) Dept. dated: 09-08-2016, 4)G.O.Ms.No.66 SCD(EDN) Dept. dated: 09-11-2017, 5)G.O.Ms.No.32 MW(Estt.I) Dept. dated: 21-11-2017, 6)G.O.Ms.No.25 MW(Estt.I) Dept. dated: 05-06-2018, 7)G.O.Ms.No.26 MW(Estt.I) Dept. dated: 11-06-2018. **2019 సం॥ (స్ప్రింగ్ సీజన్) అడ్మిషన్స్ కొరకు** విదేశీ విశ్వవిద్యాలయాల నందు పోస్ట్ గ్రాడ్యుయేట్/ డాక్టరల్ కోర్సుల నందు ప్రవేశం కొరకు ఉపకార వేతనం/ ఆర్థిక సహకారం యొక్క మంజూరు కొరకు అర్హులైన మైనారిటీ విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి. అర్హతా ప్రమాణాలన్నింటిని పూర్తిచేయు విద్యార్థులు మరియు విదేశీ విశ్వవిద్యాలయాల నందు పోస్ట్ గ్రాడ్యుయేట్/ డాక్టరల్ కోర్సుల నందు జనవరి -2019 నుండి జూలై -2019 కాలవ్యవధిలో అడ్మిషన్ తీసుకున్న వారు వెబ్‌సైట్: www.telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేస్కోనవలసిందిగా కోరబడుతున్నారు. తేది: **26-08-2019** నుండి **27-09-2019** వరకు స్ప్రింగ్ సీజన్ -2019 కొరకు దరఖాస్తు చేస్కొనుట కొరకు వెబ్‌సైట్ తెరువబడి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలు కొరకు చివరి తేది: **27-09-2019**న సా॥ 5.00 గం॥. పథకం యొక్క వివరాలు, అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు చేస్కోను దేశాలు, ఉత్తీర్ణత, తప్పనిసరి ఆవశ్యకతలు, ఎంపిక చేయువిధానం వెబ్‌సైట్ నందు చూపబడినవి.

సం/- డైరెక్టర్, mw.

DIPR RO No. 321-PP/CL/Advt/1/2019-20, Dt: 21/08/2019

## స్వప్న ఫలం

**ఒకటే** కల
జీవితం నిండా
ముగించని, మాయం చేయలేని
పుట్టుకతో..

ప్రసారానికి అంతూ పొంతూ వుండదు
ఊరింపుల వూరేగింపుల బొమ్మ
అదే పదే పదే
ఏక నామమై, ఒకే నినాదమై,
రద్దు మత్తు జల్లి, సంపూర్ణ దేశభక్తితో

వాయువేగాల విహారానందం
ఊహ పూసినా, నువ్వు విరబూసినా
జీఎస్‌టీ పెనంపై చేప లెక్కనే

నీ పూజా సామాగ్రి సిద్ధపరచబడ్డది
నీ ఇష్టారాజ్యాలు సెన్సార్ చేయబడ్డవి
శాసనాలైనా ఆసనాలైనా
శిరోధార్యాలే
ఆకాశమందుకునే ఉక్కు విగ్రహం ముందు
బల్వాన్ పహిల్వాన్ అన్న చరిత్రకే మొక్కాలి
కంటి మాగ్నెట్‌కి చిక్కే దేశాలేవో
చూపుకి టార్గెట్ అయ్యే దేశాలేవో
అయోధ్య రాముడు రాసిపెడ్తడు

కుటుంబం లేదు
'హిందూత్వ'మే కుటుంబం
మనసులోని మాటలన్నీ
నామావళిగా జపించాలి
గంగాజల ప్రోక్షణతో పాపాలన్నీ ప్రక్షాళనే
త్రికాల నామస్మరణకు మూడు నామాల
మంత్రోపదేశమే శరణ్యం

ఇన్ని రంగులెందుకు
ఇసీ, ఈ రుచులేమిటి
స్వచ్ఛభారత్‌లో ఇంత స్వేచ్ఛ యేల?

ఏక్ రంగ్‌కి జెండా ఊంచా రహేగా సదా

హమ్ సబ్ ఏక్ దేశ్‌హై
హమేశా ఏక్ హి నేతా

తిరగ రాసిన అక్షరం చెరలోనికే
అత్తరొంపే నెలవంక సరిహద్దు సమాధి లోనికే
ఎన్ని కలలు కన్నా రద్దు పద్దులోనికే

ఒకటే ఒకటే కల కను

నిద్రపట్టని రోజున
ఒకేఒకే పీడకల కను...

**– దాసరాజు రామారావు**
**96182 24503**

సాహిత్యరంగంలో విశేష కృషిచేస్తూ.. ఆయన 33 స్వీయ గ్రంథాలను ప్రచురించారు. వాటిలో వేర్వేరు ప్రక్రియలకు చెం దిన గ్రంథాలుండటం విశేషం. వచన కవితా సంపుటాలు, లలితగీతాల సంపుటాలు, ఉద్యమగీతాలు, సాహిత్య వ్యాసా ల సంకలనాలు, జీవిత చరిత్రలు, పరిశోధనలు, విశ్లేషణలు, సాహిత్య చరిత్రను వివరించే గ్రంథాలు మొదలైనవి వాటిలో ఉన్నాయి. ఇవికాకుండా మరో 50కి పైగా గ్రంథాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. వ్యాసాలు, గీతాలు, కవితలు, కథలను సంకలనాలుగా స్వీయ సంపాదకత్వంలో వెలువరించా రు.

# ఉద్యమ సాహిత్యశిఖరం ఎస్వీ

**తెలుగు** సాహిత్యంలో పరిచయం అవసరంలేని పేరు ఎస్వీ సత్యనారాయణ. విద్యావేత్తగా, సాహితీవేత్తగా, ఉద్యమకారుడిగా ఎస్వీ పేరు తెలియని వారుండరు. నిరంతరం సాహిత్యోద్యమాలతో మమేకమవుతున్న ఉద్యమ సాహితీవేత్త ఆయన. అభ్యుదయ రచయితల సంఘంలో జాతీయస్థాయిలో కీలక పాత్ర పోషిస్తూ, సాహిత్యోద్యమంలో తనదైన పంథాలో పురోగమిస్తున్నారు.

1954, ఆగస్టు 16న జన్మించిన ఎస్వీ సత్యనారాయణ హైదరాబాద్‌లోని పాతబస్తీలో పెరిగారు. లాల్‌దర్వాజ సమీపంలోని వెంకట్రావు మెమోరియల్ పాఠశాలలో 1970లో పదో తరగతి చదివేప్పుడే ఆయనలోని సాహితీ తృష్ణను ఉపాధ్యాయులు గుర్తించారు. ఆ రోజుల్లో **'మానవత్వాన్ని రక్షించుకుందాం'** అంటూ ఆయన రాసిన కవిత ఉపాధ్యాయులను ఆకర్షించింది. కరీంనగర్ నుంచి ప్రచురితమయ్యే 'విద్యుల్లత' మాసపత్రికలో 1970మే సంచికలో ఆ కవిత ప్రచురితమైంది. ఆ విధంగా తొలి కవిత ప్రచురితమైన అనంతరం ఎస్వీ వెనక్కి తిరిగిచూడలేదు. మమతానురాగాలు, మానవత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించిన ఆ పదో తరగతి విద్యార్థి అభ్యుదయ సాహిత్యోద్యమానికి దిక్సూచి అయ్యారు.

పాతబస్తీలో పాఠశాల విద్యాభ్యాసం చేసిన ఎస్వీ అనంతరం సిటీ కళాశాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లంలోనూ స్నాతకోత్తర పట్టా అందుకున్న ఎస్వీ ఈ ఉభయ భాషలతో పాటు హిందీ, ఉర్దూల్లోనూ నిష్ణాతులు. ఆచార్య కె.గోపాల కృష్ణారావు పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1982లో **'అబ్బూరి రామకృష్ణారావు రచనలు –సమగ్ర పరిశీలనలు'** అనే అంశంపై ఎంఫిల్ పట్టా పొందారు. అనంతరం **'తెలుగులో ఉద్యమ గీతాలు'** అంశంపై ఆచార్య ఎన్.గోపి పర్యవేక్షణలో సాధికారిక పరిశోధన చేసి, 1989లో డాక్టరేట్ పొందారు. తాను చదువుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే ఆచార్యునిగా, తెలుగుశాఖ అధ్యక్షునిగా, డీన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యునిగా వివిధ హోదాల్లో పని చేశారు. తెలుగు విశ్వవిద్యాలయ పదో ఉప కులపతిగా 2016 జూలై 26న బాధ్యతలు చేపట్టి తనదైనశైలిలో విశ్వవిద్యాలయం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేశారు.

రెండేండ్ల కిందట హైదరాబాద్ నగరంలో వైభవంగా జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయడంలో ఆచార్య ఎస్వీ కృషి కూడా ఎంతో ఉంది. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీలతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం కూడా ఆ సందర్భంగా తెలంగాణ సాహిత్య ఔన్నత్యాన్ని ప్రతిబింబించే గ్రంథాలను ప్రచురించింది.

తెలుగు విశ్వవిద్యాలయ ఉప కులపతిగా గిరిజన భాషలకు ప్రత్యేక పదకోశ తయారీకి శ్రీకారం చుట్టారు. గతంలో విశ్వవిద్యాలయ విద్యార్థులకు, సందర్శకులకు మాత్రమే అందుబాటులో ఉండే విశ్వవిద్యాలయ ప్రచురణల విక్రయశాలను అందరికీ అందుబాటులో ఉండేలా చేశారు.

సాహిత్యరంగంలో విశేష కృషిచేస్తూ.. ఆయన 33 స్వీయ గ్రంథాలను ప్రచురించారు. వాటిలో వేర్వేరు ప్రక్రియలకు చెందిన గ్రంథాలుండటం విశేషం. వచన కవితా సంపుటాలు, లలితగీతాల సంపుటాలు, ఉద్యమగీతాలు, సాహిత్య వ్యాసాల సంకలనాలు, జీవిత చరిత్రలు, పరిశోధనలు, విశ్లేషణలు, సాహిత్య చరిత్రను వివరించే గ్రంథాలు మొదలైనవి వాటిలో ఉన్నాయి. ఇవికాకుండా మరో 50కి పైగా గ్రంథాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. వ్యాసాలు, గీతాలు, కవితలు, కథలను సంకలనాలుగా స్వీయ సంపాదకత్వంలో వెలువరించారు. దాదాపు 50 పరిశోధనా వ్యాసాలను రచించారు. మరో 300కి పైగా సాహిత్య వ్యాసాలను రాశారు. పోరాటయోధులు మఖ్దూం మొహియుద్దీన్, ధర్మభిక్షం, తమ్మారెడ్డి సత్యనారాయణ, యార్లగడ్డ భాగ్యవతిల జీవిత చరిత్రలపై ప్రత్యేక గ్రంథాలను వెలువరించారు. అభ్యుదయ, దళిత సాహిత్యాలపై విశ్లేషణాత్మక గ్రంథాలను రచించారు. తెలంగాణ విమోచనోద్యమంపై 2008లో ఆయన రాసిన గ్రంథం తెలంగాణ విమోచనోద్యమ విశిష్టతను తెలుపుతుంది. విద్య, సాహిత్యరంగాల్లో ఆచార్య ఎస్వీ ప్రస్థానంపై డాక్టర్ కందిమళ్ల భారతి సంపాదకత్వంలో 'ఆత్మీయం'అనే విశ్లేషణాత్మక గ్రంథం వెలువడింది.

పాలనాపరంగా విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నారు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షుడిగానూ శాఖాధిపతిగానూ వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డీన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. సైఫాబాద్‌లోని పి.జి.కళాశాల భాషా శాస్త్ర విభాగాధిపతిగా ఆరేండ్ల పాటు పనిచేశారు. న్యూ రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ వార్డెన్‌గా, హాస్టళ్ల అడ్మిషన్స్ కమిటీ సభ్యుడిగా, హాస్టళ్ల క్రమశిక్షణ సంఘం సభ్యుడిగా నిరంతరం విద్యార్థుల సంక్షేమం కోసం కృషిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయ పాఠ్యప్రణాళిక మండలి సభ్యుడిగా వ్యవహరించారు. బెంగళూరు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల్లో సెలక్షన్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉస్మానియా, ఆంధ్ర, శ్రీకృష్ణదేవరాయ, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాల రచయితగా కీలకపాత్ర పోషించారు. కేంద్ర సాహిత్య అకాడమీలో ప్యానెల్ రచయితగా ఉన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా కృషిచేశారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘంలో ప్రస్తుతం ఆచార్య ఎస్వీ ప్రధాన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకవర్గ సభ్యుడిగా కూడా పనిచేశారు.

వేర్వేరు ప్రక్రియల్లో ప్రజ్ఞానిధిగా పేరుపొందిన ఆచార్య ఎస్వీ అనేక అవార్డులు పొంది, వాటికే వన్నెతెచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషాసంఘం 2004లో ఆయనకు భాషా పురస్కారం అందజేసింది. తెలుగు విశ్వవిద్యాలయం 1999, 2003 సంవత్సరాల్లో ధర్మనిధి పురస్కారాలను ప్రదానం చేసింది. ఆయన రచించిన **'జీవితం ఒక ఉద్యమం'** గ్రంథం 2008లో ఉత్తమ వచన కవితా సంపుటిగా తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం పొందింది. చెన్నైలోని యునైటెడ్ రైటర్స్ అసోసియేషన్ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. సుంకర సాహిత్య పురస్కారాన్ని పొందారు. 1998లో డాక్టర్ చెలికాని రామారావు స్మారక సత్కారాన్ని స్వీకరించారు. వేములపల్లి శ్రీకృష్ణ, పులుపుల శివయ్య, బొల్లిముంత శివరామకృష్ణల పేరిట ఏర్పాటుచేసిన మూడు వేర్వేరు సాహిత్య పురస్కారాలను 2004లో స్వీకరించారు. సాహిత్యరంగంలోనే కాకుండా వృత్తిపరంగా కూడా అనేక పురస్కారాలను ఆయన పొందారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి ప్రభుత్వం ఆయనను గౌరవించింది.

అధ్యయనం నిమిత్తం ఆయన సోవియెట్ యూనియన్‌లో 1984లో పర్యటించారు. ఈజిప్టులో 1998లో పర్యటన జరిపారు. పలు అంశాలపై సాధికారికంగా మాట్లాడగల పరిజ్ఞానం ఉన్న మేధావి ఎస్వీ. తన ఉపన్యాసాల్లో ఎలాంటి మొహమాటాలకు తావులేకుండా సూటిగా గుణదోష విశ్లేషణ చేస్తారు. సీరియస్ అంశాన్ని సైతం ప్రేక్షకులను ఆకర్షించే విధంగా తన హాస్య చతురతతో ఆకట్టుకోగల దిట్ట ఆచార్య ఎస్వీ.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రసిద్ధ ఉర్దూ కవి మఖ్దూం మొహియుద్దీన్ 'షాయరే ఇంక్విలాబ్'గా పేరుపొందిన మఖ్దూం సిటీ కాలేజీలో 1934 ప్రాంతంలో అధ్యాపకుడిగా పనిచేశారు. ఆయన పేరుతో 'సిటీ కాలేజీ మఖ్దూం మొహియుద్దీన్ నేషనల్ అవార్డు'ను ఈ సంవత్సరం నుంచి ఏటా అవార్డు అందజేసేందుకు నిర్ణయించింది. తొలిసారిగా ఈ అవార్డును సిటీ కాలేజీ పూర్వ విద్యార్థి ఎస్వీ సత్యనారాయణకు ఈ నెల 27న అందజేస్తున్నది. ఈ ఇరువురూ ఉద్యమ సాహిత్యంలో విశేష కృషిచేసిన వారు. ఇరువురూ పూర్వ ఉమ్మడి మెదక్ జిల్లా వాస్తవ్యులు కావడంతో పాటు ఇరువురి బాల్యమూ హైదరాబాద్ పాతబస్తీ జ్ఞాపకాలతో పెనవేసుకుపోవడం విశేషం. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న మఖ్దూం మొహియుద్దీన్ పేరిట నెలకొల్పిన జాతీయ అవార్డును అక్షరాలతో ఉద్యమాలకు ఊపిరిపోసిన ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు అందజేయడం ముదావహం.

**– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు**
**94410 46839**



### మఖ్దూం మొహియుద్దీన్ అవార్డు ప్రదానోత్సవ సభ

షాయరే తెలంగాణ మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డును ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానోత్సవ సభ 2019 ఆగస్టు 27న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సిటీ కాలేజీ ఆవరణలోని గ్రేట్‌హాల్‌లో జరుగుతుంది. డాక్టర్ సి.మంజులత అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా నందిని సిధారెడ్డి, పాశం యాదగిరి, వాహెద్ హాజరవుతారు. నిర్వహణ: డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా.



## అతడొక గెలాక్సీ!

అతడు ఒకానొక సామాన్యుడు–
అందరికన్నామిన్నగా మట్టిని పులుముకున్నవాడు
మనిషిని తనకన్నా ఎక్కువగా నమ్మిన వాడు
ఆకాశాన్ని హద్దుగా నిర్ణయించుకున్నవాడు
అందుకేనేమో అతడు
గేయాల గురువు
కవితల కల్పతరువు
చిత్రగీతాల తేజస్వి
గజళ్ళ తపస్వి అయ్యాడు !
అతడు –
శబ్ద చాలనమై సాగే పాట
అందుకేనేమో పాటకు గ్లామర్ని కూడా అద్దాడు
పద విన్యాసమై సాగే మాట
అందుకేనేమో మాటకు గ్రామర్‌ని కూడా దిద్దాడు
బహుశా –
పదాల ప్రయోగాలు అతడికి తెలిసినంతగా
ఏ భాషా నిపుణుడికీ తెలియదేమో
అక్షరాల మనసు అతడు డీ కోడ్ చేసినంతగా
ఏ కవికుల ఋషీ ఎరుగడేమో
ప్రకృతికి నచ్చే కృతులేమిటో అతడు గుర్తించినంతగా
ఏ భావుకుడూ ఊహించలేడేమో
మనిషి తత్వాన్ని అతడు పసిగట్టినంతగా
ఏ లేఖకుడూ కృతి కట్టలేడేమో
మామూలు పద్యానికి ఆర్ద్రతల ఊపిరిలూదటం
సాధారణ ఆలోచనలకు సాంద్రతల జీవం పోయడం
అతడికి మాత్రమే తెలిసిన విద్య !
అతడు –
సకల ప్రక్రియల సాహిత్య కీర్తి
చమత్కారాలతో ఆకట్టుకునే సభామూర్తి
ఏ రంగాన్నైనా ఏలగల సమయస్ఫూర్తి
అందర్నీ సమాదరించే స్నేహ దాహార్తి
మొత్తంగా అతడొక హృదయ సమవర్తి !
అతడు–
పాఠాన్ని, పాటని రెక్కలుగా మొలిపించుకుని
ప్రతి పుట్టినరోజుకి ఓ పుస్తకాన్ని ప్రసవిస్తూ
తెలుగు నుడికట్టును ఆత్మగా
పంచె కట్టును ఆహార్యంగా
మలుచుకున్న కవిరాజు!
అతడు–
కూతుళ్ళనే నదులుగా కళ్ళ కద్దుకుని
తెలంగాణాన్నే తేనె మాగాణంగా భావించుకుని
విశ్వాన్ని తన అంతరంగంలో ఆత్మీకరించుకున్న విశ్వంభరుడు!
అయితే అతడు అతి సామాన్యుడు
అందరిలాంటివాడు
కానీ, అందరికన్నాఎక్కువగా
అక్షరాన్ని కౌగిలించుకున్న వాడు
అనుభూతుల్ని శ్వాసించిన వాడు
జీవితాలను ప్రేమించిన వాడు
అందుకే అతడు తాగిన మానేరు నీరు
నడిచిన హనుమాజీపేట వాడ
చదివిన సిరిసిల్ల వొడి
పాఠాలు చెప్పిన ఉస్మానియా బడి
నిత్యం అతడ్ని తలుచుకుంటాయి
ఇప్పుడు అతడు చల్లిన అక్షర విత్తనాలు
వృక్షాలుగా ఎదిగాయి
అవి నిరంతరం సాహిత్య పుష్పాలను
కవిత్వ ఫలాలను విరగకాస్తున్నాయి!
అయినా అతడు అత్యంత సామాన్యుడు
అందరిలాంటి వాడు
కానీ, మృత్యుంజయుడు
వ్యక్తిగా అంతమై
సాహిత్యంగా అనంతమైనవాడు
అక్షరమైన వాడు ... ఆకాశమైనవాడు.
ఇప్పుడు అంతరిక్షమై వ్యాపించినవాడు!
అతడు –
నిన్న–మనిషి
నేడు–రోదసి
రేపు–గెలాక్సీ!

**– అయినంపూడి శ్రీలక్ష్మి, 99899 28562**



## ఇంకా ఇల్లు రాలేదు

ఎక్కడికి వెళ్ళినా
ఎందుకైనా మంచిదని
ఒక పద్యం దగ్గరుంచుకుంటాను
ఎప్పుడు నొప్పిలేచినా
పక్కజేబులోంచి తీసి
చప్పున గాయాన్ని మూసేస్తాను

ఇంతమంది వుంటారని
ఈ సభకు రాలేదు
కొందరికైనా
నా బాధ అర్థమవుతుందని
మనసు విప్పి మాట్లాడుతున్నాను

అద్దం తుడుచుకోక
చాలా రోజులయింది
ముఖాన్ని చూసుకుంటే
నన్ను నేను,
గుర్తుపడతానో లేదోనన్న అనుమానం వచ్చి,
మరిచిపోవడం–
అలవాటు చేసుకున్నాను
అన్నిదారులూ, అడ్డంగా నడిచివచ్చినా
ఇంకా ఇల్లు రాలేదు
ఎంత అలసిపోయినా
బాట పక్కన, మిగిలిన చెలెమల్లో
కొంచెంకూడా దాహం తీరలేదు

ముంచే వానా–వణికించే చలీ– మాడ్చే ఎండ
రాత్రి పగలని చూడకుండా
కాలం వడివడిగా తొక్కుకుంటూ
పడిలేస్తూ వెళుతోంది

ఏ మైలురాయి దగ్గరో ఆగినప్పుడు
దాచుకున్న అద్దాన్ని
చాలా మోహంగా చూసుకొంటాను
తుఫాన్లకు గాట్లు పడిన నా ముఖం
మచ్చలు మచ్చలుగా మెరిసే
అడవిలోని పులిలా వుంటుంది

**– ఆశారాజు, 93923 02245**

# నాన్న పచ్చి అబద్ధాలకోరు

**'విశ్వవిద్యాలయానికి నోచుకోలేదు**
**విశ్వమనే ప్రపంచంలో నేర్చుకుంటున్న..'** అంటూ.. సాహిత్యం అంటే పిచ్చికాదు నా ప్రాణం అంటాడు కవి సురేంద్ర రొడ్డ. ఈయనకు కవిత్వమన్నా, తెలుగన్నా ఓ విధమైన పిచ్చి. సినారెలాగ తెలుగంటే మమకారం. సినారె తన పిల్లలకు 'గంగ' 'కావేరి' అని పెట్టుకుంటే.. కవి సురేంద్ర రొడ్డ 'జ్ఞాపిక', 'శీర్షిక' అనే పేర్లు పెట్టుకున్నాడు. నిజంగానే కవిత్వంపై ప్రేమతో పిచ్చితో ప్రాణం పెట్టి రాసేవాళ్లు కొందరుంటారు వారిలో కవి సురేంద్ర రొడ్డ ఒకరు.

**'అక్షరాలు నాకు అమ్మపొత్తిళ్ళు**
**పదాలు నాకు పాలబువ్వలు**
**వాక్యాలు నాకు ఆప్తమిత్రులు**
**భావుకతలు నాకు శ్వాసలు**
**సాహిత్యం నాకు సమస్తం.. నాలో ప్రాణమున్నంతవరకూ..**
**అది నన్ను వీడిపోయే వరకు సాహిత్యాన్ని శ్వాసిస్తుంటాను..'**

అనడంలో కవి అంతరాత్మ అర్థం చేసుకోవచ్చు. కవి రాసే కవిత్వం సమాజాన్ని మార్చకున్నా, నిన్ను మార్చితే చాలనే భేదం సుస్పష్టంగా కనబడుతుంది. అది అవసరం కూడా.

ఇంత గొప్పగా కవి రొడ్డ రాస్తున్నప్పుడు, మరి తను రాసిన పుస్తకానికి **'నాన్న పచ్చి అబద్ధాల కోరు'** పేరు పెట్టడం ఏం బాగలేదనుకోవచ్చు. అయితే పుస్తకం చదివితే నిజంగానే నాన్న పచ్చి అబద్ధాల కోరు అనడం సమంజసమే అనిపిస్తుంది. ఒకసారి కవి రాసిన కవిత చూస్తే..

**'బట్టల కొట్టులో నాకు పట్టుబట్టలు కొని**
**తనకు పడవని నూలుబట్టలు కొన్నప్పుడు**
**నాకు తెలియదు నాన్న అబద్ధమాడుతున్నాడని..!**
**ఉన్న ఒక్క పరుపును నాకు పరిచి**
**నడుంనొప్పికి నేలపడకే మంచిదన్నప్పుడు**
**నాకు తెలియలేదు నాన్న అబద్ధమాడుతున్నాడని..!**
**నన్ను ఆటో ఎక్కించి**
**షుగరుకు నడక మంచిదని తను నడిచినప్పుడు**
**నాకు తెలియలేదు నాన్న పచ్చిఅబద్ధాల కోరని..'**

అందుకే తను రచించిన పుస్తకానికి **'నాన్న పచ్చి అబద్ధాల కోరు'** అని పేరు పెట్టాడనిపిస్తుంది. పై కవిత చదువుతుంటే సగటు పాఠకునికి కూడా నాన్నంటే ఇట్టే అర్థమౌతుంది. ఎన్నికాలాలు మారినా ఎన్ని జన్మలైనా నాన్న స్థానం ఆయన స్థాయి మారదు. పై కవితలో చెప్పినవన్నీ అబద్ధాలైనా ముమ్మాటికీ కవితంతా అబద్ధమే దాగింది. ఇందుకే 'నాన్న పచ్చి అబద్ధాలకోరు' అంటాడీ కవి. నాన్న ఉన్నప్పుడు ఇవన్నీ చూసే అద్భుతాలే కానీ, నాన్న మనసులోకి దిగిచూస్తే తెలుస్తుంది ఆయన లోతు.

ఆయన జ్ఞాపకాలను గుండెకు కట్టుకొని నాన్న వేళ్లను పట్టుకొని రాశాడు కవి సురేంద్ర రొడ్డ. నాన్న గురించి అమ్మకు చెప్పకురా అంటూనే సమాజంలో నాన్నపడే పాట్లను ఎత్తిచూపాడు కవి. రొడ్డ కవిత్వం పరిశీలిస్తే తన శైలి వ్యంగ్య రచన కవితను ముందు చదివించి చివరకు కొసమెరుపు అంటించడం గమనించవచ్చు. కవి సురేంద్ర రొడ్డ అర్ధాంగి గురించి రాస్తూ..

**'బండచాకిరి చేయించుకున్నాను గానీ**
**ఒక్కసారైనా ఓ చిన్ని బహుమతిచ్చానా**
**పడకటింట్లో రంభలా చూశాను గానీ**
**ఒక్కసారైన ఓపికుందానని చూశానా..**
**అనారోగ్యంతో నీవు**
**ఆసుపత్రి పాలైతే గానీ తెలియలేదు**
**నీవు లేకుంటే క్షణం సాగదని!'**


ఈ సంపుటిలో ఉన్న కొన్ని గొప్ప కవితలలో 'అర్ధాంగి' కవిత కూడా చోటుచేసుకుంటుంది. ప్రస్తుత కాలంలో అమ్మనాన్నతో పాటు ఆలిని కూడా అంతులేని దుఃఖానికి గురిచేస్తున్నాడీ మానవుడు. ఆస్తులివ్వలేరని కన్నవారిని, కోరిక తీర్చలేదని ఆడవాళ్లని అణువణువునా తీరని వేదనకు గురిచేస్తుంటే దిక్కుమొక్కులేని వారి గురించి ఎంతని చెప్పనూ. పిచ్చెక్కి ఆస్తులకు, కామానికి దేహాలను అంటిపెట్టుకుంటే ఓ కవి రాసిన వాక్యం ఎంతనీ అల్లుకుంటుంది. టన్నులకొద్దీ కన్నీటి నది అయితే కవిత్వం ప్రవాహమై జ్వలిస్తుంది ఆ కన్నీటికి మాటోస్తే..

**'నీ కన్నీటి చుక్కను ఓ సారి కదిపి చూడు**
**ఎన్ని కథలు ఎన్ని వెతలు, ఎన్ని కలలు ఎన్ని ఆశలు**
**ఎన్ని ఊసులు ఎన్ని గాయాలు, ఎన్ని జ్ఞాపకాలు ఎన్ని రహస్యాలు**
**ఎన్ని జీవిత సత్యాలను నీ మనసు విప్పి చెప్తుందో**
**ఓ సారి కదిపి చూడు మనసు పొంగే భావన ఎందుకు రాదో..**
**ఓ సారి రాసి చూడంటాడు..'** కవి సురేంద్ర రొడ్డ. ప్రకృతి అంతా లయాత్మకమే నువ్వు దేన్నైనా ధ్వనింపచెయ్యొచ్చనేది వాస్తవం అంటాడో ఆంగ్ల కవి. నిజమే కవిత్వం రాయాలంటే కొన్ని దుఃఖపు చుక్కలు కారాలంటాడు ఈ నేటి కవి. అలా రాసింది ప్రకృతిలో కలిసిపోరాదని మనసులో చిరస్థాయిగా మిగిలిపోవాలని రాసే ప్రయత్నం చేస్తున్నాడీ కవి. కవికీ విజ్ఞానికీ మధ్య ఒకపచ్చని పొలమున్నది. విజ్ఞాని అది దాటితే మహాజ్ఞాని అవుతాడు. అదే కవి దాటితే మహా దార్శనికుడౌవుతాడు అంటాడు జిబ్రాన్. ఈ చిక్కని ఉదాహరణ చక్కగా సరిపోతుంది కవి సురేంద్రకు.

**'మా అయ్యను గోచిలో కాక.. పంచెకట్టులో చూడాలనే ఆశ**
**పొయ్యిని ఊదినప్పుడు.. పచ్చికట్టెలు అంటుకోక**
**ఊపిరాడని పొగలో..కన్నీళ్ళు రాని అమ్మను చూడాలనే ఆశ..'**

ఆ ఆశ నెరవేరాలని కోరుకుంటూ.. తన కవిత్వం పండిస్తున్న తీరు ఔరా అనిపిస్తుంది. ఇలా కవి రాసిన పుస్తకం నిండా వస్తు వైవిధ్యంతో ఎన్ని పుష్పమాలికలు అల్లాడో ఇంకా కొన్ని కవితలకు మరింత కవిత్వం పూస్తే చాలా బాగుంటుందని భవిష్యత్తులో ఇంకా గొప్ప కవిత్వం రాయాలని కోరుకుంటూ.. కవి సురేంద్ర రొడ్డకు మనస్ఫూర్తిగా నా అభినందనలు.

**– చిగురాల్‌పల్లి ప్రసాద్, 96421 09537**




ప్రకృతి అంతా లయాత్మకమే నువ్వు దేన్నైనా ధ్వనింపచెయ్యొచ్చనేది వాస్తవం అంటాడో ఆంగ్ల కవి. నిజమే కవిత్వం రాయాలంటే కొన్ని దుఃఖపు చుక్కలు కారాలంటాడు ఈ నేటి కవి. అలా రాసింది ప్రకృతిలో కలిసిపోరాదని మనసులో చిరస్థాయిగా మిగిలిపోవాలని రాసే ప్రయత్నం చేస్తున్నాడీ కవి. కవికీ విజ్ఞానికీ మధ్య ఒక పచ్చని పొలమున్నది. విజ్ఞాని అది దాటితే మహాజ్ఞాని అవుతాడు. అదే కవి దాటితే మహా దార్శనికుడౌవుతాడు అంటాడు జిబ్రాన్. ఈ చిక్కని ఉదాహరణ చక్కగా సరిపోతుంది కవి సురేంద్రకు.


**ప్రకటన**

### నవ్యాంధ్ర మహాసభలు

2019 సెప్టెంబర్ 8,9 తేదీల్లో నవ్యాంధ్ర రచయితల మహాసభలు విజయవాడ, బందర్‌రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరుగుతాయి. ఈ సందర్భంగా 'తెలుగు భాష పరిరక్షణ–ప్రభుత్వం పాత్ర', 'ఆధునిక సాహిత్యం–తీరు తెన్నుల'పై ప్రముఖుల ఉపన్యాసాలుంటాయి. సాహితీ, సామాజిక సేవలందించిన ప్రముఖులకు 'నవ్యాంధ్ర రత్నాలు'పేర సత్కారాలుంటాయి. కవి సభలో పాల్గొను వారు తమ కవితలను ఆగస్టు 28లోగా networkngos@gmail. com కు పంపాలి. వివరాలకు: 8374439053, 8332903156.

**- కృష్ణ బిక్కి, అధ్యక్షులు, కలిమిశ్రీ, ప్రధాన కార్యదర్శి**

**కొత్త పుస్తకాలు**

### 'ది 5AM క్లబ్'



ఐతిహాసికమైన నాయకత్వం, ఉన్నత శ్రేణి నిర్వహణ శిక్షణలో నిపుణులైన రాబిన్‌శర్మ 'ది 5AM క్లబ్' పుస్తకానికి ఇది తెలుగు అనువాదం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఈ పుస్తకం ఎందరికో మార్గదర్శిగా, వెలుగు దారిగా నిలిచింది.

**రచన: రాబిన్‌శర్మ తెలుగు: జీఆర్‌కే శర్మ,**
**వెల:రూ. 250, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు**

### నీపేరు తలచినా చాలు..!



(డాక్టర్ సి.నారాయణరెడ్డి సినీ గీతాలకు వ్యాఖ్య 1962–69)

ప్రముఖ రచయిత డాక్టర్ కంపెల్లె రవిచంద్రన్ డాక్టర్ సినారె 1962–69 కాలంలో రచించిన సినీ గీతాల విశ్లేషణ విశిష్టమైనది. ఆ కాలంలో 39 చిత్రాలకు సినారె రాసిన 61 గీతాలకు రచయిత విశ్లేషణ ఎంతో విలువైనది. సామాజిక, మానవీయ అనుబంధాలకు పెద్ద పీట వేసిన సినారే భావుకతను తెలుపుతుంది.

**రచన: డాక్టర్ కంపెల్లె రవిచంద్రన్ వెల: రూ. 200**
**ప్రతులకు:క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, 1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, వెజిటెబుల్ మార్కెట్ రోడ్, శంకర్‌మఠ్ దగ్గర, నల్లకుంట, హైదరాబాద్. సెల్:9848065658**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ
కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

# మా మాట!


## పట్టించుకోవడం లేదు



నా తండ్రి బోద లచ్చయ్యకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాముత్తారం మండలంలోని మాధారం గ్రామంలో సర్వేనంబర్ 91/73లో 32 గుంటల భూమి, నా తమ్ముడు బోద సమ్మయ్యకు సర్వే నంబర్ 91/70లో ఎకరం 32 గుంటలు, 91/71లో 28 గుంటల భూమి ఉన్నది. మా నాన్న, తమ్ముడు కొన్నేండ్ల క్రితం చనిపోయారు. వారి పేరిట ఉన్న భూమిని నా పేరు మీదికి మార్పిడి చేయాలని విన్నవించుకున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. లాయర్ దగ్గరకు పోయి నోటరీ రాయించుకొని.. రెవెన్యూ అధికారికి ఇచ్చినప్పటికీ నా పేరుమీద పట్టా చేయడంలేదు.

**- సింగినేని సారక్క, మాధారం, మహాముత్తారం మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా .**

## ప్రభుత్వ పథకాలకు దూరమయ్యా..



మా నాన్న పంతకాని అంకయ్య పేరు మీద జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాముత్తారం మండలంలోని మాధారం గ్రామంలో సర్వే నంబర్ 20లో 14 గుంటలు, 21లో గుంట, 46/1లో 1.27 ఎకరాలు, 91/119లో 9 గుంటలు, 91/277లో 11 గుంటలు, 164లో 21 గుంటలు 165లో 15 గుంటలు,166లో 22 గుంటల భూమి ఉన్నది. మా తండ్రి కొన్నేండ్ల కింద చనిపోయాడు. ఆయన పేరు మీద ఉన్న పట్టాను నా పేరు మీదికి మార్చాలని రెవెన్యూ అధికారులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారిని కలిసినా పట్టించుకోవడం లేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు, సబ్సిడీ ఎరువులు, రైతు బీమా పథకాలకు దూరమయ్యాం. ఉన్నతాధికారులు పట్టించుకొని నా పేరుమీద పట్టా అయ్యేలా చూడాలని చేతులెత్తి వేడుకుంటున్నా.

**- పంతకాని పోషయ్య,మాధారం, మహాముత్తారం మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా .**

# సమరయోధుడి భూమి ఇతరులకు పట్టా



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్ జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదానం గ్రామంలోని సర్వే నంబర్ 147/144లో రెండెకరాల భూమిని స్వాతంత్ర్య సమరయోధుడు ఎన్ అచ్చయ్యకు ప్రభుత్వం ఇచ్చింది. 2005లో అచ్చయ్య పేరిట రెండెకరాల భూమి పట్టా అయింది. అచ్చయ్య ఆ భూమిని సాగుచేయకుండా పడావుపెట్టారు. దీంతో అక్రమార్కుల కన్ను ఆ భూమిపై పడింది. అచ్చయ్య ప్రమేయంలేకుండానే ఆ భూమిని ఇతరులు పట్టా చేసుకున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహాయపడ్డారు. 2010లో అచ్చయ్య మరణానంతరం అతని కుమారుడు జయరాం తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమి గురించి పోరాడుతున్నారు. తాసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. రెండెకరాల భూమిని తనకు విరాసత్‌చేయాలని వేడుకొంటున్నారు. ఇదే విషయమై రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల తాసిల్దార్ రాజేశ్వర్‌రెడ్డిని నమస్తే తెలంగాణ సంప్రదించగా.. తనకు ఈ విషయంపై ఎలాంటి దరఖాస్తు అందలేదని, గతంలో ఒకసారి మాత్రం తన నోటీస్‌లోకి వచ్చిందని చెప్పారు. డాక్యుమెంట్లు చూపించాలని అడిగితే జయరాం చూపించడం లేదని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు అని చెప్తున్నారని అందుకు ఆధారాలు అడిగితే చూపించడం లేదని తాసిల్దార్ చెప్పారు. డాక్యుమెంట్లు చూపిస్తే.. సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

# నిన్న పట్టాదారు.. నేడు అనుభవదారు




భూమి పత్రాలు చూపుతున్న భద్రప్ప కుటుంబ సభ్యులు

- రికార్డులు తారుమారుచేసిన రెవెన్యూ అధికారులు
- రైతు భూమి సహకార సంఘానికి అక్రమంగా పట్టా
- ధర్మగంటను ఆశ్రయించిన మెదక్ జిల్లాకు చెందిన భద్రప్ప కుటుంబం

**మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటకు చెందిన జంగం భద్రప్ప కుటుంబం బతుకుదెరువు కోసం 30 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఆయనకు రంగంపేట ప్రధానరహదారికి అనుకుని సర్వే నంబర్ 297లో 13 గుంటల భూమి ఉన్నది. 2019 వరకు ఆయనే పట్టాదారుగా ఆన్‌లైన్ రికార్డులు ఉన్నాయి. జంగం భద్రప్ప 1990 ఆగస్టులో మరణించారు. భద్రప్ప కుమారుడు జంగం వీరప్ప తన పేరున ఫౌతీ చేయాలని కొల్చారం తాసిల్దార్ సహదేవ్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే ఆ భూమి రంగంపేట విశాల సహకార సంఘం పట్టాదారుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నది. 2019 జూలై వరకు తమ తండ్రి భద్రప్ప పేరు మీదనే భూమి ఉన్నదని.. ఇప్పుడు విశాల సహకారసంఘం పేరు ఎలా వస్తుందని వీరప్ప ప్రశ్నిస్తున్నారు. భద్రప్ప 1972లో 13 గుంటల భూమిని విశాల సహకారసంఘానికి అమ్మినట్టు రికార్డులు చూపుతున్నారని.. కానీ, అప్పట్లో అందుబాటులో లేని A4 సైజు పేపర్‌పై తమ తాత ఎలా సంతకం చేశారో అర్థం కావడం లేదని భద్రప్ప మనుమలు ప్రసాద్, నవీన్, వివేక్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

**2019 జూలై వరకు భద్రప్ప పేరుమీదనే..**

ఈ ఏడాది జూలై వరకు 297 సర్వే నంబర్‌లోని 13 గుంటల భూమికి పట్టాదారుగా రైతు భద్రప్ప పేరే నమోదై ఉన్నది. ఇందుకు సంబంధించిన ఈసీని కూడా బాధిత కుటుంబసభ్యులు చూపిస్తున్నారు. జూలై తరువాత పట్టాదారుగా ఉన్న రైతు భద్రప్ప పేరును అనుభవదారుగా రికార్డుల్లో మార్చారని.. పట్టాదారు కాలమ్‌లో రంగంపేట విశాల సహకార సంఘంను చేర్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలంటూ నర్సాపూర్ ఆర్డీవో అరుణారెడ్డి.. కొల్చారం తాసిల్దార్‌కు ఆదేశాలిచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వీఆర్వో భిక్షపతి, గతంలో పనిచేసిన తాసిల్దార్ రమేశ్.. సహకారసంఘంతో కుమ్మక్కై రికార్డులు మార్చారని బాధిత కుటుంబం ఆరోపిస్తున్నది.




2019 జూన్‌లో భద్రప్ప పేరుమీద ఈసీ

### మా పెద్దల గోరీలు ఇక్కడే ఉన్నాయి

297 సర్వే నంబర్‌లోని 0.13 గుంటల భూమి తమదేనని, ఇక్కడ తమ పెద్దల గోరీలు కూడా ఉన్నాయని భద్రప్ప కుమారుడు జంగం వీరప్ప ఆయన భార్య సుగుణ తెలిపారు. అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, తమభూమి ఇప్పించాలని వేడుకుంటున్నారు. పొట్టచేత పట్టుకుని వలసవెళితే.. ఉన్న భూమి రెవెన్యూ అధికారులు, సహకార సంఘం అధికారులు కుమ్మక్కై రికార్డులను మార్చారని పేర్కొన్నారు.

### ఫిర్యాదు అందింది.. విచారిస్తాం



297 సర్వేనంబర్‌లోని భూమిలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నట్టు తమ కు ఫిర్యాదు అందిందని.. విచారణ జరిపిస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ నగేశ్ తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 2019 వరకు రైతు పేరుపై పట్టాఉంటే నర్సాపూర్ ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలని రైతుకు పూర్తి న్యాయం జరుగుతుందని చెప్పారు. రికార్డుల మార్పుపై విచారణ జరుపుతామన్నారు.

### 1972లో కొనుగోలు చేసినట్టు పత్రాలున్నాయి



1972లో 0.13 గుంటల భూమి విశాల సహకార సంఘం కొనుగోలుచేసినట్టు పత్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు రైతు భద్రప్పనే పట్టాదారుగా ఉన్నప్పటికీ.. 1979 నుంచి కాస్తుకాలంలో విశాల సహకార సంఘం పేరే ఉన్నది. సహకారం సంఘానికి సంబంధించి 4.21 ఎకరాల భూమి ఉన్నది. రికార్డుల మార్పులవిషయంలో మాకెలాంటి సంబంధంలేదు.

**- నవీన్, విశాల సహకార సంఘం సీఈవో**

### సహకారం సంఘం అర్జీపెట్టుకున్నది

1972లో సర్వేనంబర్ 297లో విస్తీర్ణం 0.13 గుంటలను తెల్ల కాగితంపై రాసుకుని కొనుగోలు చేసినట్టు సహకారసంఘం ఆర్జీ పెట్టుకున్నారు. మోఖాపైకి వెళ్లి విచారణచేయాలని వీఆర్వో, ఆర్ఐను ఆదేశించాం. వారి నివేదిక ప్రకారం రికార్డుల నుంచి పట్టాదారుకాలంలోభద్రప్ప పేరు తొలగించి విశాల సహకార సంఘం పేరు ఎక్కించాం. ఏమైనా అభ్యంతాలు ఉంటే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలి.

**-సహదేవ్, తాసిల్దార్,కొల్చారం**

# సరిలేరు మీకెవ్వరు?

- భూరికార్డులను మార్చడంలో సాటిలేని రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సిద్దిపేట జిల్లా బైరాన్‌పల్లి వాసి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకభూమిని ఎవరి పేరిటైనా క్షణాల్లో మార్చేయొచ్చని రెవెన్యూఅధికారులు మరోసారి నిరూపించారు. ఎలాంటి రికార్డులు చూడకుండానే భూములను ఒకరి పేరునుంచి మరొకరి పేరిట మార్చేస్తున్నారు. భూములు తారుమారు చేసినట్టు తేలిన తర్వాత కూడా ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. నిజమైన పట్టాదారులు తమపేరిట భూమి ఎంతకాలం ఉంటుందో.. ఎప్పు డు ఎవరిపేరిట మారుతుందో తెలియక.. మనశ్శాంతి లేక.. ఆందోళనకు గురవుతున్నారు. ఇదేవిధంగా రెవెన్యూ అధికారుల వైఖరితో విసిగిపోయిన సిద్దిపేట జిల్లాకు చెందిన రైతులు తమకు న్యాయంచేయాలని ధర్మగంటను ఆశ్రయించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం బైరాన్‌పల్లి గ్రామంలో 60/అ, 60/ఆ సర్వే నంబర్‌లో అన్నదమ్ములు గడ్డం వెంకటేశ్వర్‌రావు, గడ్డం శ్రీనివాస్‌రావుకు 2.38 ఎకరాల చొప్పున భూమి ఉన్నది. 1997-98లో వీరిద్దరూ కలిసి మూడెకరాల భూమిని నందనబోయిన ఎల్లయ్యకు విక్రయించారు. రెవెన్యూ అధికారుల ఎల్లయ్య పేరిట మూడెకరాలు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉండగా ఏకంగా 4.20 ఎకరాల భూమిని పహాణిలో నమోదుచేశారు. విక్రయించింది మూడెకరాలు కాగా నాలుగున్నర ఎకరాలు విక్రయించినట్టు రెవెన్యూ అధికారులు చూపించిన చేతివాటం భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా వెలుగుచూసింది. ఈ భూమికి అసలైన పట్టాదారులైన ఇద్దరు సోదరులు చనిపోవడంతో వారి వారసులు భూమి కోసం పోరాడుతున్నారు. విక్రయించిన భూమి కంటే ఎక్కువగా ఏవిధంగా పహాణిలో రికార్డులు మార్చారో ఆధారాలు ఇవ్వాలంటూ తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా తమ కార్యాలయంలో రికార్డుల మార్పిడికి సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని 2018 జనవరి 23న తాసిల్దార్ కార్యాలయ అధికారులు లిఖితపూర్వకంగా లేఖలో సమాధానమిచ్చారు. దీంతో ఆశ్చర్యపోవడం పట్టాదారుల వంతయింది. రెవెన్యూ అధికారులుచేసిన తప్పులకు, ఇష్టారీతిన రికార్డులు మార్చడంతో తాము బలవుతున్నామని బాధితులు చెప్తున్నారు. రికార్డులు సరిచేయాలని కోరినా కూడా గత రెండేండ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారే కానీ రికార్డులు సరిచేయడంలేదని వాపోతున్నారు. వీఆర్వోలు, తాసిల్దార్లు మారుతున్నారే తప్ప తమ సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యకు సంబంధించి బైరాన్‌పల్లి వీఆర్వో యాదగిరిని 'నమస్తే తెలంగాణ' ధర్మగంట ప్రతినిధి సంప్రదించగా తాను ఇటీవలే గ్రామానికి వీఆర్వోగా వచ్చానని, రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. కోడెమొక్కు చెల్లించి, స్వామివారిని దర్శించుకొన్నారు. దాదాపు 10 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకోగా, రూ. 15లక్షల వరకు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. - వేములవాడకల్చరల్

# ఎంజీఎం ఆధునీకరణకు కృషి

### మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్ అర్బన్ జిల్లా ఆరెపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

**హసన్‌పర్తి:** ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రధాన దవాఖాన వరంగల్ ఎంజీఎంను మరింత ఆధునీకరించేందుకు కృషి చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఆరెపల్లిలో ఆదివారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర 3వ జోన్ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. వరంగల్‌ను హెల్త్‌హబ్‌గా మార్చేందుకు సీఎం కేసీఆర్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. అమెరికా తదితర దేశాల్లో వరంగల్ వైద్యులకు మంచి గుర్తింపు ఉన్నదన్నారు. వైద్యరంగంలో గొప్ప డాక్టర్లకు వరంగల్, హైదరాబాద్ నగరాలు కేంద్రంగా మారినట్టు తెలిపారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వరంగల్‌లోని ఎంజీఎంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపునకు సీఎం కేసీఆర్ నిధులు విడుదల చేశారనీ, ఇకపై ప్రతీ నెలా ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మూడో జోన్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పిల్లి సాంబశివరావు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి ఈటల. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీలు నారదాసు, జీవన్‌రెడ్డి

# అన్నివర్గాల అభివృద్ధికి ప్రోత్సాహం

### మంత్రి ఈటల రాజేందర్

**కరీంనగర్ రూరల్:** అన్ని వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ ఎస్సారార్ కళాశాల వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం సీతారాంపూర్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంఘం ఆవరణలో రూ.46 లక్షల నిధులతో రెడ్డి హాస్టల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి చేసిన సేవల స్ఫూర్తితో రెడ్డి సంఘం హాస్టల్, కళాశాల నిర్మాణాల కోసం హైదరాబాద్‌లో విలువైన 18 ఎకరాల స్థలాన్ని సీఎం కేసీఆర్ కేటాయించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, తెలంగాణ టూరిజం చైర్మన్ భూపతి రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

**సాంబమూర్తి ప్రతిభ అద్భుతం**

**కమలాపూర్:** తక్కువ ఖర్చుతో వైండింగ్ యంత్రాన్ని తయారు చేసిన వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్‌కు చెందిన తుమ్మ సాంబమూర్తిని మంత్రి ఈటల రాజేందర్ అభినందించారు. కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి కేవలం రూ.2వేలు వెచ్చించి వైండింగ్ యంత్రాన్ని రూపొందించిన సాంబమూర్తిని కలిసి ప్రశంసించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ రెండున్నర గంటలు చేసే ఫ్యాన్ వైండింగ్‌ను.. తాను రూపొందించిన యంత్రంతో గంటలోనే పూర్తి చేయొచ్చన్నారు.



నందికొండలో చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యేలు నోముల, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి

# ఐలమ్మ పోరాటస్ఫూర్తితోనే తెలంగాణ

### విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**హాలియా, నమస్తే తెలంగాణ:** తొలితరం తెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ తెగువ, సాహసం ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు నాంది పలికిందని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా నందికొండలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అన్నారు. తెలంగాణ యావత్తు ప్రజలు వీరనారి ఐలమ్మకు రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, నాగార్జునసాగర్, నల్లగొండ ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు ఎంసీ కోటిరెడ్డి, కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి దారుణ హత్య

**పెబ్బేరు రూరల్:** స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గంధం స్వామి (24) శనివారం రాత్రి స్నేహితుడు పోలెల లక్ష్మణ్‌తో కలిసి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం బస్టాండ్‌కు సమీపంలో స్వామి మృతదేహం కనిపించింది. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి కత్తులతో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రదేశంలో హతుడి బైక్ నిలిపి ఉన్నది. అక్కడే రక్తపు మరకలతో ఉన్న కత్తి లభించింది. పోలీసు జాగిలం స్వామి స్నేహితుడు లక్ష్మణ్ ఇంటి వద్దే చాలాసేపు తిరిగింది. లక్ష్మణ్ కనిపించకపోవడం, అతని ఫోన్ పనిచేయకపోవడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరుపుతున్నారు.



# నీటిలోనే మట్టపల్లి నృసింహుడి ఆలయం

### 15 రోజులుగా అదే పరిస్థితి


**మఠంపల్లి :** పంచనారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న మట్టపల్లి శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహుడి ఆలయం ఇంకా వరదలోనే ఉన్నది. పులిచింతల బ్యాక్ వాటర్ కారణంగా 15 రోజులుగా నీట మునిగే ఉన్నా అర్చకులు మాత్రం స్వామివారికి నిత్య నైవేద్యాలను కొనసాగిస్తున్నారు. 4 నుంచి 6 అడుగుల మేరకు నీరు ఉండటంతో భక్తులను ఆలయంలోకి అనుమతించడం లేదు.



నిండుగా ప్రవహిస్తున్న మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని ఎర్రవాగు

# మంచిర్యాల జిల్లాలో ఓ మోస్తరు వర్షం

**మంచిర్యాల అగ్రికల్చర్:** మంచిర్యాల జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కోటపల్లి మండలంలో 25.5 మిల్లీమీటర్లు నమోదు కాగా జిల్లా సగటు 5.1 మిల్లీమీటర్లుగా రికార్డయింది. నెన్నెల మండలం నెన్నెల, కోనంపేట మధ్య ఉన్న లంబాడి తండా ఎర్రవాగు, దమ్మిరెడ్డిపేట, ఖర్జీ మధ్య మత్తడి వాగులు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భీమిని మండలం ఎర్రవాగు ఉప్పొంగడంతో ఇటు బెల్లంపల్లికి, అటు దహెగాం, కాగజ్‌నగర్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కన్నెపల్లి మండలం బీర్జాపూర్ వాగు, చెన్నూర్ మండలంలోని సుద్దాల వాగు, కాసిపేట మండలంలోని సల్పాలవాగు, రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల వజినేపల్లి, పులిచింతల ప్రాజెక్టు కాలనీ వద్ద పులిచింతల ప్రాజెక్టు నీటిలోంచి ఆదివారం రోడ్డుపైకి వచ్చిన మొసలి పైనుంచి గుర్తుతెలియని వాహనం వెళ్లడంతో మృత్యువాత పడింది. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మొసళ్లు ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. - చింతలపాలెం



మహారాష్ట్రలోని పోడ్నా గ్రామ సమీపంలో పత్తి చేనులో పులి కళేబరం

# అనుమానాస్పదంగా పులి మృతి

**సిర్పూర్(టి) :** తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో పులి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని పోడ్నా గ్రామ సమీపంలోని ఓ పత్తి చేనులో పులి కళేబరం కనిపించడంతో స్థానికులు మహారాష్ట్ర అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఆ రాష్ట్ర అటవీ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అది చనిపోయి మూడు, నాలుగు రోజులు అవుతుందనీ, దాని వయస్సు రెండేళ్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పులి ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయమై వివరాలు సేకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. పులి అనారోగ్యంతో చనిపోయిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో అధికారులు విచారణ చేపడుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) రేంజ్ అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రతాప్‌నాయక్, ఎండీ ముసావీర్ కూడా ఘటనా స్థలానికి చేరుకొని పులి కళేబరాన్ని పరిశీలించారు.



## చరిత్ర లిఖించిన తెలుగు షట్లర్ పీవీ సింధు

**అనితర సాధ్యమైన ఆట... అనన్య సామాన్యమైన పోరాటం... సడలని ఆత్మవిశ్వాసం.. చెక్కుచెదరని ఏకాగ్రతతో బ్యాడ్మింటన్ జగజ్జేతగా తెలుగు షట్లర్ పుసర్ల వెంకట సింధు అవతరించింది. భారత అభిమానుల ఆకాంక్షలను నెరవేరుస్తూ.. ఎన్నో ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ యవనికపై చరిత్ర లిఖించి... త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది.**

చాంపియన్‌షిప్ తుదిపోరులో సింధు దూకుడు చూసి సగటు ప్రేక్షకులు సహా బ్యాడ్మింటన్ కోర్టు సైతం మురిసిపోయింది. చిరుతలా చురుగ్గా కదులుతూ రాకెట్ వేగంతో బలమైన షాట్లు సంధిస్తుంటే ఔరా అనుకుంది. అంతలా సాగింది తెలుగు షట్లర్ విధ్వంసం. ప్రత్యర్థి ఒకుహరను ముప్పతిప్పలు పెడుతూ వరుస పాయింట్లు సాధిస్తుంటే శభాష్ సింధు అనని అభిమాని లేడు. 2017లో ఒకుహర స్వర్ణ పతకాన్ని చేజార్చిందన్న కసి.. ఈ సీజన్‌లో టైటిల్ సాధించని అసంతృప్తిని ఘనంగా తీరుద్దామన్న పట్టుదల.. రెండూ కలిపి మన తెలుగు షట్లర్ విశ్వరూపమే ప్రదర్శించింది. కేవలం 38 నిమిషాల్లోనే ప్రత్యర్థిని సింధు మట్టి కరిపించేసింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యంత ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్ ఇదే కావడం విశేషం.

# జయహో సింధు



## స్వర్ణం సాధించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత

### ఒకుహరపై ఫైనల్లో సునాయాస విజయం

### బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్

**బాసెల్ (స్విట్జర్లాండ్) :** ప్రపంచ బ్యాడ్మింటన్ మహారాణిగా తెలుగు షట్లర్ పుసర్ల వెంకట సింధు అవతరించింది. 42ఏళ్ల భారత నిరీక్షణకు తెరదించుతూ ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతక స్వప్నాన్ని సాకారం చేసింది. ఈ ఘనత సాధించిన తొలి భారత ప్లేయర్‌గా చరిత్ర లిఖించింది. మూడో సీడ్ ఒకుహర(జపాన్)తో ఆదివారం ఇక్కడ జరిగిన చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ తుదిపోరులో ఆకాశమే హద్దుగా పీవీ సింధు చెలరేగిపోయింది. 2017 ఫైనల్లో ఆమె చేతిలో ఎదురైన ఓటమికి కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. బలమైన స్మాష్‌లు, దూకుడుకు నిజమైన అర్థం తెలిపే ఆట, సమర్థవంతమైన డిఫెన్స్‌తో జపాన్ క్రీడాకారిణిని ఐదో సీడ్ సింధు ఊపిరిసలుపుకోనివ్వలేదు. కనీసం పోటీలోకి వచ్చేందుకు ప్రయత్నించిన ప్రతీసారి బలమైన షాట్లతో ఖంగుతినిపించింది. చివరికి 21–7, 21–7 తేడాతో వరుసగేముల్లో 38 నిమిషాల్లోనే ఒకుహరాను తెలుగు షట్లర్ సింధు చిత్తుచేసింది.

**ఆధిపత్యమంటే ఇదే..**

22 షాట్ల లాంగ్ ర్యా లీతో తుదిపోరుకు అం కురార్పణ జరిగింది. మొదటి పాయింట్‌ను ఒకుహర గెలుచుకుం ది. ఇక పోరు హోరాహోరీ అనుకున్నారం త. అయితే, మ్యాచ్ మొత్తమ్మీద జపాన్ క్రీడాకారిణి ఆధిక్యంలో ఉన్నది ఆ సందర్భంలోనే. ఆ తర్వాత పీవీ సింధు చెలరేగిపోయింది. అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో కోర్టంతా చిరుతలా పరుగెడుతూ పాయింట్లు సాధించింది. స్మాష్‌లు, డ్రాప్‌షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. సింధు దూకుడుతో ఏం చేయాలో పాలుపోని ఒకుహర తప్పుమీద తప్పులు చేస్తూ చతికిలపడింది. దీంతో వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించిన సింధు.. 8–1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ఒకుహర ఒక్క పాయింట్ గెలువగా... మరోసారి దుమ్మురేపిన సింధు మరోసారి వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి ఏకంగా 16–2తో ముందంజ వేసింది. ఆ తర్వాత జపాన్ ప్లేయర్ రెండు వరుస పాయింట్లు సాధించినా మళ్లీ సింధు మళ్లీ పుంజుకొని చివరికి 21–7తో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది.

**రెండో గేమ్‌లోనూ అదే దూకుడు**

రెండో గేమ్‌లో పీవీ సింధు మరింత దూకుడు కనబరిచింది. మొదట్లోనే 2–0తో నిలిచి ఆధిపత్యాన్ని కనబరిచిన తెలుగు షట్లర్ 3–2 ఓ దశలో ఉన్నా ఆ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించి ఒకుహరాకు అందనంత ఎత్తుకు వెళ్లింది. సింధును ఆపేందుకు ఏం చేయాలో అర్థం కాక జపాన్ షట్లర్ దిక్కులు చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఒకుహరా రెండు వరుస పాయింట్లతో పోటీలోకి వచ్చేందుకు ప్రయత్నించగా.. ఈసారి సింధు బలమైన షాట్లతో కోలుకోనివ్వలేదు. రాకెట్ వేగంతో ప్రత్యర్థిని ఆత్మరక్షణలో నెట్టి మరోసారి వరుసగా ఏడు పాయింట్లు సాధించి 9–4 నుంచి ఒకేసారి 16–4కు వెళ్లి మ్యాచ్‌ను పక్కా చేసుకుంది. అదే దూకుడు కొనసాగించి ఒకుహరను ఖంగుతినిపిస్తూ రెండో గేమ్‌ను కూడా 21–7తో కైవసం చేసుకొని తుదిపోరులో సింధు విజయం సాధించింది. భావోద్వేగంతో కోర్టులోనే విజయ సంకేతం చేసింది. అభిమానులకు అభివాదం చేసి, కోచ్ గోపీచంద్‌కు కృతజ్ఞతలు తెలిపింది. సగర్వంగా స్వర్ణ పతకాన్ని ముద్దాడింది.

**చెప్పలేనంత** సంతోషంగా ఉంది. ఈ విజయం కోసం ఎంతో కాలం వేచి చూశా. చివరికి సాధించా. సంతోషాన్ని వ్యక్తం చేసేందుకు మాటలు చాలడం లేదు. చాంపియన్‌గా అవతరిస్తానని ఎంతో కాలంగా అనుకుంటున్నా. ఇప్పటికి సాధ్యమైంది. ఈ విజయం చాలా ప్రత్యేకం. ఎందుకంటే చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన ఏకైక ఇండియన్‌గా నన్ను నిలిపింది. నాకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నా విజయానికి కోచ్‌లు గోపీచంద్, కిమ్... తల్లిదండ్రులు, సహాయక సిబ్బంది కారణం. ఈ విజయాన్ని మా అమ్మకు అంకితమిస్తున్నా. ఈ రోజు ఆమె జన్మదినం. ఆమెకు ఏదో ఒక బహుమతి ఇవ్వాలనుకున్నా. చివరికి స్వర్ణ పతకాన్నే ఇస్తున్నా. నా తల్లిదండ్రుల వల్లే నేను ప్రస్తుతం ఇక్కడున్నా. త్రివర్ణ పతాకం రెపరెపలాడుతూ, జాతీయ గీతం వినిపిస్తుంటే ఎంతో గర్వంగా ఉంటుంది. భావోద్వాగానికి లోనయ్యా. దేశం కోసం ఆడడం నాకు గర్వకారణమైన విషయం.
**- పీవీ సింధు**



సింధు చాలా వేగంగా, చురుగ్గా ఆడింది. ఆమె వేగాన్ని అందుకోలేకపోయా. సరిపడినంత త్వరగా ప్రతిస్పందించలేకపోయా. డిఫెండ్ చేయడంలో విఫలమయ్యా. క్రీడల్లో ఒక్కోసారి ఇలా జరుగుతుంటుంది.
**- ఒకుహర, రన్నరప్**

## సింధు, ప్రణీత్‌కు బాయ్ నజరానా

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, కాంస్య పతకాలతో మెరిసిన పీవీ సింధు, సాయి ప్రణీత్‌కు భారత బ్యాడ్మింటన్ సమాఖ్య(బాయ్) నజరానా ప్రకటించింది. సింధుకు రూ. 20 లక్షలు, ప్రణీత్‌కు రూ.5 లక్షల నగదు ప్రోత్సాహం ఇస్తున్నట్లు బాయ్ అధ్యక్షుడు హిమంత బిస్వా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

**ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు**

| | | |
|---|---|---|
| 2019 | బాసెల్ | స్వర్ణం |
| 2018 | గ్లాస్గో | రజతం |
| 2017 | నాన్జింగ్ | రజతం |
| 2014 | గ్వాంగ్జు | కాంస్యం |
| 2013 | కోపెన్‌హగన్ | కాంస్యం |



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలిచిన పీవీ సింధుకు అభినందనలు. అద్భుత విజయం సాధించి దేశానికి గర్వ కారణంగా నిలిచారు. మీరు ఆడిన తీరు, కృషి, పట్టుదల ఎంతో మందిని ఆకర్షించడమే కాకుండా స్ఫూర్తి కల్గిస్తుంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను..
**– రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్**



అసమాన ప్రతిభ కల్గిన పీవీ సింధు మరోమారు దేశం గర్వపడేలా చేసింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన సింధుకు అభినందనలు. ఆట పట్ల ఆమెకున్న అంకితభావం, పట్టుదల వెలకట్టలేనివి. సింధు విజయం.. భవిష్యత్ తరాలకు ఎందరికో స్ఫూర్తిదాయకం..
**– ప్రధాని నరేంద్ర మోదీ**



వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలిచిన స్టార్ షట్లర్ పీవీ సింధుకు అభినందనలు. అద్భుత విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను..
**– రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు**

'స్వర్ణం సాధించిన తొలి భారత షట్లర్‌గా తెలుగమ్మాయి నిలువడం అందరికీ గర్వకారణం. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ కీర్తి, ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలి'
**– రాష్ట్ర గవర్నర్ నరసింహన్**

'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలిచిన సింధుకు అభినందనలు. వారెవ్వా ఏం అద్భుత ప్రదర్శన. నీవు సాధించిన ఈ విజయం ఎంతో మంది యువతకు తమ కలలు సాకారం చేసుకునేందుకు స్ఫూర్తిదాయకం'
**– కేటీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం ద్వారా సింధు చరిత్ర సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా నిలిచిన సింధుకు అభినందనలు'
**– కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు**

వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం ద్వారా చరిత్ర సృష్టించిన సింధుకు రాష్ట్ర యువజన క్రీడాశాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్, మాజీ మంత్రి హరీశ్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ అభినందనలు తెలిపారు.

**4**
**ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అన్ని రకాల పతకాలు సాధించిన నాలుగో సింగిల్స్ ప్లేయర్‌గా సింధు నిలిచింది.**

**2**
**ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలను(స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు) సాధించిన రెండో మహిళా ప్లేయర్‌గా సింధు రికార్డు సృష్టించింది. తొలిసారి ఈ ఫీట్‌ను జాంగ్ నింగ్ (చైనా) సాధించింది.**



## మొమోటాదే స్వర్ణం

బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ కెంటో మొమోటా(జపాన్) 21–9, 21–3తేడాతో ఐదో సీడ్ అంటోన్‌సెన్(డెన్మార్క్)పై సునాయస విజయం సాధించి, స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ జోడీ మట్సుమోటా– నగాహర(జపాన్) 21–11, 20–22, 23–21 తేడాతో గంటా25 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో వారి దేశానికి చెందిన యుకీ– హిటోరా ద్వయంపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో మహమ్మద్ అహ్సాన్– సెటియావాన్(ఇండోనేషియా) 25–23, 9–21, 21–15 తేడాతో టకురో హోకీ– కబయాషి(జపాన్)పై విజయం సాధించారు. మిక్స్‌డబుల్స్ విభాగం ఫైనల్లో టాప్ సీడ్ చైనా ద్వయం జెంగ్ సీ వీ– హుయాంగ్ యాక్వింగ్ 21–8, 21–12 తేడాతో నాలుగో సీడ్ థాయ్‌లాండ్ జోడీ డెచాపోల్–సాప్‌సిరీ పై గెలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది.

## స్టోక్స్ హీరోచితం

### ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్ గెలుపు ఆసీస్‌కు తీవ్ర నిరాశ

**లండన్:** సంప్రదాయ క్రికెట్‌లో అసలు సిసలు మజాను అందిస్తూ ఉత్కంఠ మధ్య సాగిన యాషెస్ సిరీస్ మూడో టెస్టులో బెన్ స్టోక్స్(219 బంతుల్లో 135 నాటౌట్ ; 11ఫోర్లు, 8సిక్సులు) అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో చివరికి ఇంగ్లండ్ సాధించింది. మ్యాచ్ నాలుగో రోజైన ఆదివారం మ్యాచ్ ఎన్నో మలుపులు తిరగగా 359 పరుగుల లక్ష్యాన్ని ఓ వికెట్ మిగిలుండగా ఇంగ్లిష్ జట్టు ఛేదించింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఆ జట్టుకు ఇదే అత్యధిక లక్ష్యఛేదన. చివరి వికెట్‌కు లీచ్(1నాటౌట్)ను నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌కే పరిమతం చేస్తూ 76 పరుగులు జోడించి.. అద్భుతం చేసి బెన్ స్టోక్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను



స్టోక్స్ (135★)

అందుకున్నాడు. ఆ ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల యాషెస్ సిరీస్ 1–1తో సమం కాగా నాలుగో మ్యాచ్ వచ్చే నెల 4న ప్రారంభం కానుంది. ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్ 4, లైయాన్ 2వికెట్లు తీశారు.

**ఆద్యంతం మలుపులే...**

ఓవర్‌నైట్ స్కోరు 156–3తో నాలుగో రోజు ఆటకు బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. రూట్(77) త్వరగానే ఔట్ కాగా.. ఆ తర్వాతి వికెట్‌కు బెయిర్‌స్టో(36) సాయంతో స్టోక్స్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఐదో వికెట్‌కు 86 పరుగులు జత చేయడంతో చేశాక బెయిర్‌స్టో ఔట్ కాగా, కాసేపటికే బట్లర్(1), వోక్స్(1)ను వెనుదిరిగారు. ఇక ఆర్చర్(15), బ్రాడ్(0) కూడా కాసేపటికే ఔట్‌కాగా, విజయానికి 73 పరుగులు అవసరమైన సమయంలో లీచ్ చివరి బ్యాట్స్‌మన్‌గా స్టోక్స్‌కు జతగా బరిలోకి దిగాడు. స్టోక్స్ క్రమంగా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ మ్యాచ్‌ను ఇంగ్లిష్ జట్టు వైపునకు తిప్పాడు. వ్యక్తిగత స్కోరు 96 ఉన్నప్పుడు వరుసగా ఫోర్, రెండు సిక్సర్లను బాది శతకం చేశాడు. చివరి వరకు లీచ్‌ను నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌కే పరిమితం చేస్తూ 76 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ మిగిలుండగా 362 పరుగులు చేసి విజయం సాధించింది. 34, 116 వ్యక్తిగత స్కోర్ల వద్ద స్టోక్స్ ఇచ్చిన క్యాచ్‌లను వార్నర్, మార్కస్ హారిస్ వదిలేశారు.

## విండీస్ విలవిల!

### బుమ్రా, ఇషాంత్ విజృంభణ .. లక్ష్యఛేదనలో 15/5



బుమ్రా (3/6)

నార్త్‌సౌండ్(అంటిగ్వా): వెస్టిండీస్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్‌పై భారత్ మరింత పట్టు బిగించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతూ భారీ విజయంపై కన్నేసింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 419 పరుగుల లక్ష్యఛేదనలో విండీస్ టీ విరామ సమయానికి 5 వికెట్లు కోల్పోయి 15 పరుగులు చేసింది. విండీస్‌ను బుమ్రా (3/6) ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ కొట్టాడు. తన తొలి ఓవర్లోనే బ్రాత్‌వైట్(1) స్వింగ్ డెలీవరీతో ఔట్ చేసి వికెట్ల వేట తెరతీశాడు. బ్రాత్‌వైట్‌ను అనుసరిస్తూ జాన్ క్యాంప్‌బెల్(7), బ్రూక్స్(2), హెట్‌మైర్(1) వెంటవెంటనే పెవిలియన్ చేరారు. క్యాంప్‌బెల్‌ను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేస్తే..బ్రూక్, హెటెమైర్‌ను ఇషాంత్(2/8) పెవిలియన్ పంపాడు. దీంతో స్కోరుబోర్డుపై పరుగుల కంటే వికెట్ల సంఖ్య అంతకంతకు పెరుగుతూ పోయింది. ఇదే అదునుగా మరింత జోరు పెంచిన బుమ్రా..బ్రావో(2)ను కండ్లు చెదిరే బంతితో క్లీన్‌బౌల్డ్ జుట్టు సహచరులతో కలిసి సంబురాల్లో మునిగి తేలాడు. చేతిలో ఇంకా ఐదు వికెట్లు ఉన్న విండీస్ 404 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 185/3తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 343/7 వద్ద డిక్లేర్ చేసింది. రహానే(102) సెంచరీతో అదరగొట్టగా, తెలుగు క్రికెటర్ హనుమ విహారి(93) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. రోస్టన్ చేజ్(4/132) నాలుగు వికెట్లు తీశాడు.



## బ్యాంక్ మోసాలపై పరిశీలన కమిటీ


రూ.50 కోట్లు అంతకుమించిన కేసులలో కమిటీ సిఫార్సులు కీలకం: సీవీసీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** బ్యాంకింగ్ మోసాలపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఓ సలహాదారు బోర్డును ఏర్పాటు చేసింది. మాజీ విజిలెన్స్ కమిషనర్ టీఎం భాసిన్ నేతృత్వంలో ఇది ఏర్పాటైంది. రూ.50 కోట్లు ఆపై విలువగల మోసాలను పరిశీలించి చర్యలకు ఈ బోర్డు సిఫారసు చేస్తుంది. కాగా, ఇంతకు ముందు అడ్వైజరీ బోర్డ్ ఆన్ బ్యాంక్, కమర్షియల్ అండ్ ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ గా ఉండేది. ఇప్పుడు దీన్ని అడ్వైజరీ బోర్డ్ ఫర్ బ్యాంకింగ్ ఫ్రాడ్స్ (ఏబీబీఎఫ్)గా మార్చారు. దీనికే భాసిన్‌ను బాస్‌గా నియమించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)తో సంప్రదింపుల అనంతరం దీన్ని ఏర్పాటు చేయగా, ఈ బోర్డులో మొత్తం నలుగురున్నారు. రూ.50 కోట్లు ఆపై విలువగల మోసాలను తొలుత బ్యాంకులు ఈ బోర్డు పరిశీలనకు సూచించాలని, ఆ తర్వాతే బోర్డు చేసిన సిఫార్సుల ఆధారంగా బ్యాంకులు తదుపరి చర్యలకు దిగాలని ఓ ఆదేశంలో సీవీసీ స్పష్టం చేశారు. బోర్డు సభ్యులుగా అర్బన్ డెవలప్‌మెంట్ మాజీ కార్యదర్శి మధుసూదన్ ప్రసాద్, బీఎస్ఎఫ్ మాజీ డైరెక్టర్ జనరల్ డీకే పాఠక్, ఆంధ్రా బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో సురేశ్ ఎన్ పటేల్ ఉన్నారు.

## వృద్ధికి ఊతం ఉద్దీపనలే

- వెల్లడించిన సీఐఐ వర్గాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** మందగిస్తున్న వృద్ధికి మందు ఉద్దీపనలేనని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) అభిప్రాయపడింది. గతవారంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పలు పాలసీ నిర్ణయాలు వృద్ధికి ఊతమివ్వనున్నట్లు, ముఖ్యంగా వృద్ధి స్థిరత్వానికి ఈ నిర్ణయాలు కీలకమని వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ దేశాల ఆర్థిక మందగమన పరిస్థితుల నేపథ్యంలో పడిపోతున్న వాణిజ్యానికి ఈ చర్యలు అడ్డుకట్ట వేయనున్నాయని పేర్కొన్న సీఐఐ..కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం వృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశాలున్నాయని సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్ తెలిపారు. ద్రవ్యలోటును కట్టడి చేస్తూనే ఉద్దీపన నిర్ణయాలకు పెద్ద పీట వేయాలని ఆయన సూచించారు.



ఏప్రిల్-జూన్ మధ్యకాలానికిగాను సీఐఐ నిర్వహించిన సర్వేలో బిజినెస్ అవుట్‌లుక్ 59.6గా ఉంటుందని తెలిపింది. అంతక్రితం త్రైమాసికంలో ఇది 65.2గా ఉన్నది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధి 6.5 శాతంగా ఉంటుందని అంచనావేశారు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు, స్వదేశీ మదుపరులపై విధిస్తున్న సర్చార్జి ఎత్తివేయడం, రుణ రేట్లను రెపో రేటుకు అనుసంధానం చేయడం, చెల్లింపులను వేగితరం చేయడం వంటి కీలక నిర్ణయాలు పెట్టుబడుల పెరుగడానికి దోహదం చేయనున్నాయని సీఐఐ ప్రెసిడెంట్ ఉదయ్ కొటక్ తెలిపారు. రుణాలు లేక సతమతమవుతున్న మౌలిక రంగ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడం ఆర్థిక రంగానికి అనుకూల అంశాలని ఆయన పేర్కొన్నారు.

# మార్కెట్లకు సర్చార్జి బూస్ట్!

కలిసిరానున్న కేంద్ర వృద్ధిదాయక చర్యలు • ఈవారం స్టాక్ మార్కెట్లపై విశ్లేషకుల అంచనా



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:**

గడిచిన కొన్ని వారాలుగా తీవ్ర ఒడిదుడుకులలో కదలాడిన స్టాక్ మార్కెట్లు ఈ వారంలో భారీగా పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులపై విధించిన సర్చార్జిని ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈక్విటీ మార్కెట్లు పుంజుకోవడానికి దోహదపడనున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. మందగమనంలో కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతవారం చివర్లో ప్రకటించిన పలు ఉద్దీపన చర్యలు మార్కెట్లకు ఆక్సీజన్‌లా పనిచేయనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై సర్చార్జిని విధిస్తు తీసుకున్న నిర్ణయం మార్కెట్ల పతనాన్ని శాసించింది. జూలై, ఆగస్టు నెలల్లో ఏకంగా దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు 3 బిలియన్ డాలర్ల(రూ.24,500 కోట్ల) పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కేంద్రం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అంతంత మాత్రంగానే ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది రోకలి పోటులా తయారుకావడంతో దీనిని వెంటనే ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. ఈ దెబ్బ రూపాయిపై కూడా పడింది. గడిచిన వారంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 72 స్థాయికి జారుకున్నది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం వృద్ధిదాయక చర్యలు కూడా తీసుకోనున్నట్లు ప్రకటించడం మార్కెట్లలో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అంశమని కొటక్ సెక్యూరిటీస్ హెడ్ రుస్మిక్ ఓజా తెలిపారు. మార్కెట్లో నిధుల లభ్యతను పెంచడానికి ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.70 వేల కోట్ల నిధులను కేటాయిస్తూ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆటోమొబైల్ రంగానికి ఊతమివ్వడానికి వచ్చే ఏడాది మార్చినాటికి బీఎస్-4 ప్రమాణాలతో తయారైన వాహనాలను విక్రయించడానికి అనుమతి ఇవ్వడంతోపాటు జూన్ 2020 నాటికి రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని కేంద్రం ప్రకటించింది. ఈ నిర్ణయం ఆటోమొబైల్ రంగ షేర్లకు జోష్ నివ్వనున్నది. గతవారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 649.18 పాయింట్లు నష్టపోయింది.

### బ్లూచిప్ సంస్థలకు తప్పని నిరాశ

గడిచిన వారంలో బ్లూచిప్ సంస్థలు భారీగా నష్టపోయాయి. టాప్-10 సంస్థల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువ రూ.80 వేల కోట్లకు పైగా నష్టపోయాయి. వీటిలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ అత్యధికంగా నష్టపోయింది. వీటితోపాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐలు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. కానీ, టీసీఎస్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్ మాత్రం లాభపడ్డాయి. ఐటీసీ మార్కెట్ క్యాప్ రూ.20,784.40 కోట్లు తగ్గి రూ.2,89,740.59 కోట్లకు పడిపోగా, ఎస్బీఐ రూ.17,715.4 కోట్లు పతనం చెంది రూ.2,41,946.22 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.17,335.50 కోట్లు తగ్గి రూ.5,91,490.98 కోట్లకు పడిపోయింది. వీటితోపాటు ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.15,084 కోట్లు పడిపోగా, హెచ్‌డీఎఫ్‌సీ విలువ రూ.9,921 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.5,155.85 కోట్లు, ఆర్ఐఎల్ రూ.919 కోట్లు తగ్గాయి. ఇదే సమయంలో టీసీఎస్ అత్యధికంగా రూ.31,538.79 కోట్లు అందుకొని రూ.8.43,367.22 కోట్లకు ఎగబాకింది. ఇన్ఫోసిస్ రూ.11,74,6.94 కోట్లు, హెచ్‌యూఎల్ రూ.7,176.31 కోట్లు అధికమయ్యాయి.

### మార్కెట్లు దిద్దుబాటుకు గురికావచ్చు..

కొటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ సీఐవో హర్ష




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లు దిద్దుబాటుకు గురయ్యే అవకాశాలున్నాయని కొటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్(సీఐవో) హర్ష ఉపాధ్యాయ తెలిపారు. సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై సర్చార్జి విధించడంతో స్టాక్ మార్కెట్లుపది శాతానికి పైగా పతనం చెందాయని, ఇది దీర్ఘకాలికంగా కొనసాగే అవకాశాలైతే కనిపించడం లేదని పేర్కొన్నారు. చిన్న, మధ్య స్థాయి స్టాకులు దిద్దుబాటుకు గురికావచ్చునని ఆయన పేర్కొన్నారు. చాలా మంది పెట్టుబడిదారులు ఈక్విటీ మార్కెట్ల నుంచి తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఉపసంహరించుకుంటున్నారన్నారు. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నదని, గడిచిన మూడేండ్లకాలంలో ఈ రంగంలోకి పెట్టుబడులు పెట్టడానికి రిటైల్ ఇన్వెస్టర్లు అంతంగా ఆసక్తిని చూపలేకపోయ్యారు. రూ.25.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ఫండ్ పరిశ్రమలో 40 శాతం ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధులు సమకూరుతున్నాయి. వీటిలో తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టారు. మరోవైపు అంతర్జాతీయ దేశాల ఆర్థిక పరిస్థితులు దిగజారుతుండటం ఆర్థిక మాంద్యం వచ్చిందని చెప్పడం కరెక్ట్ కాదని, దీనికి ఎన్నో కారణాలు ఉంటాయని చెప్పారు. రంగాల విషయానికి వస్తే ప్రైవేట్ బ్యాంకులు, ఇండస్ట్రీయల్, కెమికల్స్, సిమెంట్, ఇన్‌ఫ్రా విభాగాలకు చెందిన షేర్లలో ఇన్వెస్ట్ చేయడం శ్రేయస్కరమని ఆయన అంచనావేస్తున్నారు. కొన్ని రంగాలపై మాంద్యం ప్రభావం పడిందని, ముఖ్యంగా వాహన రంగంపై ఇది ఎక్కువగా ఉందన్నారు.

### కొనసాగుతున్న ఎఫ్‌పీఐల ఉపసంహరణ

విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ కొనసాగుతున్నది. వరుసగా మూడు నెలలుగా దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్న ఎఫ్‌పీఐలు తాజా గా ఆగస్టు నెలలో ఇప్పటి వరకు రూ.3,014 కోట్లకు పైగా పెట్టుబడులను తరలించుకుపోయారు. సంపన్న వర్గాలపై సర్చార్జిని ఎత్తివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుత వారంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. డిపాజిటరీ నివేదిక ప్రకారం.. ఆగస్టు 1 నుంచి 23 వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ. 12,105.33 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్న ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు..డెబిట్ మార్కెట్లలో మాత్రం రూ. 9,090.61 కోట్ల నిధులను చొప్పించారు. నికరంగా రూ.3,014.72 కోట్లను తరలించుకుపోయినట్లు అయింది. గడిచిన 15 ట్రేడింగ్ సెషన్లలో కేవలం రెండు సెషన్లలో మాత్రమే విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరిపారు..మిగతా 13 సెషన్లలో అమ్మకాలకు మొగ్గుచూపారని గ్రోవ్ కో-ఫౌండర్ హర్ష జైన్ తెలిపారు. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించడం, అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటంతో ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని, దీంతో ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపారని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై సర్చార్జిని విధిస్తు ప్రకటనతో విదేశీ మదుపరుల్లో ఆందోళన మరింత తీవ్రతరమైంది. జూన్ నెలలో రూ. 10,384. 54 కోట్లు పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..మే నెలలో రూ.9,031.15 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు, మార్చిలో రూ. 45,981 కోట్లు, ఫిబ్రవరిలో రూ.11,182 కోట్లను చొప్పించారు. ఆ తర్వాత జూలై నెలలో రూ.2,985.88 కోట్లను ఉపసంహరించుకున్నారు. ఎఫ్‌పీఐలపై సర్చార్జీ ఎత్తివేయడంతో ప్రస్తుత వారంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నదన్నారు.

## ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

- 7 శాతం విక్రయాలు పడిపోవడం మాములే
- ఆటోమొబైల్ సంక్షోభంపై రాజీవ్ బజాజ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** వాహన అమ్మకాలు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశీయ ఆటోమొబైల్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గట్టి షాకిచ్చింది. మళ్లీ అమ్మకాలు పెరుగాలంటే ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించాలని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాల కోరికను కేంద్రం పెడచెవిన పెట్టింది. ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశాలు లేవని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ వ్యాఖ్యాలు ఆటోమొబైల్ రంగ సంస్థలపై పిడుగు పడ్డట్టు అయింది. దీంతో చేసేదేమి లేక వాహన తయారీ సంస్థలు నూతనవాటిపై దృష్టిసారించాయి. బజాజ్ ఆటో చైర్మన్ రాజీవ్ బజాజ్ అయితే..వాహన సంస్థలు తమ లోపాలను గుర్తించుకొని వాటిని సరిచేసుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అమ్మకాలు పడిపోవడం, మరోవైపు భారీగా ఉద్యోగాలు కోల్పోవడంతో ఇండస్ట్రీ దిగ్గజాలు మారుతి, మహీంద్రా అండ్ మహీంద్రాలు ఏకంగా ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. ఆటోమొబైల్ సంస్థల్లో అత్యధిక కంపెనీలు తమ ఉత్పత్తుల వల్లనే మందకొడి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో కంపెనీలు లేకపోవడం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టుగా వాహనాలను తయారు చేయకపోవడం ఒక్క కారణమన్నారు. ఆయా సంస్థల పేర్లు వెల్లడించలేనని, స్కూటర్లు, బైకులు, కార్లు, జీపులు, ఎస్‌యూవీలు, ట్రక్కులు, బస్సులు, ఇతర వాహనాలు తయారు చేస్తున్న సంస్థలు ప్రపంచ స్థాయికి తగ్గట్టుగా తయారు చేయడం లేదని చెప్పారు. మరోవైపు ఇటీవలకాలంలో ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగాల తొలగింపుపై ఆయన స్పందిస్తూ..భయపడాల్సిన అవసరం లేదని, అమ్మకాలు 5 శాతం నుంచి 7 శాతం వరకు పడిపోవడాన్ని సంక్షోభమని చెప్పడం హాస్యస్పదమవుతుందని చెప్పారు. ఒకవేళ ఇబ్బందికరంగా ఆటోమొబైల్ రంగం ఉన్నదని తాను ఉద్యోగులకు చెప్పితే..వారికి తనపై గానీ, కంపెనీపై గానీ నమ్మకం ఎలా కుదురుతుందని వ్యాఖ్యానించారు. విక్రయాలపై ఆధారపడివున్న ఉద్యోగుల సంఖ్య కేవలం నాలుగు శాతం మాత్రమేనని, ఇది మిగతా సిబ్బందికి ఎలా న్యాయం చేస్తామని, కంపెనీ ఉద్యోగులు చాలా స్వల్పంగా పొదుపు చేసుకుంటారని, ఒకవేళ వారి ఉద్యోగం తీసివేయడం వల్ల వారి జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకోసమే వారి జీవితాలతో ఆడుకోవాల్సిన అవసరం తనకుగాని, కంపెనీకి గాని లేదని రాహుల్ బజాజ్ స్పష్టంచేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న మందకొడి పరిస్థితులు, ఎగుమతులు పతనమవడం వల్లనే వాహన విక్రయాలు రెండు దశాబ్ద స్థాయికి పడిపోయాయన్నారు. వచ్చే పండుగ సీజన్‌పై గంపెడు ఆశ పెట్టుకుంటున్నట్లు చెప్పారు.

## రుణాలతో రెపో రేట్లకు లింక్

- ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర




**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు తమ రుణాలను రెపోరేటుకు అనుసంధానం చేస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు ఎనిమిది బ్యాంక్‌లు తమ రుణాలను రెపో రేటుకు లింక్ చేసుకోగా..తాజాగా ఈ జాబితాలోకి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర చేరింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రుణాలపై వడ్డీ రేటు మరింత తగ్గనున్నది. వచ్చే పండుగ సీజన్‌లో ఖాతాదారులకు ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలనే ఉద్దేశంతో రెపోరేటును రుణాలకు లింక్ చేసినట్లు, సెప్టెంబర్ 1 నుంచి ఇవి అమలులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతానికి నూతన వినియోగదారులకు మాత్రమే ఈ ప్రయోజనాన్ని కల్పించనున్న సంస్థ..దశలవారీగా పాత ఖాతాదారులకు దీనికి లింక్ చేయనున్నది. ఇప్పటికే బ్యాంక్ గృహ రుణాలను రెపో రేటుకు అనుసంధానం చేసింది కూడా. ఆ తర్వాతి క్రమంలో రిటైల్‌తోపాటు ఇతర రుణాలను అనుసంధానం చేయనున్నది. మరోవైపు వచ్చే ఐదేండ్లకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకుపోవడానికి బ్యాంకింగ్ సంస్థలు సూచనలు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పుణెలో జరిగిన రెండోదఫా సమావేశాలకు 18 ప్రభుత్వరంగ బ్యాంకులు హాజరయ్యాయి. తొలి విడుత శాఖల వారీగా సమావేశాలు జరిగిన విషయం తెలిసిందే.

# గోల్డ్ ఈటీఎఫ్‌లు అదుర్స్

- ఏప్రిల్-జూలైలో రూ.5 వేల కోట్లు దాటిన ఆస్తులు
- స్టాక్ మార్కెట్ల పతనంతో బంగారం వైపు చూస్తున్న మదుపరులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లోని ఆస్తులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి నాలుగు నెల (ఏప్రిల్-జూలై)ల్లో రూ.5,079.22 కోట్లను తాకాయి. ఇదే సమయంలో దేశీయ స్టాక్ మార్కెట్లు 3 శాతం నష్టపోగా, ఆర్థిక ప్రతికూల పరిస్థితుల మధ్య స్టాక్ పెట్టుబడులు శ్రేయస్కరం కాదన్న భావనతోనే మదుపరులు బంగారంవైపు చూశారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ నుంచి ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులకు డిమాండ్ పెరిగిందని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ తెలియజేసింది. ఏప్రిల్-జూలై కాలంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,191.79 పాయింట్లు నష్టపోయింది. వరుస నష్టాల మధ్య తమ పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా మదుపరులు బంగారాన్ని ఎంచుకోవడంతో గోల్డ్ ఈటీఎఫ్‌లు ఆకర్షణీయంగా మారాయి. దీంతో ఒక్కసారిగా వాటి ఆధ్వర్యంలోగల ఆస్తులు పెరిగిపోయాయి. ఏప్రిల్‌లో రూ.4,594.06 కోట్లుగా ఉంటే, మే నెలలో రూ.4,606.69 కోట్లకు, జూన్‌లో రూ.4,931.16 కోట్లకు, జూలైలో రూ.5,079.22 కోట్లకు చేరుకున్నాయి.

### ఒడిదుడుకుల్లో సురక్షితం

ఎంతో సున్నితంగా ఉండే స్టాక్ మార్కెట్ పెట్టుబడుల కంటే బంగారంపై పెట్టుబడులు సురక్షితమని పలువురు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆటుపోట్లకు గురైనప్పుడు మదుపరుల పెట్టుబడులను బంగారమే రక్షిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతుండగా, ప్రస్తుతం స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతుంటే.. బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను బంగారంపై పోగేస్తుండటమే ఇందుకు కారణం. '2012లోనూ ఇలాగే జరిగింది. అప్పుడు కూడా స్టాక్ మార్కెట్ నష్టాలు, మదుపరుల పెట్టుబడుల వరద మధ్య పసిడి ధరలు ఉవ్వెత్తున ఎగిశాయి. మళ్లీ స్టాక్ మార్కెట్ పుంజుకోవడం, బంగారం ధరలూ అదుపులోకి రావడం జరిగింది' అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ భారతీయ సలహాదారు హిమాన్షు శ్రీవాత్సవ అన్నారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం భయాలు కూడా మదుపరులను పుత్తడిపై పెట్టుబడులకు ఆసక్తి చూపేలా చేస్తున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ క్యాపిటల్ మార్కెట్స్ వ్యూహకర్త వీకే శర్మ చెప్పారు.

### మరిన్ని చర్యలు కావాలి

ఆర్థిక పురోగతిపై జేఎం

**ముంబై, ఆగస్టు 25:** దారి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న చర్యలు చాలవని, మరిన్ని చర్యలు అవసరమని జేఎం ఫైనాన్షియల్ నివేదిక ఒకటి అభిప్రాయపడింది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణ పంపిణీ వ్యవస్థ దాదాపు నిలిచిపోయిందని, తిరిగి మళ్లీ ప్రారంభం కావడానికి ఇప్పటిదాకా తీసుకున్న చర్యలు సరిపోవన్నది. ఎన్‌బీఎఫ్‌సీలు, హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ (హెచ్ఎఫ్‌సీ)లకు ఆర్థిక చేయూతనందించడం వల్ల వాహన, గృహ రుణాలకు ఊపు వస్తుందని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకూ ఆర్థికంగా దన్ను లభిస్తుందని వివరించింది. దీంతో ఆటో, రియల్టీ, ఎంఎస్ఎంఈ రంగాల కోలుకునే వీలుందని చెప్పింది. ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణకు అడ్డుకట్ట వేయడానికి సర్చార్జి పెంపును నిలిపివేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

### విస్తరణలో 'కంగారు'

**హైదరాబాద్, ఆగస్టు 25:** ఇంటర్నేషనల్ ప్రీస్కూళ్లు, బిల్లాబంగ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిణ సంస్థ కంగారు కిడ్స్ ఎడ్యుకేషన్ లిమిటెడ్ విస్తరణ బాట పట్టింది. వచ్చే రెండేండ్లకాలంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో మరో 12 స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం 15 స్కూళ్లను నిర్వహిస్తుండగా, 2021 నాటికి ఈ సంఖ్య 27కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీఈవో కేవీఎస్ శేషసాయి ఈ సందర్భంగా తెలిపారు.



దవాఖానలో తండ్రితో సిద్ధార్థ (ఫైల్)

### కాఫీ డే సిద్ధార్థ తండ్రి మృతి

**మైసూరు, ఆగస్టు 25:** కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ తండ్రి గంగయ్య హెగ్డే మృతి చెందారు. 95 ఏండ్ల హెగ్డే మైసూరులోని జీజీఎస్ఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. నెల రోజులకుపైగా ఈ ఆస్పత్రిలో కోమాలోనే ఉన్న ఆయనకు కొడుకు సిద్ధార్థ మరణవార్త కూడా తెలియదు. సిద్ధార్థ గత నెల 31న చనిపోయిన విషయం తెలిసిందే. నేత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్న సంగతీ విదితమే. హెగ్డే కుటుంబానికి 130 ఏండ్లకుపైగా కాఫీ వ్యాపారంతో సంబంధాలుండగా, కర్నాటకలోని చిక్మగలూరు జిల్లాలో ఓ కాఫీ ఎస్టేట్ వద్ద హెగ్డే కాఫీ ప్లాంటర్‌గా ఉండేవారు. అయితే కాఫీ వ్యాపారిగా మారిపోయిన ఆయన స్థానికంగా మంచి గుర్తింపును తెచ్చుకున్నారు.

# మట్టి గురిగెల్లో టీ

త్వరలో రైల్వే, బస్ స్టేషన్లు, మాల్స్, ఎయిర్‌పోర్టుల్లో వడ్డన

కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ చర్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రయాణంలో కాస్త టీ పుచ్చుకుంటే ఆ ఉత్సాహమే వేరు. అలసిన వేళ టీ తెచ్చే హుషారు అంతా ఇంతా కాదు మరి. అందుకే మీకిష్టమైన టీని త్వరలో మట్టి గురిగెల్లో మీ చేతికివ్వాలని కేంద్ర రవాణ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. పర్యావరణ హితార్థం దేశంలోని అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, బస్ డిపోలు, షాపింగ్ మాల్స్‌ల్లో చిన్న మట్టి పాత్రల్లోనే టీని అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి నితిన్ గడ్కరీ లేఖ కూడా రాశారు. ప్రస్తుతం వారణాసి, రాయ్‌బరేలి రైల్వే స్టేషన్లలో మట్టి పాత్రల్లోనే వినియోగదారులకు టీ అమ్ముతున్నారు. గురిగెలు, గ్లాసులు, ప్లేట్లు అన్ని మట్టితో తయారు చేసినవే కావడం విశేషం. 'దేశవ్యాప్తంగా 100 రైల్వే స్టేషన్లలో మట్టి పాత్రల వినియోగాన్ని తప్పనిసరి చేయాలని పియూష్ గోయల్‌కు నేను లేఖ రాశాను. ఎయిర్‌పోర్టులు, బస్ స్టేషన్లలోని టీ స్టాల్స్‌ల్లోనూ మట్టి గురిగెల్లోనే టీ విక్రయించాలని సూచించాం. షాపింగ్ మాల్స్‌ల్లోనూ ఈ సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తున్నాం' అని గడ్కరీ తెలిపారు.

### కుమ్మరి పనులకు దన్ను

కునారిల్లుతున్న కుల వృత్తులకు మళ్లీ జీవం పోసేందుకు మా ఈ ప్రయత్నం దోహదం చేయగలదని గడ్కరీ అభిప్రాయపడుతున్నారు. స్థానిక కుమ్మరివారికి మళ్లీ పూర్వ వైభవం రాగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. పేపర్ ముఖ్యంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని మట్టి పాత్రలతో అరికట్టగలిగితే అటు పర్యావరణంగా, ఇటు ఉపాధిపరంగా లాభాలను పొందగలుగుతామని అన్నారు. మరోవైపు ఈ మట్టి పాత్రల కోసం గతేడాది 10 వేల ఎలక్ట్రిక్ వీల్స్‌ను కుండల తయారీదారులకు అందించామని, ఈ ఏడాది 25 వేల వీల్స్ లక్ష్యం పెట్టుకున్నామని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సంఘం చైర్మన్ వినయ్ కుమార్ సక్సేనా పీటీఐకి తెలిపారు. కుమ్మర స్వశక్తికరణ్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఈ వీల్స్‌ను అందిస్తున్నది. 2004లో తొలిసారి అప్పటి రైల్వే శాఖ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఈ మట్టి గురిగెల్లో టీ పంపిణీకి శ్రీకారం చుట్టారు.

## నీరవ్ మోదీ జీవితంపై పుస్తకం

- ఈ నెల 31న విడుదల

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ జీవితంపై ఓ పుస్తకం వస్తున్నది. 'ఫ్లాడ్: ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ఇండియాస్ డైమండ్ మొగల్ నీరవ్ మోదీ' పేరుతో ఈ నెల 31న పుస్తకం విడుదల కానున్నది. జర్నలిస్టు-రచయిత పవన్ సీ లాల్ దీన్ని రాశారు. 48 ఏండ్ల ఈ పరారీ వజ్రాల వ్యాపారి.. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను రూ.14 వేల కోట్లు ముంచిన విషయం తెలిసిందే. మేనమామ మెహుల్ చోక్సీతో కలిసి నీరవ్ ఈ కుంభకోణానికి పాల్పడగా, గతేడాది జనవరిలోనే కుటుంబ సభ్యులతోసహా దేశం విడిచి పారిపోయిన సంగతీ విదితమే. జాతీయ, అంతర్జాతీయ సెలబ్రిటీలకు ఖరీదైన నగలను అమ్ముతూ ప్రఖ్యాతిగాంచిన నీరవ్ మోదీ.. పీఎన్‌బీ మోసంతో పరువు పోగొట్టుకున్నాడు. దీంతో ఈ పుస్తకంలో నీరవ్ పతాక స్థాయిని, పతనాన్ని రచయిత ఆవిష్కరించనున్నారు.



### నమ్మశక్యం కాని మలుపులు

నీరవ్ వ్యాపార అరంగేట్రం, తొలినాళ్లలో లావాదేవీలు, చోక్సీతో ఆయనకున్న సంబంధాల నుంచి మొదలుపెడితే పీఎన్‌బీ కుంభకోణం, అరెస్టు, బెయిల్ నిరాకరణలదాకా పుస్తకంలో ఉంటుందని ఈ పుస్తక ప్రచురిత సంస్థ హ్యాచెట్ ఓ ప్రకటనలో తెలియజేసింది. నీరవ్ జీవితంలో చోటుచేసుకున్న నమ్మశక్యం కాని మలుపులు, ఎత్తుపల్లాలు ఈ పుస్తకంలో ఉంటాయనడం గమనార్హం. బెల్జియం నుంచి భారత్‌కు వచ్చిన నీరవ్.. తన వజ్రాల నగలతో హాలివుడ్ స్టార్ కేట్ విన్స్‌లెట్, బాలీవుడ్ స్టార్ ప్రియాంకా చోప్రా వంటి వారెందరినో ఆకట్టుకున్నారు. 1.73 బిలియన్ డాలర్ల సంపదతో ఒకప్పుడు ఫోర్బ్స్ భారతీయ కుబేరుల జాబితాలోనూ ఉన్నారు.



ప్రకృతిలో అందమైన సువాసనను వెదజల్లే పూలమొక్కలనుంచి సీతాకోక చిలుకలు మకరం దాన్ని పీల్చుతూ కనువిందు చేస్తున్నాయి. చినుకు పడితే చాలు జీవరాశులకు పులకరింతే. జనగామ శివారులో రంగురంగుల సీతాకోక చిలుకలు పుష్పంపై వాలి మకరందాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యమిది.

-ఫొటో: స్వర్గం చంద్రశేఖర్,నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్,జనగామ.

## రియల్ ఎస్టేట్ రంగంలో అత్యున్నత విలువలు నెలకొల్పుతా

**'నార్' ఇండియా నూతన అధ్యక్షుడు సుమంత్‌రెడ్డి**



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రియల్‌ఎస్టేట్ రంగంలో అత్యున్నత నైతిక విలువలను పాదుకొల్పేందుకు కృషిచేస్తానని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (నార్) ఇండియా నూతన అధ్యక్షుడు సుమంత్‌రెడ్డి ఎరాని తెలిపారు. 'గేమ్ చేంజర్స్' పేరుతో హెచ్‌ఐసీసీలో జరుగుతున్న 'నార్' ఇండియా 11వ సదస్సులో ఆయన నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2008లో ఏర్పడిన నార్ ఇండియాలో 47 నగరాలకు చెందిన 30 వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి శ్రీధర్‌రెడ్డి, విజయ్ సారథి 'నార్' అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించగా.. ఇప్పుడు సుమంత్‌రెడ్డి 12వ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన సదస్సులో మాట్లాడుతూ.. ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు రియల్టర్లు శ్రమిస్తున్నారని, వారి సాధికారత కోసం ఓ సమన్వయ వేదికను ఏర్పాటుచేస్తానన్నారు. దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో 80 శాతం లావాదేవీలు రియల్టర్ల ద్వారానే జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## అంధుడు.. అసామాన్యుడు!

**మారథాన్ రేసుల్లో ఆసిఫ్ దిట్ట.. 21 కి.మీ. పరుగే ఆయన లక్ష్యం**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ఐ యామ్ బ్లైండ్.. బట్ ఐ యామ్ ట్రైన్డ్..' కొద్ది నెలల క్రితం ఓ సినిమాలో అంధుడి పాత్రలో హీరో రవితేజ చెప్పిన డైలాగ్ ఇది. ఇదే మాటను ఇప్పుడు ఓ బహుళజాతి సంస్థలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కోల్‌కతావాసి మహ్మద్ ఆసిఫ్ ఇక్బాల్ చెబుతున్నారు. అంధుడైనప్పటికీ ఎవరి సాయం లేకుండా మారథాన్ రేసును పూర్తిచేయడంలో దిట్టగా పేరుపొందిన ఆసిఫ్ ఇక్బాల్.. 'నార్' ఇండియా సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చి రియల్టర్లకు స్ఫూర్తి మంత్రాన్ని బోధించారు. 16 ఏండ్ల వయసులోనే కంటిచూపు కోల్పోయిన ఆయన.. ఇప్పటికే పలుమార్లు 10 కి.మీ. మారథాన్లను పూర్తిచేశారు. ఈ ఏడాది 21 కి.మీ. మారథాన్‌ను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్టు తెలిపారు. 'ప్రస్తుతం నా వయసు 40 ఏండ్లు. చూపు లేకపోయినప్పటికీ నా లక్ష్యంపై పూర్తి దృష్టితో ఉన్నా. 20 కి.మీ. మారథాన్‌ను విజయవంతంగా పూర్తిచేయగలనన్న నమ్మకమున్నది' అని చెప్పారు. ఆసిఫ్ జీవితం స్ఫూర్తి దాయకమని, ఆయన ప్రసంగం అందరినీ ఆలోచింప చేసిందని 'నార్' నూతన అధ్యక్షుడు సుమంత్‌రెడ్డి ఎరాని ప్రశంసించారు.



# మన అడవులు సురక్షితమేనా?

### తెలంగాణ అడవులపై ఉపగ్రహ నిఘా

- అగ్నిప్రమాదాల నివారణకు ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు
- మానవ తప్పిదాలతో మన అడవుల్లో అగ్నిప్రమాదాలు
- జీపీఎస్‌ను వినియోగించేందుకు ముమ్మర ఏర్పాట్లు
- అమెజాన్ కార్చిచ్చుతో అలర్ట్ ప్రకటించిన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా అడవుల్లో అగ్నిప్రమాదాలు అతి పెద్ద సమస్యగా తయారయ్యాయి. అకస్మాత్తుగా చెలరేగుతున్న మంటలు అత్యంత విలువైన అటవీ సంపదను బుగ్గిపాలు చేయడమే కాకుండా.. పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దక్షిణ అమెరికా బేసిన్‌లోని అత్యంత విశాలమైన అమెజాన్ అడవుల్లో రగిలిన మంటలు కార్చిచ్చుగా మారి పలు దేశాలను గడగడలాడిస్తున్నాయి. కొన్ని రోజులుగా అమెజాన్ అడవిలో కొనసాగుతున్న మంటలు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో మన దేశంలోని అడవులపై ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అలర్ట్ ప్రకటించింది. వాస్తవానికి తెలంగాణతోపాటు మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ఆకురాల్చే అడవులు ఉన్నాయి. చెట్టు, చెట్టుకు మధ్య కొంత అంతరం ఉండటం వల్ల గ్రౌండ్‌ఫైర్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ విధమైన ప్రమాదాలను గుర్తించిన వెంటనే ఆర్పడానికి వీలుంటుంది. అయితే క్రౌన్‌ఫైర్ ప్రమాదాలను నిలువరించాలంటే ఏకంగా హెలికాప్టర్లనే వినియోగించాల్సి ఉంటుంది. తెలంగాణతోపాటు మన దేశంలోని చాలా అడవులు విదేశాల్లో కన్నా కొంత సురక్షితమేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ ఇటీవలి కాలంలో మానవ ప్రమేయాలు, తప్పిదాల వల్ల అగ్ని ప్రమాదాలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

**గ్రౌండ్‌ఫైర్ తప్పిదాలే ఎక్కువ**

అడవుల్లో అగ్నిప్రమాదాలు గ్రౌండ్‌ఫైర్, క్రౌన్ ఫైర్ అనే రకాలుగా ఉంటాయి. ఎక్కువగా జరిగే గ్రౌండ్‌ఫైర్ ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. పశువుల కాపరులు బీడీ, చుట్ట కాల్చి పడేయటం వల్ల ఎండిపోయిన ఆకులకు అంటుకొని మంటలు ఎగిసిపడటం ఒక కారణమైతే.. తునికాకు టెండర్లు దక్కించుకొన్న కొందరు కాంట్రాక్టర్లు పెద్ద సైజులో నాణ్యమైన తునికాకు రావడానికి గ్రౌండ్‌ఫైర్‌కు పాల్పడుతుంటారు. అడవుల మీదుగా వెళ్లే పర్యాటకులు, స్థానికులు వంట తయారీకోసం మంటలు రాజేసి ఆర్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. మన రాష్ట్రంలో చాలా అరుదుగా చెట్ల కొమ్మలు రాజుకొని క్రౌన్‌ఫైర్ చెలరేగడం చూడొచ్చు.

### ప్రత్యేక బృందాలతో ప్రమాదాల నివారణ

వాస్తవానికి రాష్ట్రంలో జనవరి నుంచి జూన్ వరకు అడవుల్లో తరుచూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకొంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు తెలంగాణ అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ)తో కలిసి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్తున్నది. ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొంటున్నారు. 2019 సంవత్సరాన్ని రాష్ట్ర అటవీశాఖ 'ఫ్రీ ఫైర్ ఇయర్'గా ప్రకటించింది. అడవుల రక్షణకు దాదాపు 2,500 మందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)ను పూర్తిస్థాయిలో వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు చేసింది. ఎన్‌ఆర్‌ఎస్‌ఏ సహకారంతో అటవీ సిబ్బందికి సాంకేతిక పరమైన శిక్షణ ఇస్తున్నారు. ఎండాకాలంలో ఎక్కువగా ఆకస్మిక మంటలు రగులుకొనే అవకాశాలు ఉంటాయి. రకరకాల కారణాలతో లక్షల ఎకరాల్లో అడవులు అగ్నికి ఆహుతవుతుంటాయి. ఫలితంగా అపారమైన వనసంపద బుగ్గిపాలవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2004 నుంచి దాదాపు 14 వేల అటవీ అగ్నిప్రమాదాలు సంభవించినట్టు రికార్డులు చెప్తున్నాయి. జీపీఎస్ ద్వారా అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించి వెంటనే మంటలు ఆర్పేందుకు అటవీశాఖ చర్యలు తీసుకొంటున్నది. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో అగ్నిప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఘటనాస్థలానికి చేరుకుని ప్రత్యేక బృందాలు మంటలు ఆర్పగలిగారు.



## మంత్రి కొప్పులతో ఎంపీ నామా భేటీ

- ఉమ్మడి ఖమ్మం జిల్లా సంక్షేమంపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామానాగేశ్వర్‌రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, మధిర నియోజకవర్గాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగ సంక్షేమ పథకాల అమలుపై ఎంపీ చర్చించారు. అత్యధికశాతం ఉన్న గిరిజన, ఆదివాసీలకు భారీగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గురుకులాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ల నిధులు విడుదలచేయాలని మంత్రిని కోరారు. మధిర గురుకులంలో విద్యాబోధన చాలా బాగుందని, అశ్వారావుపేట మైనార్టీ గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ నిధుల నుంచి రూ.లక్ష కేటాయిస్తానని నామా పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత పాల్గొన్నారు.

## సృజనాత్మకతను చాటేందుకు విద్యార్థులకు పోటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యార్థులు సృజనాత్మక శక్తిని చాటేందుకు జేసీఐ సంస్థ నిర్వహిస్తున్న పోటీని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) కోరింది. సామాజిక సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యంతో ఇన్వాల్వ్ టు ఎవాల్వ్ పేరుతో జేసీఐ సంస్థ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రాండ్ ఫైనల్ డిసెంబర్ 22న నిర్వహించనున్నారు. వివరాలకు 9652252558లో సంప్రదించాలని టీఎస్‌ఐసీ ట్వీట్టర్‌లో కోరింది.

## ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

**ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు వినతి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి, వినతిపత్రం సమర్పించారు. వినోద్‌కుమార్‌ను కలిసినవారిలో సంఘం అధ్యక్షుడు యదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి సాదుల మధుసూదన్, హైదరాబాద్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇన్నారెడ్డి తదితరులున్నారు.

**సంగీత దర్శకులు, గాయకుల అభినందనలు**

తెలంగాణ సినీ సంగీత దర్శకులు, గాయకులు వినోద్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. సినీ కళాకారుల సమస్యలను పరిష్కరించాలని,ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.



సమాచారశాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రమణాచారి

## సమాచారశాఖది కీలకపాత్ర

**ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాచార, ప్రజాసంబంధాల శాఖ ప్రభుత్వానికి కళ్లు, చెవులుగా పనిచేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. సర్కారు కార్యక్రమాలను వివిధ సాధనాల ద్వారా ప్రచారం చేయడంలో ఈ శాఖ కీలకపాత్ర పోషిస్తున్నదని చెప్పారు. సమాచార, ప్రజాసంబంధాలశాఖలో పదవీ విరమణ ఉద్యోగుల కోసం ఆదివారం హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో రమణాచారి మాట్లాడుతూ.. ఈశాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కష్టపడి పనిచేయాలని కోరారు. సమాచార, ప్రజాసంబంధాల శాఖ మాజీ కమిషనర్ ఎంవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ శాఖ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. శాఖలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరి సమాచారాన్ని కలిపి రూపొందించిన పుస్తకాన్ని రమణాచారి విడుదలచేశారు.



నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 26 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## రోజూ యోగా చేస్తున్నారా?



మానసిక ఒత్తిడితో రకరకాల జబ్బులు సునాయాసంగా శరీరం లోకి చేరుకుంటాయి. దీంతో లేని పోని ఇబ్బందులు తలెత్తుతుం టాయి. రోజుకు అరగంట పాటు యోగా చేయడం వల్ల వీటన్నింటినీ తరిమికొట్టవచ్చు. యోగాతో కలిగే ప్రయోజనాలేంటో చూద్దాం.

- యోగా ఎలా చేయాలంటే.. కూర్చుని కళ్ళు మూసుకొని, చెవులను చూపుడు వేళ్ళతో మూసుకొని గాలిని గట్టిగా లోపలికి పీల్చుకోవాలి. గాలిని బయటకు వదిలేటప్పుడు గొంతు నుంచి తుమ్మెద ఎగిరేటప్పుడు వచ్చే శబ్దం రావాలి. ఇలా రోజుకు ఐదుసార్లు చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.
- యోగా అనేది క్రమశిక్షణను అమలు చేస్తుంది. మనస్సును నిగ్రహించుకుంటూ ఆధ్యాత్మిక భావనను నిద్రలేపే ప్రయత్నమిది.
- క్రమంగా యోగా చేయడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. తద్వారా మెదడు కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంటుంది.
- భ్రమరి ఆసనం క్రమం తప్పకుండా చేస్తే జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు.
- శరీరానికి తగిన వ్యాయామం లేకపోతే కొన్ని కండరాలు మాత్రమే పనిచేస్తాయి. మరికొన్ని కండరాలు రక్తప్రసరణ జరుగక చచ్చుబడి పోవడమే కాకుండా శరీరంలో అనేక రోగాలు తిష్ట వేస్తాయి.
- కంప్యూటర్ దగ్గర పనిచేసేవారు, లెక్కలు రాసేవారు, పుస్తకాలు చదివేవారందరూ ఎక్కువగా మెడనొప్పితో బాధపడుతుంటారు. ఇలాంటి వారు రాత్రి భోజనానికి ముందుగా మకరాసనం వేయడం మంచిది.

# గృహావసరాలు తీరుస్తానంటున్న దేవదత్తా ఉపాధ్యాయ

సక్సెస్ మంత్ర



**ఆమె జర్నలిస్ట్‌గా రాణించాలనుకుంది. మీడియాలోనే సేల్స్ రంగంలో కాలుమోపాల్సి వచ్చింది. ఆ తర్వాత అనేక సంస్థల్లో ఉద్యోగాలు చేశారు. కానీ అవేవీ తనకు సంతృప్తినివ్వలేదు. తనకంటూ సొంతంగా ఏదైనా ప్రారంభించాలనుకుంది. కుదరలేదు. పెండ్లి, ఉద్యోగం, గృహిణిగా, తల్లిగా ఇలా అనేక బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. అన్ని పాత్రల్ని సమన్వయం చేసుకోలేక సతమతమయ్యేది. సమయాన్ని ఎలా మేనేజ్ చేయాలో అర్థం కాక తలపట్టుకునేది.ఆ ఆలోచన నుండి ఉద్భవించింది భారతీయ మహిళల గృహావసరాలు తీర్చే మార్కెట్ 'టైమ్‌సేవర్స్' తొలి మొబైల్ మార్కెట్. తనదైన మార్గంలో పయనిస్తూ గృహిణులూ, తల్లులూ, ఉద్యోగ నిపుణులకు సేవలందిస్తున్న సంస్థ సి.ఇ.ఓ., సహవ్యవస్థాపకురాలు దేవదత్తా ఉపాధ్యాయ సక్సెస్‌మంత్ర.**

తను అనుభవించిన కష్టాలు సాధారణంగా అందరు మహిళలకూ వచ్చేవే. అలాంటి వారి గృహావసరాలు తీర్చేందుకు ఉపక్రమించారు దేవదత్తా. దానికోసం ఓ సంస్థను స్థాపించారు. తనదైన మార్గంలో పయనిస్తూ గృహిణులూ, తల్లులూ, ఉద్యోగ నిపుణులకు సేవలందిస్తున్నారు. భారతీయ గృహావసరాలు తీర్చే ఓ విశిష్టమైన మొబైల్-ఫస్ట్ విపణి టైమ్ సేవర్స్. 'జీవితాన్ని మీరెలా కావాలంటే అలా మలచుకోవచ్చు. మనలో ప్రతిఒక్కరికీ ఓ ఎంపిక ఉంటుంది. మీరు ఎంపిక చేసుకున్నదాన్నిబట్టి సులువైన అంశమో, కష్టమైన అంశమో దాన్నుంచి ఉత్పన్నమవుతుందని అంటారామె.

### తొలి పరిచయం

ఒడిశాలో ఉక్కునగరమైన రూర్కెలాలో దేవ్ జన్మించారు. ఆమె తండ్రి ఓ హెచ్ ఆర్ నిపుణుడు. తల్లి విద్యా వేత్త. ఆమె బాల్యమంతా అక్కడే గడిచింది. ఆ తర్వాత, తొంభయ్యవ దశకం చివర్లో చత్తీస్‌గడ్‌లోని బిలాయ్‌కి ఆమె కుటుంబం తరలిపోయింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత, ఆమె నాగపూర్‌కు వెళ్ళారు. అక్కడే ఆమె వృత్తిపరమైన ప్రయాణం ఆరంభమయింది. జర్నలిజం విద్యార్థిని అయిన దేవ్ తన వివాహం తర్వాత, మీడియా సేల్స్ రంగంలోకి ప్రవేశించారు.

### ఉద్యోగ పర్వం

దేవదత్త (దేవ్) చదువుకుంటున్న సమయంలోనే తను ఏదో ఒకటి సాధించాలనే తాపత్రయంతో ఉండేవారు. దానికోసం అనేక రకాలుగా ప్రయత్నించేవారు. అలా తన సకల ప్రయత్నాలను, ప్రేరణనీ విజయం దిశగా మళ్ళించుకున్నారు. సాహిత్యంలో పటిష్టమైన విద్యా నేపథ్యం ఉన్న ఆమె పాత్రికేయురాలు కావాలని ఎల్లప్పుడూ కోరుకునేవారు. తన కలలను సాఫల్యం చేసుకోవడం కోసం నాగపూర్‌లోని 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆమె కోరుకున్నట్లు తనకు జర్నలిస్ట్‌గా అవకాశం రాలేదు. సేల్స్ విభాగంలో చేరాల్సి వచ్చింది. అలా అని ఏ మాత్రం నిరాశ చెందకుండా మీడియా-సేల్స్ విభాగంలో ఓ బాధ్యతగల ఎగ్జిక్యూటివ్‌గా తన వృత్తి జీవితాన్ని ఆరంభించారు. ఆ తరువాత, అప్పుడే ఆరంభమైన సంస్థలు మొదలు ఫార్చ్యూన్ 500 వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలెన్నింటిలోనో పనిచేశారు. ది టైమ్స్ ఆఫ్ ఇండియా, యాహూ! ఇండియా, వీడోపియా ఇంక్.లాంటి అగ్రశ్రేణి సంస్థలకు ఆమె సేవలందించి అనుభవం గడించారు.

### అనుభవం నేర్పిన వ్యాపారం

తను ఉద్యోగం చేస్తున్నప్పటికీ సొంతంగా ఏదైనా చేయాలనే కోరిక ఆమెను ఎల్లప్పుడూ వెన్నాడేది. ఎలాంటి వ్యాపారం చేయాలనే ఒక నిర్ణయానికి అంత త్వరగా రాలేదు. వ్యక్తిగతమైన అనుభవమే తన వ్యాపారరంగంలోకి అడుగుపెట్టడానికి అంకురార్పణ అయింది. 2012లోకి వెళ్తే ఉద్యోగినిగా వ్యక్తిగతమైన, వృత్తిపరమైన జీవితం మధ్య దేవ్ సతమతమైపోయేవారు. గృహిణిగా, ఓ తల్లిగా, ఓ వృత్తి నిపుణురాలిగా తన పాత్రల్ని సమన్వయం చేసుకోవడం ఆమెకు ఎల్లప్పుడూ కష్టమైపోతూ ఉండేది. వేగంగా పరిగెడుతున్న నగరజీవనంలో, అండగా నిలిచే ఎలాంటి వ్యవస్థా లేకుండా, ఓ చిన్న కుటుంబంలో శిశువుకు తల్లిగా ఉండడం చాలా ఇబ్బందిగా ఉండేది. రోజువారీ పనులూ, కార్యకలాపాలకు అందుబాటులో సాయం చేసేవారు లేకపోవడం తనలాంటి ఎందరికో సవాలు. ఈ సమస్యకు పరిష్కారం వెతుకుతున్నప్పుడు, ఎల్లప్పుడూ విస్తరణకు అవకాశం ఉన్న రంగం సేవల రంగమని గుర్తించింది. అలా దేవ్ ఆమె సహవ్యవస్థాపకులు కలిసి టైమ్‌సేవర్స్ గురించి ఆలోచించారు. అలా వారి మానసపుత్రిక అయిన ఈ సంస్థ ఇప్పుడు ఓ సాకారమైన వ్యాపారంగా ఆవిర్భవించింది.



### టైమ్‌సేవర్స్ గురించి ...

గృహ సేవా అవసరాలన్నిటికీ పరిష్కారం చూపించే ఏకైక గమ్యం టైమ్‌సేవర్స్. ధ్రువీకరణ పొందిన హోం సర్వీస్ ప్రొవైడర్లను పరిశీలించి, పర్యవేక్షించిన తర్వాత కస్టమర్లకు ఇది అనుసంధానం చేస్తుంది. ఈ సేవల్లో ఎక్కువశాతం గృహ నిర్వహణ, వన్-టైమ్ సేవలు లాంటివి ఉంటాయి. ఇది ఈ సంస్థ అందిస్తున్న సేవల్లో ఒక కోణం మాత్రమే. అసంఘటితంగా ఉన్న హోం సర్వీస్ ప్రొవైడర్లను మరింత సంఘటిత పరిచేందుకు ఇది తోడ్పడుతున్నది. తద్వారా వారి జీవన ప్రమాణం మెరుగయ్యేందుకు దోహదం చేస్తున్నది. ప్రస్తుతం, ముంబాయి, పుణే నగరాల్లో 500కు పైగా సర్వీస్ ప్రొవైడర్లకు ఈ కంపెనీ చేరువైంది. వారికి తగినంత గౌరవం, హుందాతనం కల్పిస్తున్నది. ప్రస్తుతం ఈ సంస్థ గృహ సేవా అవసరాల్లో దాదాపు 70 నుంచి 75 శాతం వరకూ తీరుస్తున్నది.

### కుటుంబానికి పెద్దపీట

ఉద్యోగ సమయంలో ఏదైనా సాధించాలనే దృక్పథంతో ప్రారంభించిన టైమ్‌సేవర్ ఇప్పుడు విజయవంతంగా నడుస్తుండడంతో తన కుమారుడు పెరుగుతున్న దశలో అతనికి ఎక్కువ సంరక్షణ, మద్దతు, మార్గదర్శకత్వం అవసరం కాబట్టి తన కుమారుడితో గరిష్టంగా కాలం గడపడానికే ఆసక్తి చూపుతున్నానని దేవాదత్తా అంటారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తన ప్రయాణాన్ని నిర్దేశించుకున్న ఆమె ఇప్పుడు తన బిడ్డకు పూర్తికాలం ఆలనాపాలనా చూస్తున్న తల్లి కూడా.

### భవిష్యత్ ప్రణాళిక

బాలల విద్యారంగంలో ఏదైనా చేయడం నాకు చాలా ఇష్టమైన విషయం అన్నారు దేవ్. నిజమే మరి, ఆమె సాధించిన అభివృద్ధికి మూలాలన్నీ పటిష్ఠమైన విద్యా వ్యవస్థమీదే ఆధారపడి ఉన్నాయి. అత్యుత్తమ విద్యను పొందేలా ప్రతిఒక్కరినీ ప్రోత్సహించడం చాలా ముఖ్యమన్నది ఆమె విశ్వాసం.

> ఒక సంస్థను నిర్వహించడంలో ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్తకూ ఒకే రకమైన కష్టాలూ, సాఫల్యాలూ, విజయాలూ వస్తాయి. దేవ్ నమ్ముతారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఆధారపడడాన్ని సిగ్గు పడే విషయం అనుకుని దూరంగా ఉండిపోకూడదనీ, ఒంటరిగా ఉండడం కన్నా కలిసికట్టుగా ఉన్నట్టయితే మరిన్ని ఎక్కువ సమస్యలను వారు పరిష్కరించుకోగలరనీ ఆమె సూచిస్తున్నారు.



## ఆ నర్సులు డెలివరీ అయ్యారు!

**గతేడాది ఒకే ఆస్పత్రికి చెందిన 9మంది నర్సులు గర్భవతులైన విషయం వైరల్ అయింది, గుర్తుందా? ఇప్పుడా నర్సులంతా ప్రసవించారు. 3 రోజుల నుంచి 3 నెలల వ్యవధి ఉన్న వారి పిల్లలు వారి తల్లుల ఫొటోలు ప్రస్తుతం నెట్టింట మళ్లీ వైరల్ అవుతున్నది.**



అమెరికా పోలాండ్‌లోని మైనే మెడికల్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆ తొమ్మిది మంది నర్సులు ప్రసవించారు. గత మార్చి నెలలో తామంతా ఒకేసారి గర్భం దాల్చామంటూ పెట్టిన ఫేస్‌బుక్ పోస్టు వైరలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా ప్రసవానంతరం బిడ్డలతో సహా దిగిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా వారిలో ఒకరైన నర్సు ఎరిన్ గ్రెనియర్ మాట్లాడుతూ.. 'ఒకరి తర్వాత ఒకరం గర్భవతి అయినట్లు చెప్పుకోవడం చాలా కొత్తగా అనిపించింది. బేబీ బంప్ (కడుపు)తో ఒకరినొకరు చూసుకోవడం సంతోషమేసింది. మేం ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం ద్వారా ఏప్రిల్ నుంచి జూలై మధ్య నెలలో 9 మంది బిడ్డలకు జన్మనిచ్చాం' అని తెలిపింది. తొమ్మిది మంది నర్సులు బిడ్డలకు జన్మనివ్వడంతో మైనే హాస్పిటల్ యాజమాన్యం మరో ఫొటోను పోస్టు చేసింది. ఇందులో 9 మంది నర్సులు తమ బిడ్డలను అందంగా ముస్తాబు చేసి, చిరునవ్వులు చిందించడాన్ని చూడవచ్చు. ఆ బిడ్డల వయస్సు 3 రోజులు నుంచి 3 నెలలు ఉంటుందని హాస్పిటల్ యాజమాన్యం వెల్లడించింది.

## సంపూర్ణ చర్మసంరక్షణ కావాలా?

**గతంలో పసుపు, చందనం, పాలతో స్నానం చేయించేవారు. వాటిని ఇప్పుడు పాత పద్ధతులంటున్నారు. కానీ అవే ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్‌గా మారాయి. సంపూర్ణ చర్మ సంరక్షణ కావాలంటే ఉపయోగించే ఉత్పత్తుల్లో ఇవి తప్పకుండా ఉండాలి.**



- **పసుపు :** చర్మం మీది మచ్చలను తొలిగించి ముఖం ప్రకాశవంతంగా కన్పించేలా చేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా చేస్తుంది. అన్నింటికీ మించి మొటిమల నివారణకు పసుపును మించిన ఔషధం లేదు.
- **చందనం :** క్రమం తప్పకుండా చందనం ఉపయోగించడం వల్ల చర్మానికి చాలా ఉపయోగాలున్నాయి. ముఖ్యంగా చందనం బ్యాక్టీరియాను రాకుండా చేసి చర్మాన్ని ప్రకాశింపజేస్తుంది. ట్యాన్‌ను అరికడుతుంది. చర్మం పొడిబారకుండా, ముడుతలు కన్పించకుండా చేస్తుంది.
- **కుంకుమ పువ్వు :** దీనిలో యాంటీ ఆక్సిడెంట్స్, చర్మానికి కావాల్సిన విటమిన్లు ఉన్నాయి. దీనివల్ల చర్మం పొడిబారకుండా స్వచ్ఛంగా, మృదువుగా తయారవుతుంది.
- **కలబంద :** దీన్నే అలోవెరా అని కూడా అంటారు. ఇది చర్మంపై పొరలా ఉపయోగపడుతుంది. ఈ లేయర్ వల్ల చర్మంపై ఎప్పుడూ తేమ ఉంటుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.
- **బాదం పాలు :** ఎండ వేడికి చర్మం కమిలిపోతుంది. అంతేకాకుండా చేతులపై ట్యాన్ ఏర్పడుతుంది. రోజూ బాదం పాలు తాగితే సూర్యుడి నుంచి చర్మాన్ని రక్షించుకోవచ్చు.

## అదృష్టం అంటే ఇదే!

**దేనికోసమైతే వెతుకుతున్నామో అదే దొరికితే? అదృష్టం తన్నుకొచ్చిందంటారు. ఊహించని అదృష్టం వచ్చినప్పుడు నక్కతోక తొక్కారని కూడా అంటుంటాం. అచ్చం అలాగే జరిగింది గ్రీస్ దేశానికి చెందిన ఓ మహిళకు.**



అమందా హోలింగ్స్‌హెడ్‌ది గ్రీస్ దేశంలోని అర్కాన్సస్ నగరం. ఈమెకు బయటకు వెళ్లడం కానీ, పార్కుల్లో తిరగడం కానీ ఇష్టం ఉండదు. కానీ అర్కాన్సస్ నగరంలో ఓ పార్క్ ఉంది. అది వజ్రాల పార్క్. ఆ పార్క్‌లో ఎప్పుడూ కొందరు వజ్రాల కోసం వెతుకుతూ ఉంటారు. ఓ రోజు అమందా కూడా బంధువులు బలవంతం చేస్తే వారితో వెళ్లింది. పిల్లలను సరదాగా తీసుకెళ్దామనేది ఆమె ఉద్దేశం. అందరూ వజ్రాల కోసం వెతకడం ప్రారంభించారు. కానీ అమందా మాత్రం పిల్లల్ని పట్టుకొని పార్క్‌లో తిరుగుతున్నది. అప్పుడు తనకు కూడా వజ్రాలను వెతకాలని అనిపించింది. 'వజ్రాలను ఎల వెతకాలి' అని యూట్యూబ్‌లో వీడియో చూడడం ప్రారంభించింది. పార్క్‌లోని ఓ బెంచీ మీద కూర్చొని ఈ వీడియో చూస్తున్న క్రమంలోనే ఆమె కాళ్ల దగ్గర రాళ్లలో ఏదో మెరిసినట్టు అనిపించింది. తీరా దాన్ని తీసుకొని పరిశీలిస్తే అది ఎల్లో డైమండ్. 3.72 కారెట్ల బరువుంది. ఇంకేముంది.. అమందా అదృష్టం అలా తిరిగింది. ఏడాది కాలంలో ఆ పార్క్‌లో దొరికిన అతిపెద్ద ఎల్లో డైమండ్ ఇదొక్కటే కావడం ఇక్కడ విశేషం. అయితే ఈ డైమండ్‌ని అమ్మాలా? లేదా తన దగ్గరే ఉంచుకోవాలా అని అమందా ఆలోచిస్తున్నదట.

## వంటింటి చిట్కాలు



- పాలు విరిగిపోతాయనుకుంటే.. కాచేటప్పుడు అందులో కొద్దిగా వంటసోడా వేస్తే సరిపోతుంది.
- నెయ్యి కాచి దించేముందు దానిలో కొన్ని మెంతులు, తమలపాకు వేస్తే సువాసనగా ఉంటుంది. అలానే నెయ్యి ఎక్కువకాలం పాటు నిల్వ ఉంటుంది.
- క్యాబేజీ, కాలీఫ్లవర్ ఉడికించేటప్పుడు వాసన వస్తాయి. ఆ వాసన రాకుండా ఉండాలంటే బ్రెడ్ ముక్క గానీ చక్కెర వేస్తే సరి.
- పనీర్‌ను బ్లాటింగ్ పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది. దీన్ని 15 రోజుల వరకు వాడుకోవచ్చు.
- తేనె నిల్వ ఉండేందుకు శుభ్రమైన సీసాలో పోసి రెండు లవంగాలను అందులో వేసి ఉంచాలి.
- బెల్లాన్ని నీటిలో కరిగించి ఆపై వడగట్టి పాకం పడితే ఇసుక రాకుండా ఉంటుంది.

## సంతానసాఫల్య చికిత్సలున్నాయా?

అడగండి చెబుతా



**మా అక్క వయసు 33 సంవత్సరాలు. ఆమెకు పెండ్లయి పన్నెండేండ్లు అవుతుంది. ఆమె తర్వాత ఏడేండ్లకు నా పెండ్లి అయింది. నాకు ఒక బాబు.. ఒక పాప. కానీ.. మా అక్కకు మాత్రం ఇంకా పిల్లలు కాలేదు. చాలాచోట్ల ప్రయత్నించింది. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఇటీవల మా చెల్లె కూడా కన్సివ్ అయ్యింది. బయటకు బాగానే కనిపిస్తుంది కానీ.. లోపల మా అక్క చాలా బాధపడుతున్నది. పన్నెండేండ్ల తర్వాత పిల్లలు పుట్టరు అనేది మావాళ్లు అందరూ అనుకుంటున్నారు. ఆమెకు సంతానప్రాప్తి ఎలా? ఎలాంటి చికిత్సలు ఉన్నాయి? దయచేసి తెలుపగలరు.**

**– మానస, వికారాబాద్**

మీ సోదరికి పిల్లలు కలుగకపోవడానికి కారణం ఏంటి అనేది ముందుగా తెలుసుకోవాలి. 33 సంవత్సరాలు అంటున్నారు కాబట్టి సంతానం కోసం ప్రయత్నించవచ్చు. 35 సంవత్సరాలు దాటితే కొంచెం కష్టం. కారణం ఏంటని తెలుసుకుంటే సమస్య లోపం ఎక్కడుందో చెప్పవచ్చు. పిల్లలు కలుగలేదనే బాధ ఎవరికైనా ఉంటుంది. కాబట్టి ఆమె బాధను అర్థం చేసుకోవచ్చు. అయితే అదే పనిగా ఎప్పుడూ ఆలోచిస్తే ఒత్తిడి పెరుగుతుంది. సంతాన సమస్యలకు ఒత్తిడి కూడా కారణం అని గుర్తించాలి. భార్యాభర్తలిద్దరూ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ప్రస్తుత జీవనశైలి వల్ల పురుషుల్లో స్పెర్మ్‌కౌంట్ తక్కువగా ఉంటుంది. మంచి పోషకాహారం.. వ్యాయామం పాటిస్తే ఆశించిన స్థాయిలో కౌంటింగ్ ఉంటుంది. కాబట్టి ఇద్దర్నీ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్‌ను కలవమని చెప్పండి. కౌన్సెలింగ్ వల్ల ఎలాంటి ట్రీట్‌మెంట్ తీసుకోవాలో తెలుస్తుంది.

**డాక్టర్ శిల్పారెడ్డి**
ఐవీఎఫ్ నిపుణురాలు
ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్
హైదరాబాద్



నమస్తే తెలంగాణ
# నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 26 ఆగస్టు 2019

దేశంలో UPSC తర్వాత ఒక క్రమపద్ధతిలో ప్రతీ సంవత్సరం ఉద్యోగ నియామకాలు చేపట్టే పరీక్షల్లో SSC-JE ఒకటి. అతి చిన్నవయస్సులో కేంద్రప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలనుకునే టెక్నికల్ విద్యార్థులకు ఇది ఒక సువర్ణావకాశం.



# SSC-JE ఇలా కండి ఇంజినీర్

SSC-JE పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుంది.

## మొదటి పేపర్

Computer Based Objective Type
ఈ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది.

- ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. అవి
  1) జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ 50 ప్రశ్నలు- 50 మార్కులు
  2) జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు
  3) జనరల్ ఇంజినీరింగ్ 100 ప్రశ్నలు-100 మార్కులు
- పరీక్ష ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది.
- పేపర్-Iలో ఒక్కో తప్పు సమాధానానికి 1/4 మార్కులు కోత విధిస్తారు.
- పేపర్-Iలో ఉన్న 200 ప్రశ్నలకు ఇచ్చే సమయం 120 నిమిషాలు మాత్రమే. ఈ విషయాన్ని అభ్యర్థులు దృష్టిలో ఉంచుకుని ప్రిపరేషన్ విధానాన్ని ప్రణాళికాబద్ధంగా, కాన్సెప్టువల్ లెర్నింగ్, సరైన మార్గదర్శకత్వంలో Computer Based Exams బాగా సాధన చేయాలి.
- పేపర్-Iలో వచ్చిన Normalised Marks ఆధారంగా పేపర్-2 పరీక్షకు అర్హత కల్పిస్తారు.
- పేపర్-Iలో మొదటి 50 ప్రశ్నలు జనరల్ ఇంటెలిజెన్స్ రీజనింగ్‌కు సంబంధించినవి ఉంటాయి. ఈ ప్రశ్నలు అభ్యర్థి Logical thinking, Problem soluing skills, Mental ability, Visual skillsను పరీక్షించేలా ఉంటాయి.
- ఈ విభాగంలో నంబర్ సిరీస్, Add one out, Directio, & Distance, Statement& Conclusions, Blood relations, Paper folding మొదలైన వాటినుంచి ప్రశ్నలు అడుగుతారు.
- తరువాత 50 ప్రశ్నలు జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించినవి ఉంటాయి. ఇవి అభ్యర్థి అవగాహన శక్తిని, ప్రస్తుత ప్రపంచం, దేశంలో జరుగుతున్న సంఘటనలపై గ్రహణశక్తిని పరీక్షించే విధంగా ఉంటుంది. ఈ విభాగంలో హిస్టరీ, జాగ్రఫి, పాలిటీ, ఎకనామిక్స్, ఫిజికల్‌సైన్స్, కంప్యూటర్స్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ మొదలైన వాటిపై ప్రశ్నలు ఉంటాయి.
- ఉద్యోగం సాధించాలనుకునే అభ్యర్థులకు ఈ వంద మార్కులు కీలకం.
- టెక్నికల్ విద్యార్థులు వీటిని రెగ్యులర్‌గా Academicsలో చదవక పోవడం వలన కష్టంగా భావిస్తారు. కాని ఒక ప్రణాళికాబద్ధంగా, సరైన మార్గదర్శకత్వంలో నిరంతరాయంగా పరీక్ష వరకు ప్రాక్టీస్ చేస్తే సులువుగా మార్కులు సాధించవచ్చు.
- ఆఖరి వంద మార్కులు విద్యార్థి ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.
- ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులకు వంద మార్కుల జనరల్ ఇంజినీరింగ్ ప్రశ్నలు.
- Bacis Electricity
- Magnetic circuit
- AC fundamentals
- Measuring Instrument
- Machines
- Power Systems
- Estimation & costing
- Utiligation
- Basic electronics సబ్జెక్టుల నుంచి అడుగుతారు. వీటిలో Machines& Power Systems నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- చాలా మంది ఎలక్ట్రికల్ విద్యార్థులు ఎలాక్ట్రానిక్స్‌ను తమ సబ్జెక్టుగా భావించకుండా విడిచి పెడతారు. సరైన పద్ధతిలో ప్రిపేర్ అయితే సులభంగా మార్కులు సాధించవచ్చు.
- Basic Engineeringలో అడిగే ప్రశ్నలు సరాసరి E CET- levelలో ఉంటాయి.

**ఉదాహరణ:**

Q. Form Factor of an alternating wave is
a) Average value / Rms value
b) Rms value / Average value
c) Rms value / Average value
d) Rms value / average value
Ans: C

### సివిల్ ఇంజినీరింగ్

- వంద మార్కుల జనరల్ ఇంజినీరింగ్ ప్రశ్నలు.
- Building materials
- Surveying
- Soil mechanics
- Hydraulics

**ముఖ్యమైన తేదీలు**

**ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రారంభం:** 13.08.2019
**చివరితేదీ:** 12.09.2019
మరిన్ని వివరాలకు http://ssc.nic.in website చూడవచ్చు.
SSC-JE పరీక్షకు Diploma (civil, mechanical, electrical), Engineering (civil, mechanical, electrical) పట్టభద్రులు అర్హులు.
SSC-JE ద్వారా నియమించే కొన్ని ఉద్యోగాలకు Diploma విద్యార్థులు ఉద్యోగ అనుభవం కలిగి ఉండాలి.

- Irrigation
- Transportation
- Environmental Engineering
- Structural Engg( Tos, Rcc, Steel)
- Estimating, Costing& Valuation సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- వీటిలో Building materials, Structural engg, soil mechanics నుంచి ఎక్కువ మార్కులు వస్తున్నాయి.

### మెకానికల్ ఇంజినీరింగ్

- ఇందులో జనరల్ ఇంజినీరింగ్ నుంచి 100 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- థియరీ ఆఫ్ మెషిన్స్, మెషిన్ డిజైన్, ఇంజినీరింగ్ మెకానిక్స్, స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, థర్మో డైనమిక్స్, పవర్ ప్లాంట్స్, రిఫ్రిజిరేషన్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ప్రొడక్షన్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

**ఉదా:**

- The crushing strength of a first class Brick is? (3)
  1) 3 $N/mm^2$
  2) 5.5 $N/mm^2$
  3) 10.5 $N/mm^2$
  4) 7.5 $N/mm^2$

## రెండో పేపర్

### ఎలక్ట్రికల్

1. Explain different types of distribution systems with neat sketch
2. A Dc machine induces an emf of 240V at 1500 rpm. Find the developed torque. For an armature current of 25A.

**Mechanical**

**1. Define the following.**
i. Reversible and Irreversible process.
ii. External and internal irreveribility.
iii. Intensive and Extensive properties.

**2. Give the comparision between ottocycle, Diesel cycle and dual cycle.**

**Civil**

1. What are the requirements of a good ballast in railway engineering, explain how the minimum depth of ballast cushion is estimated.
2. Describe plate load test as per Is 1888, Discuss the limitations, what are the effects of size of plate on bearing capacity and settlement?

- Descriptive paperలో మంచి మార్కులు సాధించాలంటే ఇంగ్లిష్‌పై పట్టు ఉండాలి. క్యాలిక్యులేటర్, స్టీమ్ టేబుల్స్ ఉపయోగించడం రావాలి.



### చదవాల్సిన పుస్తకాలు

- ఏ మోడ్రన్ అప్రోచ్ టు వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్- ఆర్ఎస్ అగర్వాల్
- లూసెంట్ జనరల్ నాలెడ్జ్
- మనోరమా ఇయర్‌బుక్

### సివిల్ ఇంజినీరింగ్

1. సివిల్ ఇంజినీరింగ్ ఆబ్జెక్టివ్- గుప్తా అండ్ గుప్తా
2. సివిల్ ఇంజినీరింగ్ ఆబ్జెక్టివ్- ఎస్ చాంద్
3. ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెకానిక్స్- ఆర్‌కే బన్సాల్
4. స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్- రామామృతం
5. సాయిల్ మెకానిక్స్ అండ్ జియో టెక్నికల్ ఇంజినీరింగ్- డీపీ పున్యా
6. స్టీల్ స్ట్రక్చర్స్- ఎస్‌కే దుగ్గల్

### మెకానికల్ ఇంజినీరింగ్

- మెకానికల్ ఆబ్జెక్టివ్- ఆర్ఎస్ కుమ్రిత్, జేకే గుప్తా
- మెకానికల్ ఆబ్జెక్టివ్- డీఎస్ కుమార్
- మెకానికల్ ఆబ్జెక్టివ్- ఆర్‌కే జైన్

### ఎలక్ట్రికల్

- ఎలక్ట్రికల్ టెక్నాలజీ- BL Thereja
- ఆబ్జెక్టివ్ ఆఫ్ ఎలక్ట్రికల్ టెక్నాలజీ- వీకే మెహతా
- ఏబీసీ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్- బీఎల్ థెరేజా (పేపర్-2)



## పేపర్-2 డిస్క్రిప్టివ్ రాతపరీక్ష

- ఈ పేపర్‌కు 300 మార్కులు ఉంటాయి. అభ్యర్థులు పరీక్షను మొత్తం హిందీలో రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షకు అవసరమైన కాలిక్యులేటర్, లాగరిథమ్ టేబుల్, స్టీమ్ టేబుల్స్ తీసుకుని వెళ్లవచ్చు.
- పేపర్-2కి సిలబస్ పేపర్-1లో జనరల్ ఇంగ్లిష్‌కు సంబంధించిన సబ్జెక్టులు ఉంటాయి.
- ఈ పేపర్‌లో అడిగే ప్రశ్నలు అకడమిక్ ప్రశ్నల్లా ఉంటాయి.
- డెఫినేషన్లు, బ్లాక్ డయాగ్రమ్, ఎక్స్‌ప్లెయిన్డ్ ప్రాబ్లమ్స్, కంపారిజన్, డిఫరెన్సెస్ మొదలైన వాటిపై ప్రశ్నలు అడుగుతారు.
- ఇంజినీరింగ్ పేపర్ చదివేటప్పుడు డెఫినేషన్లు, బ్లాక్ డయాగ్రమ్స్, స్టాండర్ట్ ఈక్వేషన్లను రాసిపెట్టుకుంటే పేపర్-2 రాత పరీక్షకు ఉపయోగపడుతుంది.



శశికాంత్ వాల్మీకి
కో ఆర్డినేటర్, సాయిమేధ, కోఠి
9246212138

## ఎన్ఐఎన్‌లో అసిస్టెంట్లు

**హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**




- **మొత్తం ఖాళీలు:** 20 (పర్సనల్ అసిస్టెంట్-5, స్టెనోగ్రాఫర్-3, అప్పర్ డివిజన్ క్లర్క్-7, లోయర్ డివిజన్ క్లర్క్-5)
- **అర్హతలు:** పర్సనల్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టులకు ఏదైనా బ్రాంచీలో మూడేండ్ల బ్యాచిలర్ డిగ్రీ, మిగతా పోస్టులకు ఇంటర్ ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు ఇంగ్లిష్/హిందీ షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 120 లేదా 80 పదాల వేగాన్ని కలిగి ఉండాలి. యూడీసీ/ఎల్‌డీసీ పోస్టులకు ఇంగ్లిష్/హిందీ టైపింగ్‌లో నిమిషానికి 35/30 పదాల వేగంతో కంప్యూటర్ స్క్రీన్ పైన టైప్ చేయాలి.
- **వయస్సు:** పర్సనల్ అసిస్టెంట్‌కు 30 ఏండ్లు, మిగతా పోస్టులకు 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** పర్సనల్ అసిస్టెంట్‌కు రూ. 35,400-1,12,400/, ఎల్‌డీసీలకు రూ. రూ.19,900-63,200/-, మిగతా పోస్టులకు రూ.25,500-81,100/- చెల్లిస్తారు.
- **ఫీజు:** రూ. 300/- (ఎస్సీ/ఎస్టీ, మహిళలకు ఫీజు లేదు)
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- యూడీసీ/ఎల్‌డీసీలకు 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్-50, ఇంగ్లిష్ లాంగ్వేజ్-50, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-50, జనరల్ అవేర్‌నెస్-50. సమయం 2 గంటల 20 నిమిషాలు.
- స్టెనోగ్రాఫర్/పర్సనల్ అసిస్టెంట్‌కు 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్ & రీజనింగ్-50, జనరల్ అవేర్‌నెస్-50, ఇంగ్లిష్ లాంగ్వేజ్ & కాంప్రహెన్షన్-100 మార్కులు ఉంటాయి. సమయం 2 గంటలు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 25
- **వెబ్‌సైట్:** www.nin.res.in

## ఓఎన్‌జీసీలో 1000 స్కాలర్‌షిప్‌లు

**ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) దేశవ్యాప్తంగా 1000 మంది స్కాలర్‌షిప్స్ పొందడానికి బ్యాచిలర్ డిగ్రీ, పీజీ ఉన్నత విద్యలు చదువుతున్న ప్రతిభావంతులైన ఎస్సీ/ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- **అర్హత:** ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివే అభ్యర్థులు ఇంటర్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎంబీఏ/మాస్టర్ డిగ్రీ చదివే అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో 60 శాతం మార్కులతో లేదా సమానమైన గ్రేడ్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయస్సు:** 2019 అక్టోబర్ 1 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- **స్కాలర్ షిప్ విలువ:** ఎంపికైన ప్రతి అభ్యర్థికి ఏడాదికి ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.48,000/- అంటే ప్రతి నెలకు రూ.4000/- చొప్పున కోర్సు పూర్తయ్యేవరకు స్కాలర్‌షిప్ చెల్లిస్తారు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.4.50 లక్షలు దాటరాదు.
- 50 శాతం స్కాలర్‌షిప్స్ బాలికలకు కేటాయించారు.

**నోట్:** డిగ్రీ లేదా పీజీ మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణులు కావాలి. ఒకవేళ ఫెయిలైతే తర్వాత ఏడాదికి స్కాలర్‌షిప్ ఆపివేస్తారు.

- దేశ వ్యాప్తంగా ఐదు జోన్లలోని ప్రతి జోన్‌కు 200 స్కాలర్‌షిప్స్ అందజేస్తారు. సౌత్ జోన్ పరిధిలోని ప్రాంతాలు- తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, లక్షదీవులు, అండమాన్ నికోబార్ దీవులు
- కుటుంబంలోని ఒక్కరికి మాత్రమే స్కాలర్‌షిప్ వర్తిస్తుంది.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 15
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

**విభాగాలవారీగా స్కాలర్‌షిప్‌లు**

| విభాగం | కోర్సు వ్యవధి | సంఖ్య | ఉత్తీర్ణత |
| --- | --- | --- | --- |
| ఇంజినీరింగ్ | నాలుగేండ్లు | 494 | ఇంటర్ |
| ఎంబీబీఎస్ | నాలుగేండ్లు | 90 | ఇంటర్ |
| ఎంబీఏ | రెండేండ్లు | 146 | బ్యాచిలర్ డిగ్రీ |
| మాస్టర్ డిగ్రీ (జియాలజీ/జియోఫిజిక్స్) | రెండేండ్లు | 270 | బ్యాచిలర్ డిగ్రీ |

## ఓయూలో పీజీ డిప్లొమా

**హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి చెందిన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) 2019-20 విద్యాసంవత్సరానికి పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ప్రకటన విడుదల చేసింది.**

పీజీ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మాటిక్స్

- **కోర్సు కాల వ్యవధి:** ఏడాది
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ, బీఫార్మసీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంసీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 30
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500/-
- **వెబ్‌సైట్:** www.oucde.net

## సీడాక్‌లో 163 ఖాళీలు

**సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్)లో ప్రాజెక్టు మేనేజర్, ఇంజినీర్, అసోసియేట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**





**పోస్టులు-వివరాలు:**

- ప్రాజెక్టు ఇంజినీర్ (సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలపర్/ఇంప్లిమెంటేషన్)
- **ఖాళీలు:** 87
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ (సంబంధిత విభాగం) లేదా పీజీ (సంబంధిత విభాగం)తోపాటు కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **జీతం:** రూ.34,100-135,000/-
- ప్రాజెక్టు అసోసియేట్లు (ఫ్రెషర్స్)- 46 ఖాళీలు
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ లేదా సంబంధిత విభాగంలో పీజీ.
- ప్రాజెక్టు ఇంజినీర్- 16 ఖాళీలు
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ లేదా పీజీ ఉత్తీర్ణత. దీంతోపాటు రెండేండ్ల అనుభవం ఉండాలి.
- వీటితోపాటు ప్రాజెక్టు మేనేజర్-2, ప్రాజెక్టు ఇంజినీర్ (ఫ్యాకల్టీ)-5, ప్రాజెక్టు ఇంజినీర్ (డీసీ&ఐఎస్)-7 ఖాళీలు ఉన్నాయి.
- **నోట్:** పై పోస్టులన్నింటిని మొదట రెండేండ్లకు తీసుకుంటారు. తర్వాత మరో ఏడాది పెంచే అవకాశం ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 3
- **ఇంటర్వ్యూ తేదీ:** ప్రాజెక్టు మేనేజర్ పోస్టుకు సెప్టెంబర్ 14
- **మిగతా పోస్టులకు ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** సెప్టెంబర్ 14, 15
- **వెబ్‌సైట్:** https://cdac.in

## ఉద్యాన వర్సిటీలో బీఎస్సీ

**శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం హార్టిసెట్-2019 ద్వారా ఉద్యాన బీఎస్సీ (ఆనర్స్)లో ప్రవేశాల కోసం హార్టికల్చర్ డిప్లొమా కోర్సు పూర్తిచేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **కోర్సు పేరు:** బీఎస్సీ ఆనర్స్ (హార్టికల్చర్)
- **మొత్తం సీట్లు:** 23
- **అర్హత:** ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ/డాక్టర్ వైఎస్ఆర్‌హెచ్‌యూల నుంచి హార్టికల్చర్‌లో డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 17 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.750/- (ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీలకు రూ.350/-)




- **ఎంపిక:** అకడమిక్ మార్కులు, ఎంట్రెన్స్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 7
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

# కశ్మీర్‌లో ఆంక్షలను నిరసిస్తూ ఐఏఎస్ అధికారి రాజీనామా



**తిరువనంతపురం, ఆగస్టు 25:** జమ్ముకశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను నిరసిస్తూ కన్నన్ గోపీనాథన్ అనే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి తన ప్రభుత్వ ఉద్యోగం నుంచి వైదొలిగారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ రాజ్యాంగ అధికరణను కేంద్ర ప్రభుత్వం ఇటీవల రద్దుచేసిన తర్వాత ఆ రాష్ట్రంలో ఆంక్షలు విధించి లక్షలమంది ప్రజలకు 'ప్రాథమిక హక్కులను' నిరాకరించడం తనను బాధించిందని, తాను పదవి నుంచి వైదొలగడానికి ఇదొక కారణమని గోపీనాథన్ పేర్కొన్నారు. 'నా రాజీనామాతో ఒరిగేదీమీ ఉండదని నాకు తెలుసు. అయినప్పటికీ ఎవరైనా తమ మనస్సాక్షికి సమాధానం చెప్పుకోవాల్సిందే' అని ఆయన ఓ జాతీయ టెలివిజన్ చానల్‌తో అన్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీలో కొన్ని కీలకశాఖలకు కార్యదర్శిగా ఉన్న గోపీనాథన్.. నష్టాల్లో నడుస్తున్న ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థను లాభాలబాటలోకి తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించారు. 'జమ్ముకశ్మీర్‌లో 20 రోజులపాటు లక్షలమంది ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. దేశంలోని చాలామందికి ఇది బాగానే అనిపించవచ్చు. 370వ రాజ్యాంగ అధికరణను రద్దుచేయడం సమస్యకాదు. కానీ ఈ చర్యపై స్పందించేందుకు పౌరులకున్న హక్కును నిరాకరించడమే ప్రధాన సమస్య. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వారు స్వాగతించవచ్చు లేదా వ్యతిరేకించవచ్చు. అది వారి హక్కు. ఆ హక్కును నిరాకరించడం నన్ను బాధించింది. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశా' అని గోపీనాథన్ వివరించారు. ఏడేండ్ల నుంచి ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న గోపీనాథన్ ఈ నెల 21వ తేదీనే తన రాజీనామా సమర్పించారు.

# తమిళనాడులో కరుణానిధికి గుడి



## రిజర్వేషన్ కల్పించినందుకు గౌరవసూచకంగా ఆలయ నిర్మాణం

**నమక్కల్ (తమిళనాడు), ఆగస్టు 25:** డీఎంకే మాజీ అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎం కరుణానిధికి ఆ రాష్ట్రంలో గుడి కడుతున్నారు. తమ కులానికి ప్రత్యేక రిజర్వేషన్‌ను కల్పించినందుకు గౌరవ సూచకంగా నమక్కల్ జిల్లాలోని కుచికాడు గ్రామంలోని కొందరు ఈ నిర్ణయం తీసుకున్నారు. రూ. 30 లక్షలతో నిర్మించనున్న ఈ గుడి నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కూడా చేశారు. 'మా అరుంతాతియార్స్ (ఎస్సీ వర్గం) కులానికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్‌ను దశాబ్దం క్రితం డీఎంకే హయాంలో కరుణానిధి కల్పించారు. ఆయన గౌరవార్థం ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నాం' అని సదరు కులస్థులు తెలిపారు. కరుణానిధి తమ కుల దైవమని వాళ్లు పేర్కొన్నారు.





బంగ్లాదేశ్‌లోని శరణార్థుల శిబిరం వద్ద ర్యాలీలో పాల్గొన్న రోహింగ్యాలు

# దేశం విడిచి రెండేండ్లు!

## బంగ్లాదేశ్‌లోని శరణార్థుల శిబిరం వద్ద రోహింగ్యాల భారీ ర్యాలీ

## మయన్మార్ ప్రభుత్వ మారణహోమాన్ని గుర్తుచేసుకున్న శరణార్థులు

**కుటుపాలాంగ్, ఆగస్టు 25:** దేశం విడిచి రెండేండ్లు అయిన నేపథ్యంలో రోహింగ్యాలు భారీ ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్‌లోని శరణార్థుల శిబిరం వద నిర్వహించిన ఈ ర్యాలీలో దాదాపు 2 లక్షల మంది రోహింగ్యాలు పాల్గొన్నారు. 2017 ఆగస్టులో రోహింగ్యాలపై మయన్మార్ సైనికులు మారణోమానికి పాల్పడటంతో 7,40,000 మంది బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. అప్పటి నుంచి బంగ్లాదేశ్‌లోని శరణార్థుల శిబిరంలో తలదాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేశం విడిచి రెండేండ్లు కావడాన్ని పురస్కరించుకొని రోహింగ్యాలు భారీ ర్యాలీ చేపట్టారు. 'దేవుడు గొప్పవాడు. రోహింగ్యాలు కలకాలం జీవించాలి' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బంగ్లాదేశ్ ప్రభుత్వం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. రోహింగ్యా నాయకుడు మోహిబ్ ఉల్లా మాట్లాడుతూ 'మా సొంత ప్రాంతానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ మేము అక్కడికి వెళ్లాలంటే తొలుత మాకు మయన్మార్ పౌరసత్వం ఇవ్వాలి. మాకు రక్షణ కల్పించాలి' అని తెలిపారు. మయన్మార్‌లోని రఖేన్ ప్రాంతంలో తమపై దాడులు జరిగాయని, లైంగికదాడులు చేశారని, తమ వారిని చంపారని చెప్పారు. అయినా తమ మాతృభూమిపై మమకారం ఉన్నదని, తమతో మయన్మార్ ప్రభుత్వం చర్చలు జరిపి తమ డిమాండ్‌లకు అంగీకరిస్తే అక్కడికి వెళ్లడానికి సిద్ధమేనని పేర్కొన్నారు.



హాంకాంగ్‌లో పోలీసులపైకి గులేర్‌తో దాడిచేస్తున్న ఆందోళనకారులు

# హాంకాంగ్‌లో ఆరని చిచ్చు

## కొనసాగుతున్న ఆందోళన

## పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ

**హాంకాంగ్, ఆగస్టు 25:** చైనాకు నేరగాళ్ల అప్పగింత బిల్లుకు వ్యతిరేకంగా హాంకాంగ్ ప్రజలు చేపట్టిన ఆందోళన కొనసాగుతూనే ఉన్నది. ఆదివారం వందలాది మంది ప్రజలు క్వైయ్ ఫాంగ్ రైల్వే స్టేషన్ సమీపంలో ర్యాలీ చేపట్టారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా గొడుగులు చేతపట్టుకొని ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో నిరసన కారులను అడ్డుకోవడానికి పోలీసులు రోడ్ల మీద భారీగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినా ఆందోళనకారులు వెనుకడుగు వేయకపోవడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శనివారం కూడా ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు మాట్లాడుతూ ఘర్షణలకు సంబంధించి 29 మందిని అరెస్టు చేశామని చెప్పారు. ఆందోళనకారులు చైనాకు నేరగాళ్ల అప్పగింత బిల్లును వ్యతిరేకించడంతో పాటు హాంకాంగ్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని, శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న వారిపై పోలీసులు బల ప్రయోగం చేయడంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# రూ.400 కోట్ల నిషేధిత డ్రగ్స్ సీజ్

## మణిపూర్‌లోని థౌబాల్ జిల్లాలో ట్రక్కులో తరలిస్తుండగా పట్టివేత



మణిపూర్‌లో పట్టుబడిన డ్రగ్స్

**ఇంఫాల్, ఆగస్టు 25:** మణిపూర్‌లో భారీ విలువైన నిషేధిత డ్రగ్స్ పట్టుబడ్డాయి. ట్రక్కులో తరలిస్తున్న రూ.400 కోట్ల విలువైన మత్తు పదార్థాలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. థౌబాల్ జిల్లాలోని ఫౌడెల్ కీరాంబి మఖాలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీసు బృందాలు నిషేధిత డ్రగ్స్‌ను పట్టుకున్నాయని ఎస్పీ ఎస్ ఇబాంచాసింగ్ తెలిపారు. ట్రక్కును తనిఖీ చేయగా, పార్టీ డ్రగ్స్‌గా పేరుగాంచిన 40 లక్షల కాంట్రాబ్యాండ్ యాంఫిటామైన్‌కు చెందిన వరల్డ్ ఈజ్ యువర్స్(డబ్ల్యూవై) టాబ్లెట్లు లభించాయని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి విలువ రూ.400 కోట్లు ఉంటుందని వెల్లడించారు. ట్రక్కును థౌబాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. మినీ ట్రక్కులో పరిచిన కార్పెట్ల కిందట ఈ ఎర్రరంగు టాబ్లెట్లను దాచిఉంచినట్టు గుర్తించామని సింగ్ తెలిపారు. ఈ నిషేధిత డ్రగ్స్‌ను మయన్మార్ నుంచి స్మగ్లింగ్ చేస్తున్నట్టు తేల్చారు. ట్రక్కు డ్రైవర్ ఎండీ హుస్సేన్‌ను అరెస్టు చేసి, విచారించారు. అతడిచ్చిన సమాచారంతో మయన్మార్‌కు చెందిన క్యా క్యా నాయింగ్‌తోపాటు మరో ఇద్దరిని ఇంఫాల్ విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేశారు. నాయింగ్‌ను అంతర్జాతీయ డ్రగ్స్ డీలర్‌గా అనుమానిస్తున్నారు. ఈ నెల 17న థౌబాల్ జిల్లాలోని మొయిజింగ్ అవాంగ్ లీకాయి ప్రాంతంలో హెరాయిన్ తయారీ పరిశ్రమ గుట్టును పోలీసులు రట్టుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.160 కోట్ల విలువైన 183 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జూన్‌లోనూ అదేప్రాంతంలో రూ.100 కోట్ల విలువైన 111 కిలోల హెరాయిన్‌ను పోలీసులు పట్టుకున్నారు.

# గనుల్లో బాల్యం సమాధి

**బడిలో బలపం పట్టాల్సిన చిన్నారుల బాల్యం మైకా గనుల్లో చితికిపోతున్నది. భావి భారతాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాల్సిన వాళ్ల ఆలోచనలు రాళ్ల నేలపై అగమ్యగోచరంగా మారుతున్నాయి. జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో బడికెళ్లాల్సిన పసి మొగ్గలు బాల కార్మికులుగా మగ్గిపోతున్నాయి.**

- జార్ఖండ్, బీహార్ మైకా గనుల్లో 5వేల మంది బాల కార్మికులు
- అందరూ ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయసు వాళ్లే
- కుటుంబ పోషణ కోసం చదువుకు దూరంగా.. పనికి దగ్గరగా!



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:**

పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉంటేనే 'బాల కార్మిక వ్యవస్థ'ను నిర్మూలించడం సాధ్యమవుతుంది. జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లోని మైకా ఖనిజాన్ని ఉత్పత్తి చేసే జిల్లాల్లో నివసించే పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. కుటుంబ పోషణ కోసం మైకా గనుల్లో పనికి కుదురుతున్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెలుగుచూసింది. జార్ఖండ్‌లోని కోడెర్మా, గిరిడి జిల్లాలు.. బీహార్‌లోని నవాడా జిల్లాలకు చెందిన ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయసున్న చిన్నారులు మైకా గనుల్లో బాల కార్మికులుగా పనులు చేస్తున్నట్టు ఎన్‌సీపీసీఆర్ రిపోర్టు పేర్కొంది. 'సర్వే ప్రకారం జార్ఖండ్ నుంచి 4,545 మంది, బీహార్ నుంచి 649 మంది చిన్నారులు పాఠశాల విద్యకు దూరమై.. ఆయా జిల్లాల్లోని మైకా గనుల్లో పనిచేస్తున్నారు' అని ఎన్‌సీపీసీఆర్ ప్రతినిధులు తెలిపారు.

### కుటుంబ భారం మోయడానికే..

మైకా ఖనిజాన్ని ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉన్నది. జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలు ప్రధానంగా మైకాను ఉత్పత్తి చేస్తున్నాయి. భవనాల నిర్మాణం, ఎలక్ట్రానిక్స్, పెయింటింగ్స్, కాస్మొటిక్స్ తయారీలో మైకాను ప్రధానంగా వాడుతారు. విద్య ప్రాధాన్యం తెలియకపోవడం, పేదరికం తదితర కారణాల వల్ల కోడెర్మా, గిరిడి, నవాడా జిల్లాల్లో నివసిస్తున్న చాలా కుటుంబాలు చిన్నారులను పనికి పురిగొల్పుతున్నాయి. బాలలు ఏరుకొచ్చిన మైకా శకలాల్ని విక్రయిస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. మరికొన్ని కుటుంబాలు పిల్లల్ని గనుల్లో పనులకు పురమాయిస్తున్నాయి. 'జిల్లాల్లోని పలు కుటుంబాలు తమ చిన్నారులను మైకా శకలాలు ఏరుకురావడం, గనుల్లో పనులు చేయించడం వంటివి చేస్తున్నాయి. పాఠశాలకు పిల్లల్ని పంపడం వల్ల కలిగే లాభం, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుపై కన్నవాళ్లకు అవగాహన లేకపోవడమే దీనికి కారణం' అని అధ్యయనంలో పాల్గొన్న ఓ అధికారి తెలిపారు.

### వెంటాడుతున్న ఆరోగ్య సమస్యలు..

పగలు రాత్రి అనే తేడా లేకుండా గనుల్లో పనిచేస్తున్న పిల్లలను ఆరోగ్య సమస్యలు కూడా వెంటాడుతున్నాయి. గిరిడి, కోడెర్మా జిల్లాల్లోని గనుల్లో పనిచేస్తున్న పిల్లల్లో 14 నుంచి 19 శాతం, నవాడా జిల్లా గనుల్లో పనిచేస్తున్న 69 శాతం చిన్నారుల్లో పోషకాహార లోపం కనిపించిందని అధ్యయనం పేర్కొంది. పాఠశాలకు వెళ్లకుండా మైనింగ్ ప్రాంతాల్లో పనిచేస్తున్న పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ వసతిని ప్రభుత్వం కల్పిస్తే పరిస్థితిలో మార్పు రావొచ్చని అధ్యయనం సూచించింది.

### సొగసు మాటున చిన్నారుల శ్రమ!



కాంతులీనేలా మెరుగులద్దిన ముఖం వెనుక చీకటి బతుకీడుస్తున్న బాలల మౌన వేదన దాగి ఉన్నది. ముఖ వర్చస్సును, శరీర నిగారింపును ఇనుమడింపజేసుకోడానికి వాడే సౌందర్య సాధనాల తయారీ వెనుక బాలల నిగూఢ కష్టమున్నది. చిట్టి చేతులు, లేత తనువు చిందించే చెమటతో బడా కాస్మొటిక్ సంస్థలు లాభాల్ని గడిస్తున్నాయి. సహజసిద్ధంగా లభించే మైకా ఖనిజాన్ని సౌందర్య సాధనాల తయారీలో ప్రముఖంగా వినియోగిస్తారు. జార్ఖండ్, బీహార్‌లో లభించే మైకాను పేరుగాంచిన బ్రాండ్‌లు కూడా వాడుతున్నాయి. బాలల్ని కార్మికులుగా చేసి, తక్కువ వేతనం చెల్లించి ఆయా రాష్ట్రాల్లో అక్రమ మైనింగ్ జోరుగా సాగుతున్నది. విదేశీ కాస్మొటిక్ బ్రాండ్ సంస్థలు ప్రత్యక్షంగా ఈ గనుల్లో ఉత్పత్తి అయిన మైకాను కొనుగోలు చేయనప్పటికీ, సరఫరా సంస్థల( వీళ్లు మైనింగ్ సంస్థల నుంచి ఖనిజాన్ని కొనుగోలు చేస్తా రు) ద్వారా కొనుగోళ్లు జరుపుతున్నాయి.

# భయం వీడని కోయంబత్తూర్

**కోయంబత్తూర్, ఆగస్టు 25:** తమిళనాడులోని కోయంబత్తూర్ ఇంకా భయం వీడలేదు. లష్కరే తొయిబా ఉగ్రవాదులు చొరబడ్డారన్న ఇంటెలిజెన్స్‌వర్గాల హెచ్చరికలతో మూడో రోజు ఆదివారం కూడా కోయంబత్తూర్ జిల్లాలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత కొనసాగింది. ప్రార్థనా మందిరాలు ముఖ్యంగా చర్చిల వద్ద నిఘా పెంచారు. ఉగ్రవాదులతో లింకులున్న కేరళకు చెందిన వ్యక్తితో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించినట్టు పోలీసులు తెలిపారు. అవసరమైన సమయంలో పోలీసుల ఎదుట హాజరుకావాలనే నిబంధనతో వారిని వదిలేసినట్టు చెప్పారు. భద్రతా చర్యల్లో భాగంగా నగరంలో భారీ వాహనాలు, ఇతర సరుకుల వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు మాల్స్, ఇతర రద్దీప్రాంతాల్లో 2 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని మోహరించారు.

# ప్లాస్టిక్‌ను త్యజించండి

- ప్లాస్టిక్‌రహిత రోజుగా గాంధీ జయంతి
- ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు కార్పొరేట్లు సరైన మార్గాలన్వేషించాలి
- సెప్టెంబర్ 11 నుంచి స్వచ్ఛతా హీ సేవలో పాల్గొనాలి
- దేశ ప్రజలకు మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా వచ్చే అక్టోబర్ రెండో తేదీన భారత్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చి దిద్దాలని దేశ ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ అభ్యర్థించారు. అక్టోబర్ 27న దీపావళి నాటికి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు ముందుకు రావాలని సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం 'సింగిల్ యూజ్' ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు ప్రజా ఉద్యమం చేపట్టాలని కోరారు. ప్రధాని మోదీ తన నెలవారీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు దీపావళి లోగా సరైన మార్గాలు అన్వేషించాలని కార్పొరేట్ రంగాన్ని కోరుతున్నా. దీన్ని పునర్వినియోగంలోకి తీసుకొస్తే ఇంధనంగా పరివర్తన చెందుతుంది. ఇది ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు సరైన మార్గం' అని అన్నారు. సెప్టెంబర్ 11 నుంచి వార్షిక 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో పాల్గొనాలని దేశ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. 'ఈ ఏడాది అక్టోబర్ రెండో తేదీన మనం బాపూజీ 150వ జయంతి జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంతోపాటు ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నూతన విప్లవానికి పునాది వేయడమే ఆయనకిచ్చే నివాళి. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఒకరోజు 'ప్లాస్టిక్ రహిత మదర్‌ఇండియా'గా తీర్చిదిద్దేదుకు ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు. 'మనకు గాంధీజీకన్నా గొప్ప స్ఫూర్తి ఏముంది? దుకాణాలు నడిపే నా సోదర సోదరీమణులు తమ వద్దకు వచ్చే వినియోగదారులను షాపింగ్‌కు బ్యాగ్‌లు తెచ్చుకోవాలని నిస్సంకోచంగా చెప్పాలి. తత్ఫలితంగా డబ్బు ఆదా కావడంతోపాటు పర్యావరణ పరిరక్షణ దిశగా ఒక అడుగు ముందుకు పడుతుంది' అని పేర్కొన్నారు. వన్యప్రాణులు, ప్రకృతి పరిరక్షణకు అనుకూల వాతావరణం నెలకొల్పినప్పుడే అడవులు, వన్యప్రాణుల సంపద అభివృద్ధి చెందుతుందని, మన పురాతన గ్రంథాలు ఇదే విషయం చెబుతున్నాయని తెలిపారు. అడవుల్లో పులులు లేకుంటే ప్రజలు వాటిని నరికేసి ధ్వంసం చేస్తారన్నారు. అడవులు లేక పులులు ప్రజల్లోకి రావడంతో వాటిని చంపేస్తున్నారన్నారు. దేశంలో 2967 పులులు ఉన్నాయని తేలిందని, కొన్నేండ్ల క్రితం ఇందులో సగం పులులు మాత్రమే ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పారు. 2010 పులుల సదస్సులో 2022 నాటికి అంతర్జాతీయంగా పులుల సంఖ్య రెట్టింపు చేయాలని తీర్మాణించారన్నారు.మరోవైపు వచ్చేనెలలో ప్రారంభించనున్న పోషణ్ అభియాన్ (పౌష్టికాహార ప్రచారోద్యమం)లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బాలలు, మహిళలకు పౌష్టికాహారం కోసం ప్రజా ఉద్యమం చేపట్టాలన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ప్రారంభిస్తామన్నారు. మనం వ్యక్తిగతంగా ధృడంగా ఉంటే దేశాన్ని ధృడంగా తీర్చిదిద్ద వచ్చునన్నారు. టెక్నాలజీ సాయంతో హిందీని అర్థం చేసుకోవడం చాలా తేలిక అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జిమ్ కార్‌బెట్ నేషనల్ పార్క్‌లో బేర్‌గ్రిల్స్‌తో నిర్వహించిన 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమంలో.. ' గ్రిల్స్ తన చెవిలో చిన్న కార్డ్‌లెస్ పరికరాన్ని వాడటంతో నేను హిందీలో మాట్లాడితే ఆయన ఇంగ్లిష్‌లో విన్నాడు. ఇది టెక్నాలజీ సృష్టించిన అద్భుతం' అని చెప్పారు.

# ఏపీలో నాలుగు రాజధానులు!

## ఎంపీ టీజీ వెంకటేశ్ వ్యాఖ్య

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు రాజధానులు ఏర్పాటుచేసే యోచనలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ఇటీవల బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్నూలులో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత రాజధాని అమరావతిని కొనసాగనీయబోమని కేంద్ర ప్రభుత్వానికి సీఎం జగన్ చెప్పారని, అదే విషయం తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపా రు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో సీఎం విజయనగరం, కాకినాడ, గుంటూరు, కడప జిల్లాలను ఏపీ రాజధానులు గా చేయనున్నారని తెలిపారు. ప్రజ లు కూడా హర్షిస్తారని తాను భావిస్తున్నట్టు చెప్పారు. అమరావతి మీదే ప్రభుత్వం దృష్టి పెట్టడంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓటమిపాలయ్యిందని, అమరావతిలో పెట్టుబడులు పెడితే ఉత్తరాంధ్ర, రాయలసీమ విడిపోవడం ఖాయమని, పెట్టుబడుల వికేంద్రీకరణ జరుగాలని అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఆగకూడదని ఆయన చెప్పారు.

## ఎన్టీయేతో సంబంధం లేకుండా

# జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్ పరీక్షలా?

- ఎన్టీయేకి పూర్తిసామర్థ్యం లేదంటున్న ఐఐటీలు
- కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా ఐఐటీ నిర్ణయాలు
- ఐఐటీల తీరుపై భిన్నాభిప్రాయాలు
- అనుమానాలు వ్యక్తంచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత విద్యాసంస్థల ప్రవేశ పరీక్షలతోపాటు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) లాంటి 16 రకాల ప్రవేశ పరీక్షలను సమర్థంగా నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే).. ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌తోపాటు గేట్, ఏఐఐఎంఎస్ లాంటి ప్రవేశ పరీక్షలను ఎందుకు నిర్వహించలేకపోతున్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా రెండుసార్లు జేఈఈ మెయిన్స్ పరీక్షలతోపాటు వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో 'నీట్', యూజీసీ-నెట్, ఐఐఎఫ్‌టీ, జేఎన్‌యూ ఎంట్రెన్స్, సీమ్యాట్, సీప్యాట్ లాంటి పరీక్షలను కూడా ఎన్టీయే నిర్వహిస్తున్నది. అయినప్పటికీ ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఎన్టీయేకి ఎలాంటి సంబంధం లేకుండా అన్ని ఐఐటీలు కలిసి సొంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. అలాగే ఐఐటీల్లో ఎంటెక్ లాంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే గేట్ పరీక్షలను కూడా ఐఐటీలే సొంతంగా నిర్వహించుకుంటున్నాయి. దీంతో ఐఐటీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో కొనసాగుతున్న ఎన్టీయే పరిధిలోకి రాకపోవడంపై విద్యావేత్తల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఐఐటీలు, ఏఐఐఎంఎస్ లాంటి జాతీయస్థాయి సంస్థలు కేంద్ర నిర్ణయాలను ఎందుకు అమలు చేయడం లేదు? కేంద్రానికి వ్యతిరేకంగా ఐఐటీలు ఎందుకు నిర్ణయాలు తీసుకుంటున్నాయి? స్వతంత్ర హోదా ఉన్న ఐఐటీలు ఎన్టీయే పరిధిలోకివస్తే తప్పేమిటి? అన్న అనుమానాలను సీనియర్ ప్రొఫెసర్లు వ్యక్తంచేస్తున్నారు.

### అంత సామర్థ్యం ఎన్టీయేకి లేదు..

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతున్న ఐఐటీలు, ఏఐఐఎంఎస్‌లలో ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్ లాంటి పరీక్షలను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాల్సి ఉంటుందని, అంత సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యం ఎన్టీయేకి లేకపోవడం వల్లనే ఆ పరీక్షలను ఐఐటీలు సొంతంగా నిర్వహించుకొంటున్నాయని సీనియర్ ప్రొఫెసర్ డీఎన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో ఇలాంటి పరీక్షలను సీబీఎస్‌ఈ నిర్వహించి బోల్తా పడిందని ఆయన గుర్తుచేశారు. ఎక్కువ మందికి సంబంధించిన పరీక్షలను నిర్వహించే సామర్థ్యం మాత్రమే ఎన్టీయేకి ఉన్నదని, సున్నితమైన పరీక్షలను నిర్వహించే శక్తి లేదని చెప్పారు. ఐఐటీల మాదిరిగా ఎన్ఐటీలు, ఐఐఐటీలు కూడా తమ ప్రవేశ పరీక్షలను సొంతంగా నిర్వహించుకొంటే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

### రానున్న రెండేండ్లలో ప్రవేశ/అర్హత పరీక్షలన్నీ ఎన్టీయే పరిధిలోకే..

రానున్న రెండేండ్లలో దేశవ్యాప్తంగా అన్నిరకాల ప్రవేశ/అర్హత పరీక్షలన్నీ ఎన్టీయే పరిధిలోకి రావచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్‌తోపాటు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించిన ప్రవేశ పరీక్షలను కూడా ఎన్టీయే నిర్వహించే అవకాశాలున్నాయని, దీనిపై త్వరలోనే స్పష్టత రావచ్చని అన్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఒకే పరీక్షతో పలు రకాల కాలేజీలలో ప్రవేశాలు పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

# బీమా సొమ్ము కోసం పనిమనిషి హత్య

**అమరావతి:** బీమా సొమ్ము కాజేసేందుకు పనిమనిషిని హత్య చేసిన ఘటన ఏపీలోని కర్నూలు జిల్లాలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. 2015లో బనగానపల్లె మండలం అవుకు వద్ద రోడ్డు ప్రమాదంలో సుబ్బారాయుడు అనే వ్యక్తి మరణించాడు. రోడ్డు ప్రమాదంగానే భావించిన పోలీసులు ఆ కోణంలోనే కేసు నమోదు చేశారు. నాలుగేండ్ల అనంతరం అది హత్య అని పోలీసులకు కీలక సమాచారం అందింది. యజమాని భాస్కర్‌రెడ్డి హత్య చేయించినట్టు అజ్ఞాతవ్యక్తులు పోలీసులకు తెలిపారు. ఎవరూ లేని సుబ్బారాయుడిపై యజమాని రూ.32 లక్షలకు బీమా చేయించారు. అతన్ని హత్య చేయించి బీమా సొమ్ము కాజేసి, నిందితులు పంచుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంపై పకడ్బందీగా దర్యాప్తు చేసి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# సుత్తితో మోది తల్లీ, కుమార్తె హత్య

**అమరావతి:** ఒంటరిగా నిద్రిస్తున్న తల్లీ, కుమార్తెలను గుర్తుతెలియని వ్యక్తులు సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఘటన ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రామచంద్రాపురం గంగమ్మగుడివీధిలో బలస మాధవి (45) ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్నారు. ఆమె కుమార్తె కరుణ (18) ఇటీవల ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నది. మాధవి భర్త శ్రీనివాస్, కుమారుడు విజయ్ కాకినాడలో ఓ హోటల్‌లో పనిచేస్తూ, వారానికి ఒకసారి ఇంటికి వచ్చివెళ్తారు. శనివారం రాత్రి తల్లీ, కుమార్తె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సుత్తితో బలంకా తలపై కొట్టి ఛిద్రం చేశారు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# తిరుపతిలో అన్యమత ప్రచారంపై విచారణ

**అమరావతి:** తిరుపతిలో ఏపీఎస్ఆర్టీసీ టికెట్ల వెనుక అన్యమత ప్రచారంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంశంపై విచారణ జరుపుతున్నట్టు ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ టికెట్ల వ్యవహారంపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఏపీఎస్ఆర్టీసీ ఎండీని ఇప్పటికే ఆదేశించామని సీఎస్ చెప్పారు.

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 26 ఆగస్టు 2019

# కొమురం భీమ్ జయంతి రోజున..?


ఎన్టీఆర్

'బాహుబలి' చిత్రంతో చరిత్ర సృష్టించి సత్తాచాటిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. తాజాగా ఆయన తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్ఆర్ఆర్' (వర్కింగ్ టైటిల్). ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా నటిస్తున్నారు. అలియాభట్ ఓ కథానాయికగా నటిస్తుండగా కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్ కనిపించనున్నారు. ఎన్టీఆర్ ఆదివాసీ పోరాట యోధుడు కొమురంభీమ్ పాత్రలో నటిస్తుండగా, రామ్‌చరణ్ మన్యం వీరుడు అల్లూరి సీతారామా రాజు పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ చిత్రం 'మోటర్ సైకిల్ డైరీస్' స్ఫూర్తితో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. కాగా ఈ చిత్రంలోని ఎన్టీఆర్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను కొమురం భీమ్ జయంతి సందర్భంగా అక్టోబర్ 22న విడుదల చేయాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. చిత్ర వర్గాలు త్వరలో అధికారికంగా ఓ ప్రకటన చేసే అవకాశం వుందని తెలిసింది. కాగా చిత్రాన్ని 2020 జూలై 30న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలతో పాటు మొత్తం పది భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

# ఇస్మార్ట్ ధనుష్?



రామ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. గత కొంత కాలంగా సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న దర్శకుడు పూరి జగన్నాథ్‌కు తిరుగులేని సక్సెస్‌ని అందించింది. హీరో రామ్ కెరీర్‌లోనే భారీ వసూళ్లని సాధించిన ఈ చిత్ర తమిళ, హిందీ రీమేక్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడింది. కాగా ఈ సినిమా తమిళ రీమేక్ హక్కుల్ని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ సొంతం చేసుకుందని తెలిసింది. ఈ చిత్రం కోసం నిర్మాణ వర్గాలు హీరో ధనుష్‌తో సంప్రదింపులు జరుపుతున్నారని, మాస్ ఫాలోయింగ్ వున్న ధనుష్ అయితేనే బాగుంటుందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయట. ఇప్పటికే తెలుగు చిత్రాన్ని చూసిన ధనుష్ రీమేక్‌లో నటించడానికి సుముఖంగా వున్నారని తెలిసింది.

# పరశురామ్ దర్శకత్వంలో..


అఖిల్

యువహీరో అక్కినేని అఖిల్ కెరీర్‌లో మంచి కమర్షియల్ విజయం కోసం తపిస్తున్నారు. నటుడిగా ప్రతిభను నిరూపించుకున్నప్పటికి బాక్సాఫీస్ వద్ద ఆయన సినిమాలు ఆశించిన విజయాల్ని దక్కించుకోలేకపోయాయి. దీంతో ప్రస్తుతం కథాంశాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నాడు అఖిల్. ప్రస్తుతం ఆయన బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం అఖిల్ మరో సినిమా ఖరారైంది. ఈ చిత్రానికి 'గీత గోవిందం' చిత్రంతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న పరశురామ్ దర్శకత్వం వహించబోతున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ గురించి తెలుసుకున్న నాగార్జున అందులోని కొత్తదనం నచ్చడంతో ఓకే చేశారని సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున ఈ చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.


'ఆర్‌డీఎక్స్ లవ్' చిత్రంలో పాయల్‌రాజ్‌పుత్


దీక్షితాపార్వతి, అజిత్

# ప్రేమతో 'నీకోసం'


అరవింద్‌రెడ్డి, శుభాంగిపంత్, అజిత్‌రాధారం, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నీ కోసం'. అవినాష్ కోకటి దర్శకుడు. అల్లూరమ్మ (భారతి) నిర్మాత. సెప్టెంబర్ 6న ప్రేక్షకులముందుకురానుంది. ఇటీవలే విడుదలైన చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ చిత్ర యూనిట్‌ను అభినందించారు. 'కొత్తదనంతో కూడిన ట్రైలర్‌ను చూసి పవన్‌కల్యాణ్ ఇంప్రెస్ అయ్యారు. కథ గురించి తెలుసుకొని బాగుందని మెచ్చుకున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు తెలుగు పరిశ్రమకు అవసరమని చెప్పారు. ముక్కోణపు ప్రేమకథ ఇది. ప్రేమప్రయనంలోని అనుభూతులకు అద్దం పడుతుంది. ప్రేమను కొత్తకోణంలో ఆవిష్కరిస్తుంది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: శివక్రిష్ణ, రచన-దర్శకత్వం: అనినాష్ కోకటి.


సమంత

# భయం వదిలిపెట్టండి!

దక్షిణాదిన ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే కథానాయికల్లో సమంత ముందు వరుసలో ఉంటుంది. సినిమాలపరంగా ఎంత బిజీగా ఉన్నా వ్యాయామాన్ని మాత్రం అస్సలు నిర్లక్ష్యం చేయదు. శారీరకంగా పర్‌ఫెక్ట్‌గా ఉండటమే అన్ని రుగ్మతలకు విరుగుడు అని ఎప్పుడూ చెబుతుంటుంది ఈ చెన్నై సోయగం. సోషల్‌మీడియాలో తన ఫిట్‌నెస్ వీడియోలను తరచుగా పోస్ట్ చేస్తూ అభిమానుల్లో స్ఫూర్తిని నింపుతుంటుంది. ఇటీవలకాలంలో సోషల్‌మీడియాకు కాస్త దూరంగా ఉన్న సమంత తాజాగా పార్కర్ శైలి (మిలిటరీ శిక్షణలో ఉపయోగించే వ్యాయామాలు) ఫిట్‌నెస్ వీడియోతో ఇన్‌స్టాగ్రామ్‌లో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. ఇనుప స్తంభంపైకి ఒడుపుగా ఎగబాకి..ఎంతో జాగ్రత్తగా క్రిందకు దిగుతున్న వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది. 'కొత్త విషయాల్ని ప్రయత్నించడానికి ఎప్పుడూ భయపడకండి. మీ శక్తి సామర్థ్యాల్ని తెలుసుకొని మీరు ఆశ్చర్యానికిలోనవుతారు' అంటూ ఆ వీడియోకు క్యాప్షన్‌ను జత చేసింది సమంత.

# తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా ఆర్.కె.గౌడ్


రమణారెడ్డి, గురురాజ్, ఆర్.కె.గౌడ్, రవీంద్రగుప్తా తదితరులు

తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన సలహాదారుడిగా నిర్మాత ఎ.ఎం.రత్నం, ఉపాధ్యక్షులుగా గురురాజ్, రంగా రవీంద్ర గుప్తా, అలీభాయ్, సెక్రటరీలుగా కె.వి.రమణారెడ్డి, కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీస్‌గా వి.మధు, పూసల కిషోర్, రవీంద్రగౌడ్, జాయింట్ సెక్రటరీలుగా సతీష్, నాగరాజు గౌడ్, శంకర్ గౌడ్, కోశాధికారిగా రామానుజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ 'తెలంగాణ ఫిలిం ఛాంబర్ కోసం భవనాన్ని నిర్మిస్తాం. పది ఎకరాల్లో సినీ కార్మికుల ఇళ్లకు స్థలం కేటాయిస్తాం. 24 విభాగాల కార్మికులకు పని దొరికేలా చూస్తాం' అని చెప్పారు.

# రాజకీయ వ్యంగ్యాస్త్రం

నైనా గంగూలీ, ఈస్తర్ అనిల్, ఈశ్వరీరావు, రోహిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జోహార్'. భానుసందీప్ నిర్మాత. తేజ మార్ని దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. ప్రీలుక్‌ను ఆదివారం విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ ''వంగవీటి' చిత్రానికి రామ్‌గోపాల్‌వర్మ వద్ద దర్శకత్వశాఖలో, రచయిత విజయేంద్రప్రసాద్ వద్ద రచనా విభాగంలో పనిచేశాను. రాజకీయ వ్యంగ్యాస్త్రంగా తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా కథ ఇది. ఐదు పాత్రల నేపథ్యంలో నాలుగు కథల సమాహారంగా ఉంటుంది. వారణాసి, రాజమండ్రి, కాకినాడ, వైజాగ్‌లలో చిత్రీకరించాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం' అని చెప్పారు. శుభలేఖ సుధాకర్, చైతన్యకృష్ణ, అంకిత్ కొయ్య ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి, సంగీతం: ప్రియదర్శన్.


ఇస్తర్ అనిల్

# ప్రయాణంలో పదనిసలు


దామోదరప్రసాద్, కృష్ణచంద్ర, డి.ఎస్.రావు, కరోణ్య

కృష్ణచంద్ర, కరోణ్య కత్రిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్లు మీ శ్రీమతి'. హంసవాహిని టాకీస్ పతాకంపై ఎం.ఎస్.రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ బోడపాటి దర్శకుడు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కె.ఎల్. దామోదరప్రసాద్ క్లాప్‌నివ్వగా, ప్రసన్నకుమార్ కెమెరా స్విఛాన్ చేశారు. సాగర్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రోడ్ జర్నీ నేపథ్యంలో రూపొందుతున్న వినోదభరిత చిత్రమిది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగుతూ ఉత్కంఠను పంచుతుంది. అక్టోబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి సింగిల్ షెడ్యూల్‌లో పూర్తిచేస్తాం' అని తెలిపారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే చిత్రమిదని నిర్మాత పేర్కొన్నారు. మహిళలకు ఈ చిత్రం చక్కటి సందేశాన్ని అందిస్తుందని కథానాయిక కరోణ్య కత్రిన్ చెప్పింది. ఇందులో మూడు పాటలుంటాయని, సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రమిదని సంగీత దర్శకుడు వెంగీ పేర్కొన్నారు. డి.ఎస్.రావ్, శశి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వెంగీ, ఛాయాగ్రహణం: తోట.వి.రమణ.


అమిత్, ఇందు

# చీమతో భామ ప్రేమ

'సృష్టిలోని అల్పప్రాణి అయిన చీమ మనిషిగా మారాలని మనసు పడుతుంది? ఆ చీమ ప్రయత్నం సాధ్యమైందా? ఆ చీమకు ప్రేమ, శృంగారం తోడైతే ఏం జరిగిందనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం' అని అంటున్నారు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'చీమ-ప్రేమ మధ్యలో భామ'. అమిత్, ఇందు జంటగా నటిస్తున్నారు. ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. ఫస్ట్ కాపీ సిద్ధమైంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ యువ జంట ప్రేమ ప్రయాణానికి అందమైన దృశ్యరూపమిది. కుటుంబ విలువల, వినోదం అంశాల సమ్మిళితంగా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'చీమ పాత్ర నేపథ్యంలో వచ్చే గ్రాఫిక్స్ అలరిస్తాయి. రవివర్మ బాణీలు, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, గీతా మాధురి అలపించిన పాటలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. సెన్సార్ పూర్తిచేసి సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని అన్నారు. సుమన్, హరిత, పురంధర్ కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవివర్మ, సినిమాటోగ్రాఫీ: ఆరిఫ్ లలాని.

